
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
గురువారం 17 ఆగస్టు 2017 | 16

30 రోజుల్లో
15వేల కేసులు
379 మంది కోర్టుకు..
రోడ్డు భద్రతే లక్ష్యం
ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
20న ఎల్‌ఎల్‌ఆర్ మేళా
డీటీసీ శివరామ ప్రసాద్
14

పెళ్లి కారు బోల్తా
నవ దంపతుల సహా పదిమందికి గాయాలు
వరుడి ఇంటికి వస్తుండగా ప్రమాదం
6

రోడ్లు భవనాల శాఖ పరిధిలోని గూడూరు - దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధి పనులకు రూ. 35 కోట్లతో పిలిచిన టెండర్లు ఏకపక్షంగా ఖరారు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గూడూరు నియోజకవర్గం లో ఓ టీడీపీ నేతకు ఐదు శాతం కమీషన్లు ఇచ్చేలా ఒప్పందాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో స్వయంగా ఓ మంత్రి జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారని సమాచారం. దీంతో ఇంజనీర్లు ఆ నేతకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదే టెండర్లను ఖరారు చేస్తే ప్రభుత్వంపై రూ. 1.75 కోట్లు అదనపు భారం పడనున్నది. పోటీ పడి అంచనా వ్యయం తగ్గింపుతో షెడ్యూల్ దాఖలు చేసిన కాంట్రాక్టర్‌పై తీవ్ర ఒత్తిళ్లు తీసుకువచ్చి తప్పుకోవాలని హెచ్చరిస్తున్నట్లు ప్రచా రం సాగుతోంది. అభివృద్ధి పనుల్లో రాజకీయ పైరవీలు చోటు చేసుకోవడం గూడూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

ఏకపక్షంగా టెండర్లు ?


కడివేడు దగ్గర గూడూరు - దుగరాజపట్నం రోడ్డు

- దుగరాజపట్నం రోడ్డు పనులు ఒకరికే అప్పగింత!
- విలువ రూ. 35 కోట్లు
- ఐదు శాతం పెంపుతో షెడ్యూల్ దాఖలు
- ఖరారైతే ప్రభుత్వంపై రూ.1.75 కోట్లు భారం
- గూడూరు టీడీపీ నేతకు ఐదు శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందం
- వ్యవహారాలు సర్దుబాటు చేసిన ఓ మంత్రి
- ఆర్అండ్‌బీలో కాంట్రాక్టర్ల గగ్గోలు

8 లో..




తరలుతున్న తెల్లరాయి
- కొండలు తొలుస్తున్న అక్రమార్కులు
- అనుమతికి, తవ్వకాలకు సంబంధమే లేదు
- ప్రభుత్వ భూముల్లోనూ యథేచ్ఛగా వెలికితీత
- ఖజానాకు భారీ గండి
- పట్టించుకోని అధికారులు


వివరాలు 9లో..

సున్నం పెట్టేశారు..
- బ్లీచింగ్, ఫినాయిల్, సున్నం, ఫాగింగ్‌ల పేరుతో నిధుల స్వాహా
- పలు పంచాయతీల్లో ప్రతి సీజన్‌లో ఇదే తంతు
- క్షేత్రస్థాయిలో కనిపించని పారిశుధ్య నిర్వహణ
- గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులు
- ప్రముఖుల పర్యటన పేరుతోనూ జేబులు నింపుకుంటున్న వైనం

8 లో..



జిల్లాలోని కొంతమంది అధికారులు పంచాయతీలకు 'సున్నం' పెడుతున్నారు. పారిశుధ్యం పేరుతో నిధులు స్వాహా చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వారి పంట పండుతోంది. పారిశుధ్య నిర్వహణ పేరుతో బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్, ఫాగింగ్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టకుండానే రికార్డుల్లో చేసినట్లు చూపిస్తూ రూ.లక్షలు మింగేస్తున్నారు. ఏటా పారిశుధ్యానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా, వ్యాధుల తీవ్రత మాత్రం తగ్గడంలేదు. అంతేకాక వీఐపీల పర్యటన పేరుతో ఖర్చుచూపి కూడా జేబులు నింపుకుంటున్నారు.



- పాఠశాలల్లో కదలని సిలబస్
- రేషనలైజేషన్, బదిలీలతో రెండు నెలలు కాలయాపన
- ఇప్పటికీ టీచర్లకు అందని ఆర్డర్లు
- విద్యార్థులపై దృష్టి సారించని అయ్యోర్లు

సాగని బోధన
ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు గడిచింది. ఇంతవరకు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సక్ర మంగా సాగలేదు. రేషనైజేషన్, టీచర్ల బదిలీల ప్రక్రియలతో సిలబస్ గురించి ఉపాధ్యాయులు మరచిపోయారు. బదిలీలు పూర్తయినా ఇంతవరకు వారికి ఆర్డర్లు అందలేదు. దీంతో ఉన్న చోటనే మొక్కుబడిగా పాఠాలు చెబుతున్నారు. మూడు, నాలు గు రోజుల్లో ఆర్డర్స్ పంపుతామని డీఈవో తెలిపారు. బదిలీ అయిన స్థానాల్లో వారు చేరి, అప్పుడైనా సక్రమంగా పాఠాలు చెబుతారో.. లేదో.. అన్నది చూడాలి.

- వివరాలు 7లో

కావలి వాసి చెన్నైలో అదృశ్యం
సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సాయితేజ
బీచ్‌కని వెళ్లి తిరిగిరాని వైనం



కిడ్నాప్ చేశారని తల్లిదండ్రుల అనుమానం
పోలీసులకు ఫిర్యాదు

- వివరాలు మెయిన్‌లో

పోలీసు కస్టడీకి ఆ నలుగురు
- ఒక్క రోజు విచారణకు అవకాశం
- పరారీలోనే శరత్‌చంద్ర, సుభాష్

3

దైన్య స్థితిలో చిట్టేడు దొరల కుటుంబం

● నాడు రాజభోగం.. నేడు కడు పేదరికం
● మూడు తరాలకు వారసురాలిగా అరవింద సులోచనమ్మ
● వారసత్వ భూములు కాపాడాలని వేడుకోలు ● పిడికెడు మెతుకుల కోసం అష్టకష్టాలు


మట్టిపొయ్యిపై వంట చేస్తున్న, (అంతర్‌చిత్రంలో) సులోచనమ్మ

ఒకనాడు పట్టుపరుపులపై శయనించిన ఆ దొరల కుటుంబం, నేడు కటిక నేలపై నిద్రిస్తున్నది. మూడు తరాలకు వారసురాలిగా ఉన్న ఆ వృద్ధురాలు నేడు పాడుబడిన, గబ్బిలాలు దర్శనమిచ్చే గృహంలో కాలం వెళ్లదీస్తున్నది. వేల మందికి ఉపాధి కలిగించి,అన్నం పెట్టిన ఆ తల్లి నేడు పిడికెడు మెతుకుల కోసం వెంపర్లాడుతున్నది. ఎవ రామె.. ఆమె కథ ఏమిటో తెలుసుకుందాం.

- కోట

1912లో తమిళనాడులోని కడలూరు ప్రాంతంలో ఉంటున్న లక్ష్మీకుమార నాయనవారు, దొరసానమ్మ దంపతులు తమపిల్లలు రాజరత్నం నాయనవారు, కృష్ణరాజ నాయనవార్లతో కలసి కోట మండలం చిట్టేడు ప్రాంతానికి వచ్చారు. లక్ష్మీకుమార నాయనవారు అదే సంవత్సరం కడలూరు, పరిసర గ్రామాలలో యుద్ధానికి వెళ్లాడు. విజేతగా తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో లక్ష్మీకుమారరాజ నాయనవారి నమ్మినబంట్లు అయిన శునకాలు ముందుగా ఇంటికి వచ్చా యి. వాటిని గుర్తించిన భార్య దొరసానమ్మ యుద్ధంలో భర్త చనిపోయాడని భావించింది. తను కూడా అగ్నిగుండంలో ఆత్మార్పణం చేసుకుంది. దీంతో లక్ష్మీకుమార నాయనవారు చిట్టేడుకి వచ్చేశారు. అప్పట్లో ఈ ప్రాంతం బ్రిటీషువాళ్ల పాలనలో ఉంది. దీంతో లక్ష్మీకుమార నాయనవారు చిట్టేడుతో పాటు మరో ఏడు గ్రామాలను తమ గుప్పెట్లో ఉంచుకుని పరిపాలన సాగిస్తున్నారు. అప్పట్లో ఈ ప్రాంతం అడవులు, చెట్లు, పొదలతో నిండి ఉండేది. వాటినన్నింటిని తొలగించి, చిట్టేడులో 20 ఎకరాల విస్తీర్ణంలో కోట, మరో 40 ఎకరాల్లో బురుజులు నిర్మించారు.


నాడు వాడుకలో ఉన్న చెక్క బీరువా

● **ఎంతోమంది పరిచారికలు**

ఆ రాజకుటుంబానికి వేలాదిమంది పరిచారికలుగా ఉండేవారు. వీరిని అప్పట్లో చిట్టేడు దొరలుగా పిలిచేశారు. వీరి కుటుంబం నుంచి మహిళలు ఏడాదికి ఒకసారి తమిళనాడులోని కడలూరులోని దేవరస్వామి ఉత్సవాలకు వెళ్లేవారు. ఆ సమయంలో మాత్రమే ముసుగులతో గుర్రపుబండ్లలో వెళ్లేవారు. అంతకుతప్పితే ఆ కుటుంబంలోని మహిళలను చూసేందుకు


రెండో తరానికి చెందని దొరరాజ నాయనవారు, వెంకటరమణమ్మ ఫొటోలు

వీలు లేదు. పట్టుపాన్పులు, గుర్రపు స్వారీలు అష్ట ఐశ్వర్యాలతో చిట్టేడు కుటుంబాలు అలరారుతూ వచ్చాయి. కొన్ని వందల మంది వీరి కోటవద్ద పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ వచ్చారు.

● **మగ సంతానం లేక..**


సులోచనమ్మ అక్క సుదర్శనమ్మ విగ్రహం

కొంతకాలానికి లక్ష్మీకుమార్‌రాజ చనిపోయాడు. ఆ తర్వాత ఆయన పిల్లలు రాజరత్నంనాయనవారు, కృష్ణరాజ నాయనవారు పరిపాలన సాగిస్తూ వచ్చారు. వీరికి మగపిల్లలు పుట్టలేదు. వారికి లక్ష్మీకాంతం, దొరసానమ్మ, సుదర్శనమ్మ, అరవింద సులోచనమ్మలు పుట్టారు. 1947 తర్వాత చిట్టేడు దొరల ఆధీనంలో ఉన్న భూములు, వారు నివసిస్తున్న కోట, బురుజులను అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో దొరల వంశస్థులు బలవన్మర ణాలకు పాల్పడ్డారు. దీంతో ఆ కుటుంబంలో ఆడపిల్లలే మిగిలారు. వీరు పెళ్లిళ్లు చేసుకోలేదు. వీరుకూడా ఒకరి తర్వాత ఒకరు మరణించారు. ఏడాది క్రితం మూడో తరానికి చెందిన సుదర్శనమ్మ కూడా అనారోగ్యానికి గురై మృతిచెందింది. ఇక మిగిలించి అరవింద సులోచనమ్మ మాత్రమే. ప్రస్తుతం ఆమె దీనావస్థలో ఉంది.

● **పట్టెడన్నం కోసం..**

గతంలో అష్టైశ్వర్యాలు అనువించిన అరవింద సులోచనమ్మ ప్రస్తుతం చిట్టేడులోని ఓ పాడుబడిన ఇంట్లో ఉంటున్నది. వారి ఆస్తులు అన్యాక్రాంతం కాగా, కొన్ని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఉంది. అయితే తమ తల్లిదండ్రుల పేరున ఇప్పటికీ భూములు ఉన్నాయని, ఆ భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని ఆమె చెబుతోంది. వాటిని పరిరక్షించాలంటూ పదేళ్లుగా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంది.

● **నాటి తప్పులకు నేడు శిక్ష**

అప్పట్లో వీరి కుటుంబీకులు ఎవరైనా తప్పు చేస్తే కఠినంగా శిక్షించే వారట. బహిరంగంగా చెట్లకు కట్టేసి చర్మం ఒలిచేవారట. ఇంకా అత్యంత కిరాతకంగా శిక్షలు వేసేవారట. ఆ పాపాల ఫలితమే నేడు దొరల కుటుంబంలో చివరి సంతానం అయిన అరవింద సులోచనమ్మ అనుభవిస్తున్నదని కొందరంటారు. ఏది ఏమైనా 70 ఏళ్ల వయసులో అవస్థలు పడుతున్నా ఆమెను ప్రభుత్వమైనా ఆదుకోవాల్సి ఉంది.


బురుజులు ఉన్నచోట మొలచిన కర్రతుమ్మచెట్లు

నేతన్నకు ‘ ముద్ర ’ రుణం

● చేనేత, జౌళిశాఖ ఏడీ విశ్వనాథం బీమయ్య

?: చేనేత కార్మికులకు రుణ సదుపాయం కష్టంగా ఉందనే విమర్శ ఉంది. మీరేమంటారు.

!: చేనేత కార్మికులకు అర్హతను బట్టి రుణాలు అందచేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర పథకం ద్వారా వారికి చేయూతనిస్తున్నాము. అర్హతలను ప్రమాణికంగా తీసుకుని లబ్ధిదారుల జాబితా తయారు చేశాము.

?: జిల్లాలో ఎంత మంది కార్మికులకు ముద్ర రుణాల అవకాశం కల్పించారు.

!: చేనేత పరిశ్రమ ఉన్న ప్రాంతాలలోని సమీప బ్యాంకుల ద్వారా అర్హత కలిగిన వారందరికీ రుణాలు ఇస్తున్నాము. 400 మంది కార్మికులు కనీసం రూ. 50 వేలు రుణం తొలివిడత కింద అందచేస్తున్నాము.

?: రుణ మంజూరుకు బ్యాంకర్లు ఆసక్తిగా లేరనే ఆరోపణలున్నాయి. మీ స్పందన ఏమిటి.

!: అలా ఏమీ లేదు. రుణాలివ్వడానికి బ్యాంకులు సుముఖంగానే ఉన్నాయి. వారికి చేనేత కార్మికుల కష్టాలు వివరిస్తున్నాము. ఇటీవల చేనేత దినోత్సవం సందర్భంగా అన్ని బ్యాంకుల ద్వారా సుమారు రూ. కోటి రుణం కార్మికులకు ఇచ్చాము.

?: నేత కార్మికులకు గుర్తింపు కార్డుల జారీ సమస్యగా ఉందంటున్నారు. నిజమేనా...

!: మాన్యువల్ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. జిల్లాలో స్మార్ట్ సర్వే జరుగుతోంది. అందులో ఇప్పటి వరకు నాలుగు వేల మందిని సర్వే బృందాలు గుర్తించాయి. సర్వే అనంతరం స్మార్ట్ విధానంలో గుర్తింపు కార్డులు ఇస్తాము. అవి ఆన్‌లైన్ ద్వారా మంజూరవుతాయి. ఇందులో ఉపవృత్తి కార్మికులకు కూడా స్థానం కల్పిస్తున్నాము.

?: చేనేత కుటుంబాలకు ఆరోగ్య పథకం అమలు మాటేమిటి.

!: అది ప్రభుత్వ నిర్ణయం. మేము పథకాల అమలును పర్యవేక్షించే అధికారులం మాత్రమే. ఆరోగ్య పథకాలను గతంలోనే ప్రభుత్వం ఆపేసింది. బీమా పథకాల్లోనూ భారీగా మార్పులు చేస్తున్నారు. విధివిధానాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.



- నెల్లూరు(రూరల్)

సైబర్ నేరానికి యత్నం

ఉదయగిరి: తాను భారతీయ స్టేట్‌బ్యాంకు మేనేజర్‌నని, ఎటిఎం కార్డు వివరాలు చెప్పాలంటో ఫోన్ రావడంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి అప్రమత్తమయ్యాడు. సైబర్ నేరమని గుర్తించాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉదయగిరి దేవలాలగడ్డకు చెందిన షేక్ రహమత్‌షరీఫ్ స్థానిక మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం కళాశాలలో ఉండగా తన ఫోన్ నెంబర్‌కు 9570250552 నుంచి కాల్ వచ్చింది. ‘మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయ్యింది. ఆధార్ నెంబర్ చెపితే పునరుద్ధరిస్తాం’ అంటూ మాట్లాడసాగాడు. తనకు ఆధార్ నెంబర్ లేదని విద్యార్థి తెలపడంతో ఏటీఎం కార్డు నెంబర్ చెప్పాలని అడిగాడు. దీంతో విద్యార్థి ఏ బ్యాంకు ఏటీఎం కార్డుచెప్పాలని అడగ్గా ఎస్‌బీఐ ఏటీఎం నెంబర్ చెప్పాలని అవతలి వైపు నుంచి సమాధానం వచ్చింది. తనకు ఎస్‌బీఐ ఏటీఎం లేదని చెప్పడంతో ఇతర ఏ బ్యాంకు ఏటీఎం నెంబరైనా చెప్పాలని అడిగాడు. విద్యార్థి స్నేహితుడు అవతలి వ్యక్తితో మీరెవరు ప్రశ్నించగా వెంటనే ఫోన్ కట్ చేశాడు. అనంతరం విద్యార్థి ఆ ఫోన్ ఎక్కడ నుంచి ఆరాతీశాడు. చెన్నైలో సిమ్‌కార్డు కొనుగోలు చేశారనీ, పాట్నా నుంచి మాట్లాడినట్లు ఆధారాలు లభ్యమయ్యాయని మహమ్మద్‌షరీఫ్ తెలిపారు. అదే నెంబర్‌కు తాను పలుమార్లు ఫోన్ చేసినా ఫోన్‌కాల్స్ వెళ్లడంలేదని తెలిపారు. తాను అప్రమత్తంగా వ్యవహరించడంతో సైబర్ నేరం బారినపడలేదని చెప్పారు. తాను అవతలి వ్యక్తి మాటలను రికార్డు చేశానని, పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదని తెలిపారు.

ఉద్యోగస్వరం

వైద్య ఉద్యోగుల సమస్యలు

పరిష్కరించాలి

● ఏపీఎన్‌జీవో సహాయ అధ్యక్షుడు ఆంజనేయ వర్మ




“జిల్లాలో వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి. ఇంతవరకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించ లేదు. దీని కోసం ఒక కమిటీ వేయాల్సి ఉన్నా ఇంతవరకు వేయలేదు. హెల్త్‌కార్డుల మంజూరులో అలసత్వం కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది నియామకం పూర్తిగా జరగ లేదు. దీంతో వైద్య సేవలు కుంటుబడుతున్నాయి. 160 మందికి పైగా ఏఎన్‌ఎంల నియామకం జరగాల్సి ఉంది. సెంకడ్ ఏఎన్‌ఎంల పైనే భారం ఉండడంతో అవసరమైన వైద్యం అందని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాలలో పారిశుద్ధ్య నిధులు సక్రమంగా వినియోగించే పరిస్థితి లేకపోవడంతో అక్కడ వ్యాధులు ప్రబలుతున్నాయి.”

- నెల్లూరు (వైద్యం)

● కలెక్టర్ చొరవతో ముందంజ
● హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి

గృహ నిర్మాణంలో తొలి స్థానం మనదే

నెల్లూరు (వ్యవసాయం) : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో మన జిల్లానే తొలి స్థానంలో ఉందని ఆ సంస్థ జిల్లా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణంలో జిల్లాకు 2016 - 17లలో 11,200 ఇళ్లు మంజూరైతే వాటిలో 5,180 ఇళ్లు పూర్తి చేశామన్నారు. మిగిలినవి అక్టోబర్‌కు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇందులో ఇప్పటివరకు రూ.50 కోట్లు ఖర్చుచేశామన్నారు. ఎన్టీఆర్ అర్బన్ ఇళ్ల నిర్మాణ పథకం కింద 1693 ఇళ్లు మంజూరు కాగా అందులో 1683 గ్రౌండ్ అయ్యాయన్నారు. 661 ఇళ్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులకు రూ. 16 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద జిల్లాకు 3,225 ఇళ్లు మంజూరైతే అందులో 2,645 ఇళ్లు గ్రౌండింగ్ పూర్తికాగా 6,72 ఇళ్లు పూర్తిగా నిర్మాణాలు అయ్యాయన్నారు. రూ. 12 కోట్ల మేర చెల్లింపులు కూడా చేశామన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలను అక్టోబర్‌కు పూర్తి చేసితీరుతామన్నారు. కలెక్టర్ ముత్యాలరాజు ప్రత్యేక చొరవ చూపడం వల్ల రాష్ట్రంలో ముందుంజలో ఉన్నామని వివరించారు. బిల్లుల మంజూరులో ఇబ్బందులు లేవన్నారు. అలాంటి ఇబ్బందులు ఎవరైనా ఎదుర్కొంటే స్వయంగా తనకు ఫిర్యాదు చేయవచ్చని కోరారు.


పీడీ రామచంద్రారెడ్డి

పోలీసు కస్టడీకి ఆ నలుగురు

● ఒక్క రోజు విచారణకు అవకాశం
● పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లపై ఆరా
● పరారీలోనే శరత్‌చంద్ర, సుభాష్‌లు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆ నలుగురు క్రికెట్ బుకీలను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ బుధవారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒక్క రోజు మాత్రమే విచారణకు అవకాశం కల్పిస్తూ ఆ తరువాత కోర్టుకు హాజరు పరచాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే కృష్ణసింగ్, మరో నలుగురిని పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం కోర్టుకు హాజరుపరచిన సంగతి తెలిసిందే. కావలి టూ టౌన్ పరిధిలో నమోదైన కేసుల్లో గుర్రం వెంకటేశ్వర్లు, నంద్యాల అరుణ్‌కుమార్, మన్నెం శ్యాం ప్రసాద్, దాసరి సుశాంత్‌లను పోలీసు కస్టడీకి అప్పగించాలంటూ కోర్టులో పిటిషన్ వేశారు. కావలి పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తుండడం వారి అభ్యర్థన మేరకు ఒక్క రోజు విచారణకు అవకాశం ఇవ్వడంతో తిరిగి వారిని జ్యూడిషియల్ రిమాండ్‌కు అప్పగించాల్సి ఉంది. కృష్ణసింగ్‌తోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మూడు రోజులపాటు విచారించి వారి నుంచి కొంత సమాచారాన్ని సేకరించారు. ప్రస్తుతం ఈ నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ సాగించనున్నారు. ప్రధాన బుకీలుగా ఉన్న శరత్‌చంద్ర, సుభాష్‌లు పరారీలోనే ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. పోలీసుల అదుపులో ఉన్న బ్రహ్మంనాయుడును మరో రెండు రోజుల పాటు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆ తరువాత అధికారికంగా అరెస్టులు చూపే అవకాశం ఉంది. జిల్లాలో పంటర్లు, బుకీల వివరాలను ఆరా తీస్తూ ఎక్కడికక్కడ టాస్క్‌ఫోర్స్ వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పట్లో ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం ముగిసే పరిస్థితి కనిపించక పోవడంతో మరి కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తారని తెలిసింది. సూత్ర, పాత్రధారులపై దర్యాప్తు సాగుతోంది. నెల్లూరు జిల్లాలో మొదలైన ఈ అరెస్టులు, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతూ ఎందరినో బుకీలను అదుపులోకి తీసుకుంటున్నారు.

జిల్లాకు కొత్తగా 30 వైద్యుల పోస్టుల మంజూరు


ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వరసుందరం

రాపూరు: జిల్లాకు కొత్తగా 30 వైద్యులు పోస్టులు మంజూరయ్యాయని, అందులో 23 మంది స్పెషలిస్టు వైద్యులు ఉన్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం తెలిపారు. రాపూరులో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు వేపినాపి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మంజూరైన ప్రత్యేక వైద్యులను జిల్లాలోని 14 సీహెచ్‌సీలకు కేటాయిస్తామన్నారు. జిల్లాలో ఎమ్మార్ వ్యాక్సిన్ విజయవంతంగా సాగుతోందన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పుల శాతం పెంచాలన్నారు. అలాగే రాపూరులో రూ.4 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను వచ్చే నెలలో ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అన్ని వసతుతో కూడిన ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఆధునిక వసతులతో కూడిన భవనాలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆసుపత్రి ప్రారంభంలోనే వైద్యులు, వైద్యసిబ్బంది నియమకాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ముయూన్, పూర్ణిమ, శ్రీధర్, ఉమాదేవి, వేపినాపి వైద్యులు సునీల్ బాబు, నర్మదాదేవి పాల్గొన్నారు.

కావలి పురపాలక సంఘం
ఇ - ప్రోక్యూర్‌మెంట్ ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.2029/2015/E1 తేది: 11-08-2017

కావలి పురపాలక సంఘం - ఇంజనీరింగ్ - ఇ - ప్రోక్యూర్‌మెంట్ ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి ఆర్.ఒ.సి.నెం.2029/2015/E1 సాదారణ నిధులు రూ.80.50 లక్షలు టెండరు నెం.30,31 బిడ్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం : 28-08-2017 సా: గం. 5.00 ల వరకు ప్రైజ్ బిడ్ తెరువబడు తేది మరియు సమయం : 29-08-2017 ఉ: గం. 10.00 లకు మిగిలిన వివరములుకు www.eprocurement.gov.in నందు సంప్రదించండి.

సంప్రదించవలసిన సెల్ నెం : 9849908033.

కమీషనర్
కావలి పురపాలక సంఘం

నేడు కలిగిరిలో నేత్ర వైద్యశిబిరం

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అమ్మ-నాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మంగళగిరి వేణుగోపాలరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో మోడరన్ ఐ హాస్పిటల్(నెల్లూరు), బీఎస్ఆర్ దంత వైద్యశాల(కావలి), ఆర్థోకడప రిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అలంకార ప్రాయంగా

ఈ-మరుగుదొడ్లు

అల్లూరు: పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అయితే కొంత మేర అవి సఫలీకృతం కావడం లేదనడంలో అతిశయోక్తి లేదు. అందులో భాగంగానే ఈ-మరుగుదొడ్లు ఒకటిగా చెప్పుకోవచ్చు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల వద్ద ఈ-మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. అవి కూడా నిరుపయోగంగానే. వినియోగించే అవకాశం లేకనో నిర్వహణ లోపమో అర్థం కావడం లేదు గానీ మొత్తానికి ఈ-మరుగుదొడ్లు మాత్రం జిల్లాలో ప్రాథమిక పాఠశాలల వద్ద అలంకారప్రాయంగానే మిగిలాయి. గత ఆర్థిక సంవత్సరంలో రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో వీటిని నిర్మించడం జరిగింది. మండలానికి 6 నుంచి 8 వరకు ఈ-మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీటిని మహేంద్ర, టాటా కంపెనీల వారికి కాంట్రాక్టుకు ఇవ్వడంతో ఆ కంపెనీవారు పల్లె ప్రాంతాల్లోని పాఠశాలల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. జిల్లాలో 46 మండలాలకుగానూ దాదాపుగా 300 కుపైగా ఈ-మరుగుదొడ్లు నిర్మించారు. నిర్మించినప్పటి నుంచి ఇవి మూతపడిన దశలోనే మిగిలాయి. వీటిని వినియోగించుకునే పద్ధతి తెలియక విద్యార్థులు పాఠశాలల వద్ద ఉండే పాత మరుగుదొడ్లను వినియోగించుకోవడం జరుగుతోంది. దీంతో ఈ-మరుగుదొడ్లు దాదాపుగా 20 శాతం కూడా వినియోగంలో లేవనే విషయం అర్థమవుతోంది.

వినియోగం ఇలా : ఈ-మరుగుదొడ్లను వినియోగించే విద్యార్థులు వీటిని దాదాపు పదిసార్లు వినియోగిస్తే వాటంతట అవే నీటిని విడుదల చేయడం శుభ్రపరచుకోవడం తదితర కార్యక్రమాలను చేస్తుంది. దీని ద్వారా విద్యార్థులు చేయలేని పనిని కూడా ఆటోమేటిక్‌గా ఈ-మరుగుదొడ్లలో ఏర్పాటు చేసిన పరిజ్ఞానంతో శుభ్రం చేసుకుంటుంది. దీంతో బాలలు మల,మూత్ర విసర్జన చేసినప్పటికీ వాటికి మరొక వ్యక్తి అవసరం లేకుండాపోతుంది. అయితే వీటిని వినియోగించలేకపోవడానికి నిర్వహణ లోపమే కారణంగా భావిస్తున్నారు.

నిర్వహణ లోపమే కారణం: ఈ-మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన కంపెనీల వారు కొంతకాలం వరకు నిర్వహణ వారి ఆధ్వర్యంలోనే ఉంటుంది. అయితే వాటి నిర్వహణ సరిగా లేనందున వాటిని వినియోగించుకునే అవకాశం ఉన్నా మూతలు వేసి ఉండడంతో అవి అలానే దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణ కోసం సదరు కంపెనీవారు ఉపాధిహామీ, వెలుగు, అటవీశాఖ వారికి, మరి కొన్ని ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టుకు ఇవ్వడం జరిగింది. దీని ద్వారా ప్రతి నెలా రూ.1,000 వంతున నిర్వహణ కాంట్రాక్టర్లకు అందుతుండేవి. అయితే నిర్వహణ మాట అటుంచితే వాటి ద్వారా వచ్చే నగదు తీసుకొని మిన్నకుండిపోతున్నారు. దీంతో వాటి నిర్వహణ మరుగున పడింది. గత ఆర్థిక సంవత్సరానికి ముగిసిపోవడంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల ద్వారానే నిర్వహణ కొనసాగిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టరు చొరవ తీసుకొని మరలా నిర్వహణ కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



వినియోగంలో ఉన్న నార్తుమోపూరు ప్రాథమిక పాఠశాల వద్ద ఈ-మరుగుదొడ్డి

రూ.కోట్లు నిరుపయోగమే : విద్యార్థులకు ఉపయోగకరంగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక్కో మండలానికి రూ.లక్షలు వెచ్చించి ఒకటిన్నర ఏడాది క్రితం వీటిని నిర్మించారు. అప్పటి నుండి వినియోగంలో లేకుండా పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్లు లేకుండా విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయకుండా మరుగుదొడ్లు ఉన్నచోటనే వీటిని మరలా ఏర్పాటు చేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో రూ.కోట్లు దుర్వినియోగమయ్యాయని ప్రజలు అంటున్నారు.

నిర్మించినా ఫలితం లేదు : ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నూతన పరిజ్ఞానాన్ని పరిచయం చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ-మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇదివరకే ఉన్న సాధారణ మరుగుదొడ్లలో నీటి వసతి సరిగా లేకపోవడంతో విద్యార్థులు మూత్రవిసర్జనకు, మలవిసర్జనకు బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ-మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వీటిని వినియోగించుకునే పరిజ్ఞానం విద్యార్థులకు లేకపోవడం గమనార్హం. గిరిజన ప్రాంతాల్లో ఉండే ప్రాథమిక పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయడంతో వీటి వినియోగం నిరుపయోగంగా మారింది.

అవసరమైన చోట నిర్మించలేదు: మరుగుదొడ్లు అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి చెందే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన ఈ-మరుగుదొడ్లు వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించారు. దీంతో అవి అలంకారప్రాయంగానే మారాయి తప్ప విద్యార్థులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. అవసరమైన చోటమాత్రం సాధారణ మరుగుదొడ్లలో నీరు, తలుపులు తదితర వసతులు లేకుండా పోవడంతో కొన్ని చోట్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉదాహరణకు అల్లూరు పంచాయతీలోని ఎంపీయూపీ(బోర్డు స్కూలు) పాఠశాలలో మరుగుదొడ్లలో నీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పత్రికల్లో పలుమార్లు ప్రకటనలు వచ్చినా ఈ పాఠశాలపై సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదు. అత్యధికంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఈ-మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వాటిపై అవగాహన లేని అక్కడి విద్యార్థులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇదేవిధంగా మండలంలో పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ-మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఉత్తమ సేవా

అవార్డు గ్రహీత ఆర్డీవోకు సత్కారం

కావలిటౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కావలి ఆర్డీవో ఐ. భక్తవత్సలరెడ్డిని బుధవారం పలువురు సత్కరించి అభినందించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఆత్మకూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు శాలువాలతో, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గిరిజన నాయకులు చలంచర్ల రాజ, దగ్గుమాటి శీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదినారాయణరెడ్డిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కావలి: స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా జమ్మలమడుగు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో పాల్గొన్న మార్కెటింగ్ శాఖా మంత్రి ఆదినారాయణరెడ్డి దళిత, గిరిజనులను అవమానపరిచే విధంగా మాట్లాడినందుకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దళితులు శుభ్రంగా ఉండరని, వారు చదువుకోరని, శుభ్రత పాటించరని హీనంగా మాట్లాడడం బాధాకరమన్నారు. అంబేద్కర్ రిజర్వేషన్లు పదేళ్లు ఇవ్వమన్నాడని 70 ఏళ్ల అవుతున్న వారికి ఇంకా రిజర్వేషన్‌లు ఎందుకని మంత్రి దళిత గిరిజనుల పట్ల అవమానకరంగా మాట్లాడినందుకు ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన నేతలు సంపత్‌కుమార్, చిట్టిబాబు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

కావలి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు పొందిన కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్న, సంయుక్త సేవా సమితి అధ్యక్షుడు సురేంద్రలను బుధవారం రెడ్‌క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. వీరు ఉత్తమ రెడ్‌క్రాస్ వాలంటీర్లుగా ఎంపికై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదినారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం అభినందనీయమని కావలి బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీఎల్ఎన్ రెడ్డి, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

తోటపల్లిగూడూరు : ఈ నెల 25వ తేదీన జరగనున్న వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నరుకూరు గ్రామంలో వినాయక విగ్రహాల ప్రతిమలను అత్యంత వైభవంగా రంగురంగులతో రూపొందిస్తున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రధాన కూడలైన నరుకూరు సెంటర్ విగ్రహాల అమ్మకాలకు పెట్టింది పేరు. ఎవరైతే ముందుగా అడ్వాన్స్ ఇచ్చారో వారికే విగ్రహాలు తయారు చేస్తున్నారు. గతంలో అడ్వాన్సులు ఇవ్వకపోయినా విగ్రహాలు తయారుచేసి విక్రయించేవారు. దీనివల్ల విగ్రహాలు అమ్ముడుకాని పరిస్థితుల్లో నష్టపోయేవారు. పైగా విగ్రహ తయారీకి అవసరమైన ముడిసరుకు ధరలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఆర్డర్లిచ్చిన మేరకే విగ్రహాలు తయారు చేస్తున్నామని తయారీదారులు పేర్కొంటున్నారు.

పెదపవని బస్టాండ్ పునఃప్రారంభం

కావలిటౌన్: కావలి పట్టణ పెదపవని బస్టాండ్ బుధవారం పునఃప్రారంభం కావడంతో బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు సాగాయి. బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు స్థానిక వ్యాపారులతో సమావేశం జరిగింది. ది జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జెట్టి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులతో గత నాలుగు నెలల నుంచి పెదపవని బస్టాండ్‌లో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. జెట్టి శేషారెడ్డి స్థానిక వ్యాపారస్తులు, ప్రయాణికులతో కలిసి బస్సులు తిరిగి పెదపవని బస్టాండ్‌లో నిలిపేందుకు చేసిన కృషి ఫలించిందన్నారు. అందుకు రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు ఆర్టీసీ ఆర్ఎం డీఎంతో మాట్లాడి పెదపవని బస్టాండ్ పునఃప్రారంభమయ్యేందుకు తోడ్పాటు అందించారన్నారు. జెట్టి శేషారెడ్డి మాట్లాడుతూ పెదపవని బస్టాండ్ పునఃప్రారంభమయ్యేందుకు తోడ్పాటు అందించిన బీద మస్తాన్‌రావుకు, స్థానిక టీడీపీ నాయకులు మలిశెట్టి, అమరా, పల్లపు కుమార్, నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ కిషోర్, రవ్వా సుబ్బారావు, ద్రోణాదుల వెంకటరావు, ఖమర్‌బాబు, బాలగురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమరా వేదగిరి

చెరువును ఆక్రమించారంటూ

ఆయకట్టు రైతుల ఫిర్యాదు

దగదర్తి: మండలంలోని చెన్నూరు పంచాయతీలో గల చెరువును పలువురు ఆక్రమించారంటూ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ జయప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన పలువురు సుమారు 50 ఎకరాల మేర చెరువు భూ భాగాన్ని ఆక్రమించారని ఆయకట్టు రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ చెరువు ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.

వంద శాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలు

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వందశాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సమ్, బోరాన్‌ను పంపిణీ చేస్తోందని పొదలకూరు సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కే నాగేశ్వరరావు తెలియజేశారు. మండలంలోని అల్లూర్తిలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చంద్రన్న భూసార పరీక్ష పత్రాలకు అనుసంధానం చేసి బయోమెట్రిక్ విధానంలో ఈ సూక్ష్మపోషకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కౌలుకార్డులు పొందిన రైతులు వ్యవసాయశాఖ ద్వారా పంటసాగు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

పురిణిలో రేపు నేత్ర వైద్యశిబిరం

అల్లూరు : మండలంలోని పురిణి పంచాయతీలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీఎంఆర్ ట్రస్ట్ మేనేజరు దొడ్ల వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన మోడ్రన్ కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పురిణి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 8.30 నుంచి 1.30 గంటల వరకు జరుగు ఈ కార్యక్రమాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని శస్త్ర చికిత్సకు ఎంపికైన వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డులను తీసుకురావాలని ఆయన కోరారు.

● ఇంటర్వ్యూ



విద్యుత్ వినియోగంలో రాయితీలు

నరసింహారావు, విద్యుత్‌శాఖ ఏఈ

? ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వినియోగదారులకు రాయితీలు ఏమైనా ఉన్నాయా...

!. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వినియోగదారులకు 50 యూనిట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్ అందజేస్తూ ఆ బిల్లులను ప్రభుత్వ చెల్లిస్తుంది.

? పేదలకు, కొత్త విద్యుత్ కనెక్షన్‌లకు రాయితీ ఉందా..

!. దీనదయాళ్ పథకం కింద గృహ వినియోగం కోసం పేదలకు రూ.125 లకే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నాం, కనెక్షన్ కావాల్సిన వారు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

? సోలార్ పంపుసెట్లు అందుబాటులో ఉన్నాయా.. వాటిపై రాయితీ ఉందా..

!. రైతులకు రూ.5 లక్షలు విలువ చేసే సోలార్ పంప్‌సెట్లను రూ. 55 వేలకే ఇవ్వడం జరుగుతుంది. వంద నుంచి 200 అడుగుల లోతు బోర్లు ఉన్న రైతులు రాయితీపై పంపుసెట్లను పొందవచ్చన్నారు.

? వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వం పోత్సాహకాలు అందిస్తుందా..

!. ఐదుగురు రైతులు గ్రూపులుగా ఏర్పడి విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు అయితే ఒక్కొక్క రైతు రూ.5,200 డిపాజిట్ చెల్లిస్తే 3 స్తంభాల లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుంది.

- కావలిరూరల్

ఉపాధి కూలీలకు బ్యాంకర్ల షాక్

- ఖాతాలకు చేరని ఉపాధి నగదు
- చేరిన డబ్బు పాత రుణాలకు జమ
- బ్యాంకుల చుట్టూ కూలీల ప్రదక్షిణలు

కొండాపురం: ఉపాధి కూలిని బ్యాంకుల ద్వారా చెల్లిస్తుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి కూలీలకు మొదట్లో నగదును వెలుగు సిబ్బంది సిబ్బంది పంపిణీ చేశేవారు. అనంతరం పోస్టాఫీసు ద్వారా నగదు చెల్లించారు. ఈ రెండు పద్ధతుల్లో పంపిణీ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో కూలీలకు నగదు చెల్లించేందుకు బ్యాంకులను ఎంచుకొన్నారు. బ్యాంకర్లు కూడా కూలీలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. బ్యాంకు అకౌంట్లలో నగదు జమకావాలంటే అకౌంటుకు ఆధార్ నెంబరు తప్పనిసరిగా అనుసంధానం జరగాలి. ఎక్కువమంది కూలీలకు వారి బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అను సంధానం జరగలేదు. ఉపాధి కూలి నగదు ఖాతాలలోకి జమ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకుకు వస్తే వారికి సమాధానం చెప్పడంలేదు. కూలీలు బ్యాంకులవద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. అదేసమయంలో బ్యాంకులలో కూలీలు తమ పొలాన్ని, బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు పొంది ఉన్నారు. మరికొంత మంది పాడిగేదెలు, గొర్రెలు కొనేందుకు బ్యాంకులలో రుణం తీసుకుని ఉన్నారు. ఉపాధి కూలి వారి ఖాతాల్లో పడగానే రుణానికి బ్యాంకర్లు జమ చేసుకుంటున్నారు. దీనిపై కూలీలు మండిపడుతున్నారు. ఇదిలావుంటే కొందరికూలీల నగదు ఇప్పటివరకు ఏ బ్యాంకు ఖాతాకూ జమకావడంలేదు. తమ నగదు ఎక్కడ జమ అవుతోందో తెలుసుకోలేకపోతున్నారు. కష్టపడి పనిచేసినా బ్యాంకర్లు తమ కడుపుకొడుతున్నారని వాపోతు న్నారు. మండల పరిధిలో సుమారు 15 వేలు ఉపాధి కూలీలుండగా రోజుకు సగటున 4 వేల మంది కూలీపనులు చేస్తున్నారు.



బ్యాంకు వద్ద కూలీలు

ఖాతాలకు జమకాని నగదు

పదివారాలుగా కూలీలబ్యాంకు ఖాతాకు నగదు జమలు ఆగిపోయాయి. వారానికి ఒక్కొక్క కూలీకి రూ 900 నుంచి రూ 1100 వరకు కూలీ వస్తుండగా 8 వారాలుగా నగదు జమలు పూర్తిగా ఆగిపోయాయి. సుమారు రూ 25 లక్షల నగదు రావాల్సి ఉంది. ఉపాధి కూలి నగదుతోనే కుటుంబపోషణ, పిల్లల చదువులు తదితర పనులు గడుపుకుంటున్న కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంది.

నగదు జమ కాలేదు



వంద రోజుల పనిదినాలు పూర్తయినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బ్యాంకు ఖాతాకు జమకాలేదు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదు. దీంతో కుటుంబపోషణ భారమైంది.

- కొరివి శ్రీదేవి, మర్రిగుంట

పది వారాల కూలి రాలేదు



ఐదు వారాలుగా పని చేసిన కూలి నగదు బ్యాంకుకు జమకాలేదు. కరువుతో అల్లాడుతున్న తరుణంలో ఉపాధికూలి నగదు జమకాకపోవడంతో కుటుంబపోషణ భారమవుతోంది. ఉన్నతాధికారులు ఆదుకోవాలి.

- ఆళ్ల అంకయ్య, సాయిపేట

ఆరువారాల నగదు జమకాలేదు

ఆరు వారాల కూలీల నగ దు బ్యాంకు ఖాతాలకు జమకాలేదు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి ఉంది. బ్యాంకు ఖాతాలకు నగదు జమకాని వా రు మా దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిసాం. 15 రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తాం.

- శ్రీనివాసులు, ఏపీవో, కొండాపురం

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బిట్రగుంట: స్థానిక ముక్కంటి కామాక్షితాయి సమేత మల్లీశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహ కలిశ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. మొదట శాంతి పూజలు, హోమ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ శిఖరాగంపై శాస్త్రోక్తంగా కలిశ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా రాధాకృష్ణయ్యనాయుడు, కూతుర్లు, అల్లుళ్ల వ్యవహరించారు. స్వామి అమ్మవార్లకు కల్యాణం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



కర్రతుమ్మ చెట్లు రూ.43.60 లక్షలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కలిగిరి: స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద మండలంలోని కావలిముస్తాపురం చెరువులోని కర్రతుమ్మ చెట్లకు బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు రెండవ సారి వేలం నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన మాలెపాటి వెంకటేశ్వర్లు రూ.43.60 లక్షలకు వేలంపాట పాడినట్లు అధికారులు పేర్కొన్నారు. వివరాల మేరకు... గత నెల ఒకటిన ఇరిగేషన్ కార్యాలయం వద్ద అధికారులు గ్రామస్థుల సమక్షంలో కావలిముస్తాపురం చెరువులోని 230 ఎకరాల విస్తీర్ణంలోని కర్రతుమ్మచెట్లకు వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలంలో గ్రామానికి చెందిన మద్దినేని వెంకటేశ్వర్లు రూ.60.60 లక్షలతో వేలం పాట పాడడం జరిగిందని రూ.4.50 లక్షలు డిపాజిట్ చెల్లించడం జరిగిందని అధికారులు తెలిపారు. అయితే మిగిలిన సొమ్ము చెల్లించడానికి నెలరోజులు గడువు ఉంటుందని ఆగస్టు ఒకటి నాటికి మిగిలిన సొమ్మును పాటదారుడు చెల్లించకపోవడంతో తిరిగి బుధవారం వేలం నిర్వహించామన్నారు. అయితే గత పాటకన్నా సుమారు రూ.17 లక్షలు తగ్గించి మరొకరు వేలం పాటపాడటం జరిగిందని డీఈ సీ.రవికుమార్ తెలిపారు. అయితే ఇప్పుడు పాటదారుడు నుండి పాటపాడిన మొత్తంలో 1/3వంతు డిపాజిట్ చెల్లించాలని తెలిపామన్నారు. చెరువులో చెట్లు కొట్టుకోవడానికి ఆరునెలల సమయం ఉంటుందని పాటదారుడు ఆ సమయంలోపు చెట్లు కొట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈ రమేష్, చెరువు అధ్యక్షుడు సుబ్బానాయుడు, స్థానికులు సిద్దులునాయుడు, జనార్ధన్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితులపై చిన్న చూపు తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ పర్రి సులోచనమ్మ

బిట్రగుంట: దళితుల గిరిజనుల ఓట్లతో గద్దెనెక్కి సభలు, సమావేశాల్లో దళిత కులాలను కించపరిచే విధంగా టీడీపీ నాయకులు, మంత్రులు వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని ఎంపీపీ పర్రి సులోచనమ్మ అన్నారు. బోగోలు మండలం వైసీపీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ కడప జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన వ్యాఖ్యలు దళిత గిరిజనులే కాకుండా సామాన్యుల సైతం జీర్ణించుకోలేని విషయమని అన్నారు. అనంతరం స్థానిక ఎస్ఐకి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. జెడ్పీటీసీ బాపట్ల కామేశ్వరి, వైసీపీ మండల కన్వీనర్ మద్దెబోయిన వీర రఘు, జిల్లా నేతలు తూపిరి పెంచలయ్య, వెంకటపతి, రమణయ్య, అంకులయ్య, మేకల శ్రీనివాసులు, మేకల సాల్మన్, ప్రసాద్, మాలకొండయ్య, రసూల్, నిర్మల్ కుమార్ ఉన్నారు.

పేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

కలిగిరి: 2013-14 సంవత్సరం స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో పదో తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సేవా సంస్థను ఏర్పాటు చేసినట్లు సంస్థ ఆర్గనైజర్ కృష్ణంశెట్టి దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పేదలకు, రోగులకు తమ సంస్థ తరపున విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. తమ సంస్థ సేకరించిన విరాళాలతో మొట్టమొదటగా జిల్లాలోని రాజుపాలెం వద్ద విశ్వజనని ఆనాథ బాలల ఆశ్రమంలో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు విష్ణు, శశి, అజయ్, మహేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు శంకుస్థాపన

అల్లూరు : మండలంలోని ఇస్కపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న శివాలయానికి బుధవారం జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఆయన సోదరుడు బీద గిరిధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గోపూజ, పూర్ణాహుతి, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముప్పిరాల రాఘవయ్య శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించడం జరుగుతుందన్నారు. బండి అమర్‌రెడ్డి, రాయి నాయుడు, గంగపట్నం శీనయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న బీద రవిచంద్ర

ప్రసన్నుడి ఆలయంలో కృష్ణాష్టమి

బిట్రగుంట: బోగోలు మండలం బిలకూట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా సంతాన గోపాలకృష్ణస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత సంతాన గోపాలకృష్ణస్వామి పల్లకీలో ఊరేగుతూ ఆలయ ఈశాన్య ఉత్తర ముఖ మండపంలో కొలువుతీరారు. ఆలయ ప్రధానార్చకులు వేదగిరి వెంకటలక్ష్మీ నరసింమాచార్యులు, కల్యాణాచార్యులు పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలు కృష్ణయ్యయాదవ్, నరసయ్య కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేతలను కుదిపేస్తున్న పసుపు కుంభకోణం

●ఎమ్మెల్యే బొల్లినేనికి చేదు అనుభవం

● నాయకులను ఇరుకున పడేసిన క్రికెట్ బుకీలు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉదయగిరి నియోజకవర్గంలో జరిగిన పసుపు కుంభకోణం ఆ నియోజకవర్గంలోని టీడీపీ, వైసీపీ నేతలను కుదిపేస్తోంది. ఏకంగా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పసుపు బొక్కలను రక్షిస్తున్నాడంటూ ప్రజలు ఆయనను నిలదీస్తున్నారు. ఇకపోతే క్రికెట్ బుకీల వ్యవహారం నేతల చుట్టూ తిరుగుతున్నది. బుకీల అరెస్టులు, కేసుల దర్యాప్తులకు టీడీపీ, వైసీపీ నేతలు సహకారం అందిస్తుండడం చర్చనీయాంశ మైంది. ఇటు క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌లు, అటు పసుపు కుంభకోణంపై వైసీపీ, టీడీపీ నేతలు సతమతమవుతూ, వాటి నుంచి ఎలా బయట పడాలన్న ప్రయత్నాల్లో ఉన్నారు. .

● నెలరోజులుగా సాగుతున్న వ్యవహారం

గత నెలలో నెల్లూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి అనంతరం క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌లు వెలుగులోకి వచ్చాయి. దీనిపై ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ప్రత్యేక దృష్టి పెట్టి 115 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తొమ్మిది మంది జాతీయ బుకీలు కాగా, 21 మంది సబ్ బుకీలు, మిగిలిన 85 మంది పంటర్లుగా గుర్తించి వివిధ సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. జాతీయ క్రికెట్ బుకీ కృష్ణసింగ్ ఇచ్చిన సమాచారం మేరకు జిల్లాలో ఉన్న టీడీపీ, వైసీపీ నేతలు సహకారం ఉందని తేలింది. జాతీయ క్రికెట్ బుకీలను అదుపులోకి తీసుకోవడంలో నేతలే సహకరించడం చర్చనీయాంశమైంది. వైసీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి సహకారంతోనే పరారీలో ఉన్న కృష్ణసింగ్‌ను పోలీసులు పట్టుకోగలిగారు. టీడీపీ నాయకుడు ఒకరు బుకీ బ్రహ్మానా యుడును పోలీసులకు పట్టించారు. మిగిలిన బుకీలను కూడా టీడీపీ, వైసీపీ నేతలు దగ్గరుండి పోలీసులకు అప్పగించడం ఈ వ్యవహారంలో వారి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కృష్ణసింగ్ అందించిన సమాచారం మేరకు రూ. కోట్ల సొమ్ము హవాలా ద్వారా కొందరు నేతలకు ముట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిపై ఎస్పీ ఎవరెవరికి ఎంతెంత ముట్టిందన్న దానిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీ య బుకీలు కొందరితో కృష్ణసింగ్‌కు పరిచయం ఉండడంతో వారిని కూడా అదుపులోకి తీసుకునే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. టీడీపీకి చెందిన బుకీలు శరత్‌చంద్ర, ఆయన తనయుడు సుభాష్‌లు ప్రస్తుతం పరారీలో ఉండగా వారి కోసం అన్వేషిస్తున్నారు. ఇలా నెల్లూరు జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారాల్లో వారు వీరు అన్న తేడా లేకుండా వైసీపీ, టీడీపీ నేతలు అన్నట్లు పోలీసులు గుర్తించారు. నేతలు మాత్రం ఈ వ్యవహారం నుంచి ఎలా బయట పడ్డాలన్న ఆలోచనలో నడుస్తున్నారు.

● కుదిపేస్తోన్న పసుపు వ్యవహారం

ఉదయగిరి నియోజకవర్గంలో పసుపు కుంభకోణం నేతలను కుదిపేస్తోంది. పసుపు కొనుగోళ్లలో రూ. 14 కోట్లకు పైగా గోల్‌మాల్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. వైసీపీ, టీడీపీలకు చెందిన 17 మంది నేతలపై క్రిమినల్ కేసు లు నమోదు చేయడం ఆ నియోజకవ ర్గంలో సంచలనమైంది. మండల స్థాయి లోని ముఖ్య నేతలే ఈ కేసుల్లో ఇరుక్కో వడం వారిని ఎలా బయట వేయాలన్న ఆలోచన ముఖ్య నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం వరికుం టపాడు మండలం జడదేవిలో ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుకు చేదు అనుభవం ఎదురైంది. పసుపు కుంభకోణం లో బొక్కలను కాపాడుతున్నారంటూ నినాదాలు చేస్తూ ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు శాంతించకపో వడంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెనుది రిగారు. ఈ సంఘటన నియోజకవర్గంలో పెద్ద దుమారాన్ని రేపింది.. ఒకరిద్దరు నేతలను అరెస్టు చేసిన పోలీసులు మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు (క్రైం) : కొడవలూరు మండలం యల్లాయపాళెంకు చెందిన శ్రీదేవి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఆమె భర్త గోపాల్ బుధవారం నెల్లూరు నాల్గో నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీదేవి ఈ నెల 12వ తేదీ రాపూరులోని తన వదిన ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. 13వతేదీ భర్తకు ఫోన్ చేసి నెల్లూరుకు వస్తున్నానని, ఆర్టీసీ బస్టాండుకు రమ్మని చెప్పింది. దీంతో గోపాల్ బస్టాండ్‌కు వెళ్లి ఎదురు చూస్తుండగా, శ్రీదేవి పక్కింటి వాళ్లకు ఫోన్ చేసి తాను ఇంటికి రావడం లేదని, తన కోసం ఎదురుచూడవద్దని చెప్పింది. పక్కింటి వాళ్లు ఈ సమాచారాన్ని గోపాల్‌కు చేరవేశారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

పొదలకూరు పోలీసుల అదుపులో

15 మంది బెట్టింగ్ రాయుళ్లు

పొదలకూరు: పొదలకూరుకు చెందిన జాతీయ స్థాయి క్రికెట్ బుకీ మన్నెం శ్యామ్‌ప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు పొదలకూరు పోలీసులు ఇప్పటి వరకు 14 మంది బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ భూతాన్ని రూపుమాపడంలో భాగంగా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తు న్నాయి. అంతర్జాతీయ క్రికెట్ బుకీ కృష్ణ సింగ్ ఇచ్చిన సమాచారం మేరకు జులై 25వ తేదీన పొదలకూరుకు చెందిన మన్నెం శ్యామ్‌ప్రసాద్‌ను ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తమదైన శైలిలో విచారణ జరిపారు. దీంతో శ్యామ్ ప్రసాద్ సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకొని సమగ్ర సమాచారం సేకరించారు. శ్యామ్‌ప్రసాద్ వద్ద పొద లకూరు మండలానికి చెందిన 15 మంది బెట్టింగ్‌లు నిర్వహించినట్లు పోలీసు విచారణలో తేలింది. వీరందరినీ జులై 27వ తేదీ పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని ఎస్‌ఐ జగత్ సింగ్ సెల్‌ఫోన్ మెసేజ్‌లు పంపారు. శ్యామ్‌ప్రసాద్‌ను అదుపులోకి తీసుకోవ డంతో వీరందరూ ఊరు విడిచి ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. క్రికెట్ బెట్టింగ్ విషయంలో జిల్లాలో జరుగు తున్న పరిణామాలను నిశితంగా పరిశీ లించిన బెట్టింగ్ రాయుళ్ల గడిచిన నాలుగైదు రోజులుగా పోలీసులకు లొంగిపోతూ వచ్చారు. ప్రధాన బుకీ మన్నెం శ్యామ్‌ప్రసాద్ ఇచ్చిన సమాచా రం మేరకు పొదలకూరుకు చెందిన సిరి గిరి రాజారెడ్డి, కందే మురళి, మాల్యాద్రి, నాగేంద్ర, సంపత్, సతీష్, రాంబాబాబు, పరియాజ్, విజయమోహన్, వెంకటే శ్వర్లు అలియాస్ వోగోడు, తాటిపర్తికి చెందిన శ్రీనివాసులురెడ్డి అలియాస్ బాబా, కృష్ణారెడ్డి, వెంకటేష్, బిరదవోలు కు చెందిన జనార్ధన్, మనుబోలు మండలం గొట్లపాళెంకు చెందిన సుధీర్ ఉన్నారు. వీరిలో బిరదవోలు చెందిన జనార్ధన్ ఇంకా అజ్ఞతంలోనే ఉన్నాడు. మిగిలిన 14 మంది ప్రస్తుతం పొదల కూరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వీరిలో అందరూ పంట ర్లేనా, బుకీలు ఎవరైనా ఉన్నారా అనే విషయాలను పోలీసులు రెండు మూడు రోజుల్లో మీడియా సమావేశం నిర్వ హించి వివరాలు వెల్లడించనున్నారు. కాగా బుధవారం ఉదయం ఆత్మకూరు డీఎస్పీ సమాచారం మేరకు సరిగిరి రాజారెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు బయలుదేరారనే సమా చారం తెలుకున్న రాజారెడ్డి నేరుగా పోలీస్‌స్టేషన్‌లో వచ్చి లొంగిపోయాడు. అయితే ఈ రాజారెడ్డి శ్యామ్‌ప్రసాద్‌తో పంటర్లుగా బెట్టింగ్‌లు పెడుతూనే నేరుగా హైదరాబాద్ నుంచి లైన్ తీ సుకొని ఆడే వాడని తెలుస్తోంది. ఆ దిశగా రాజారెడ్డిని విచారిస్తే మరింత మంది వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పోలీసు కస్టడికి నలుగురు ప్రధాన బుకీలు

కావలి: క్రికెట్ బెట్టింగ్‌లలో ప్రధాన బుకీలుగా గుర్తించి కావలి పోలీసులు అరెస్టు చేసిన నంద్యాల అరుణ్‌కుమార్, మన్నెం శ్యామ్ ప్రసాద్, దాసరి సుశాంత్, గుర్రం వెంకటేశ్వర్లును బుధవారం పోలీసు కస్టడికి తీసుకున్నట్లు కావలి ఒకటో పట్టణ సీఐ ఎం.రోశయ్య తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వీరిని ప్రధాన బుకీలుగా గుర్తించి గతంలో కావలి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారి నుంచి క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించేందుకు పోలీసులు కోర్టులో పిటిషన్ వేసి పోలీసు కస్టడికి ఇవ్వమని కోరారు. దీంతో కోర్టు బుధవారం ఆ నలుగురిని పోలీసు కస్టడికి ఇచ్చింది. పోలీసుల విచారణలో ఇంకా ఎవరెవరి పేర్లు బయట పడతాయని క్రికెట్ బెట్టింగ్‌లతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న ప్రతిఒక్కరూ ఆందోళన చెందుతున్నారు.

చిల్లకూరులో ఏడుగురు ?

చిల్లకూరు: మండలంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నట్టు తెలుస్తోంది. బల్లవోలు గ్రామానికి చెందిన ముగ్గురు, తూర్పుక నుపూరుకు చెందిన ఒకరు, చింతవ రానికి చెందిన ఇద్దరు, అంకులపా టూరుకు చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నట్లు తెలిసింది.

పెళ్లికారు బోల్తా

● పది మందికి గాయాలు ● క్షతగాత్రుల్లో నూతన దంపతులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూతన దంపతులు

వెంకటగిరి(టౌన్): ఏర్పేడు-పెంచలకోన జాతీయ రహదారిపై కలపాడు వద్ద బుధవారం బొలేరో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో నూతన దంపతులు కూడా ఉన్నారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటకు చెందిన ఉదయగిరి రూపేష్ అలియాస్ గణేష్‌కు నెల్లూరుకు చెందిన శిరీషాతో బుధవారం ఉదయం పెంచలకోన క్షేత్రంలో వివాహమైంది. అనంతరం అక్కడి నుంచి బొలేరో కారులో పెళ్లి కుమారుడి ఇంటికి వస్తుండగా మండల పరిధిలోని కలపాడు వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారులో ఇంజన్ ఆయిల్ అయిపోవడంతో ఇంజన్ సీజ్ అయ్యి స్టీరింగ్ పనిచేయక అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నూతన దంపతులకు తీవ్రగా యాలయ్యాయి. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న చెంచయ్య, వరలక్ష్మి, సుబ్బమ్మ, తనుషా, డ్రైవర్ వెంకటేష్‌తో పాటు చిన్నారులు లోలిత, జశ్వంత్, ప్రమీలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుభకార్యం ముగించుకుని ఆనందంగా కారులో ఇంటికి వస్తున్న తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో బంగారుపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.



బోల్తా పడిన కారు

గాయపడిన వృద్ధుడి మృతి

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు బుధవారం మృతి చెందారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన తంబి వెంకటేశ్వర్లు (60) ఐదురోజుల క్రితం చేడిమాల నుంచి పారిచెర్లవారిపాళెంకి బైకుపై వెళుతుండగా ఆకస్మాత్తుగా రోడ్డుపైకి గేదె రావడంతో దానిని ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక డంప్ పట్టివేత

● పోలీసుల అదుపులో ముగ్గురు

తడ : అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న ఇసుక డంప్‌ను పోలీసులు గుర్తించారు. ఆ డంప్‌ను, ఒక లారీని, ఎక్స్‌కవేటర్, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని కారూరు గ్రామ సమీపంలో ఏపీఐఐసీకి చెందిన ప్రభుత్వ భూమిలో మామిడిచెట్ల మధ్య ఇసుకడంప్ ఉందంటూ ఎస్పీకి సమాచారం అందింది. దీంతో స్పందించిన ఎస్పీ రామకృష్ణ తడ పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోని పోలీస్ బృందం ఈ డంప్‌ను గుర్తించింది. డంప్‌వద్ద లారీలో ఇసుకను యంత్రం సాయంతో లోడ్ చేస్తుండగా ఆ రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. కాగా ఈ ఇసుకడంప్ ను కల్తీ ఇసుకగా పోలీసులు గుర్తించారు. ఈ రెండు వాహనాలను, వాహన డ్రైవర్ జడయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత వీటి యజమానులు కుమార్, జీవాను సైతం అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.



పోలీసుల అదుపులో లారీ

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు




పోలీసుల అదుపులో నిందితులు

అల్లూరు : పొట్టేళ్లను దొంగిలించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఓ రైతుకు చెందిన పొట్టేళ్లను అల్లూరు మండలం నార్తుఆమూరు ప్రాంతంలో మేపుకొంటుండగా ఈ నెల 9న రాత్రి బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ముగ్గురు యువకులు దొంగతనానికి పాల్పడ్డారు. ఎట్టకేలకు వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

సాగని బోధన

● పాఠశాలల్లో కదలని సిలబస్ ● రేషనలైజేషన్, బదిలీలతో రెండు నెలలు కాలయాపన

● ఇప్పటికీ టీచర్లకు అందని ఆర్డర్లు ● విద్యార్థులపై దృష్టి సారించని అయ్యోర్లు



నెల్లూరు (క్యాంపస్) : ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయింది. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి విద్యా బోధన సాగడంలేదు. పాఠశాలలు పునః ప్రారంభంకు ముందే నిర్వహించాల్సిన బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియలు పునః ప్రారంభం తర్వాత ప్రారంభించడం, జీవోలలో మార్పులతో ఆ ప్రక్రియను నెలల తరబడి కొనసాగింది. ఈ ప్రక్రియ పూర్తయినా ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు ఆర్డర్లు రాలేదు.

● రేషనలైజేషన్, బదిలీలతో

జూన్ 9వ తేదీన ఉపాధ్యాయ బదిలీల నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పటి నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు బదిలీల కౌన్సెలింగ్‌లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. జీవోలోనే షెడ్యూళ్లను ఎన్నోసార్లు మార్పులు చేసుకుంటూ వచ్చారు. ఇదే సమయంలో పాఠశాలలు, ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులోనూ పలు మార్పులు చేర్పులు తర్వాత పూర్తిస్థాయి రేషనలైజేషన్ జాబితాకు సంబంధించిన ఫైల్‌ను కలెక్టర్ వద్దకు చేర్చడం, ఇందులో మార్పులు చేర్పులు చేయాలని కొంతకాలం ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచడం, ఈ సమయంలోనే విద్యార్థులకు టీసీలు ఇచ్చి విలీనం చేసిన పాఠశాలల్లో చేరాలంటూ ఆదేశాలు జారీచేయడం, అసలు పాఠశాలలు ఉంటాయా... ఉండవా... అన్న అనుమానాలు కలగడం.. తదితర కారణాలతో పాఠశాలల్లో విద్యా బోధన పూర్తి స్థాయిలో సాగలేదు. అయితే ఎట్టకేలకు రేషనలైజేషన్ ఫైల్‌ను కలెక్టర్ అంగీకరించడంతో సుమారు వందకు పైగా పాఠశాలలు విలీనం, తొలగించడం జరిగింది.

● అందని ఆర్డర్లు

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తవడం, వెంటనే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడం, ప్రకటించిన షెడ్యూల్ కంటే ముందుగానే కౌన్సిల్ పూర్తికావడంతో ఇక ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలకు హాజరవుతారు. దీంతో ఇకనైనా విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యా బోధన సాగుతుందన్న భావనలో అంతా ఉన్నా ఇప్పటి వరకు బదిలీలు అయిన ఉపాధ్యాయులకు ఆర్డర్లు అందలేదు.

● ముందుకు సాగని సిలబస్

బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియతో ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో సిలబస్ ముందుకు సాగడంలేదు. ఏదో చెప్పాలి కాబట్టి విద్యా సంవత్సరం టైంటేబుల్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలి కాబట్టి పైపైనే విద్యా బోధన సాగుతోంది. మొత్తం మీద ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు సరైన విద్యా బోధన సాగడం లేదు. ఇప్పటికైనా వెంటనే బదిలీల ఆర్డర్లను ఉపాధ్యాయులకు అందజేసి విద్యా బోధనపై దృష్టి సారించేలా చూడాలి.

వెంటనే ఆర్డర్లు ఇవ్వాలి



బదిలీల ఆర్డర్లను ఉపాధ్యాయులకు వెంటనే ఇవ్వాలి. టీచర్లు దీనిపై ఆందోళనతో ఉన్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు బోధన జరగాలంటే బదిలీల ఆర్డర్లు అందజేయాలి.

\- యూటీఎఫ్ నాయకులు నవ కోటేశ్వరరావు

మూడు రోజుల్లో ఇస్తాం



బదిలీల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత వరుసగా సెలవులు రావడంతో టీచర్లకు ఆర్డర్లు ఇవ్వడంలో ఆలస్యమైంది. బదిలీలకు సంబంధించిన వెరిఫికేషన్ జరుగుతుంది. నాలుగు రోజుల్లో ఆర్డర్లు అందజేస్తాం.

\- డీఈవో మువ్వా రామలింగం

రాష్ట్ర ఓబీసీ సమావేశానికి జాబితా సిద్ధం చేయండి: కర్నాటి



మాట్లాడుతున్న ఆంజనేయులురెడ్డి

నెల్లూరు (క్యాంపస్) : త్వరలో జరగనున్న రాష్ట్ర ఓబీసీ సమావేశానికి హాజరు కావాల్సిన వారి జాబితాను ఈ నెల 20వ తేదీలోపు సిద్ధం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయులు రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా విజయవాడ వస్తున్న సందర్భంగా జరిగే రాష్ట్ర ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 10న వోబీసీ మోర్చా సమావేశం జరిపి పూర్తి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్, నగర అధ్యక్షుడు మండల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె ప్రారంభం



ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

నెల్లూరు (క్యాంపస్) : అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం నెల్లూరులోని పలు పోస్టాఫీసుల వద్ద ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్టీ, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు దుడ్డు రమేష్‌బాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. 8 గంటల పనిదినాలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, పింఛన్ సౌకర్యం వంటివి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తపాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణంపై దాడి

గూడూరు(టౌన్): పట్టణంలోని అడివయ్య కాలనీలో బుధవారం ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడులలో యనమల బుజ్జమ్మ ఇంట్లో 13 మద్యం సీసాలు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది దాడులు నిర్వహించారు.

రాజీకి రాలేదని అక్రమ కేసులు



మాట్లాడుతున్న రాగూర్ తల్లి దేవేంద్రమ్మ

నెల్లూరు (వేదాయపాళెం) : పొదలకూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రాగూర్‌పై కొందరు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా బూటకపు కేసులు బనాయిస్తున్నారని ఆయన తల్లి దేవేంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె బుధవారం నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో విలేఖర్లతో మాట్లాడారు. గతంలో తన కుమారుడు పొదలకూరులోని అనుమాలశెట్టి సురేష్‌కి చెందిన ఇంట్లో ప్రతిరోజూ సాయంత్రం కొద్దిసేపు ప్రజలకు వైద్య సేవలు అందించే వాడన్నారు. ఇంటి యజమాని తన బిడ్డ నుంచి రూ.లక్ష అడ్వాన్సుగా తీసుకుని కొన్ని రోజుల తరువాత ఇల్లు ఖాళీ చేయమని చెప్పారని, అక్కడ ఉన్న వస్తువులను రోడ్డుపై వేశారని తెలిపారు. దీంతో సురేష్‌పై రాగూర్ అట్రాసిటీ కేసు పెట్టారని, ఆ విషయంలో రాజీ పడాలని నిందితులు అనేక సార్లు గొడవ దిగారని చెప్పారు. తన కుమారుడిపై అసత్య కేసులు బనాయించారని, ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లాల శ్రీనివాసులు, పైడిపాటి గిరిధర్, బద్దేపూడి కృష్ణయ్య, ఎం కనకేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ : క్లీనర్ మృతి

బుచ్చిరెడ్డిపాళెం: ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరిపాళెం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ముత్తుకూరు పోర్టు నుంచి బొగ్గు లోడుతో కడప వైపు వెళుతున్న లారీ బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరిపాళెం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక వైపు నుంచి ఢీకొన్న లారీలో క్లీనర్‌గా ఉన్న నాగూర్‌బాషా (27) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ నాగూర్‌బాషాను నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది కడప జిల్లా వల్లూరు మండలమని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 గ్రాముల బంగారు చైన్ చోరీ

బుచ్చిరెడ్డిపాళెంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఓ చైన్ చోరీకి గురైంది. బుధవారం పెళ్లి జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వెంకట కీర్తన అనే ఏడేళ్ల బాలికను ఫోటోలు తీస్తామని మండపం సమీపానికి తీసుకెళ్లి బాలిక మెడలో ఉన్న 18 గ్రాముల బంగారు చైన్‌ను అపహరించుకుని వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు పెళ్లి సందడిలో హడావుడిగా ఉండగా, ఈ చోరీ జరిగింది. అనంతరం పాపను గమనించుకున్న తల్లిదండ్రులు చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్లలో అభివృద్ధి శూన్యం

● మాజీ ఎంపీ చింతా మోహన్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా మోహన్

గూడూరు: దేశం, రాష్ట్రంలో మూడేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమని తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యుడు చింతామోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ అనాలోచిత నిర్ణయాల వలన ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయిందన్నారు. పెద్దనోట్ల రద్దుతో ప్రజల వద్ద డబ్బులు లేకుండా పోయాయన్నారు. జీఎస్టీ అమలుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. జీఎస్టీ ద్వారా రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే గోరంత అభివృద్ధి పనులకు కొండంత ప్రచారం ఇస్తూ వందలాది కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. తన హయాంలో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో లక్ష కోట్ల నిధులు వెచ్చించి ఏడు జాతీయ రహదారులతోపాటు శ్రీకాళహస్తి - నడికుడి రైల్వే మార్గాన్ని, వెంకటగిరి భేల్ జాతీయ పరిశ్రమను ఏర్పాటు చేశామన్నారు. అయితే ఎన్డీఏ, టీడీపీల హయాంలో ఈ మూడేళ్లలో భేల్ ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. శ్రీకాళహస్తి- నడికుడి మార్గం ఏక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉందన్నారు. ఓడిశాలో 1700 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన రహదారికి వంద కోట్ల రూపాయల ఆడ్వర్టైజ్‌మెంటు ఇచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. మోదీ చదివిన నాలుగో తరగతి పరిజ్ఞానంతో దేశాన్ని అధోగతి పాల్జేస్తున్నారన్నారు. ఈ మూడేళ్లలో 29 దేశాలలో తిరిగి అధ్యక్ష, ప్రధాన మంత్రులతో సెల్ఫీలు దిగడం తప్ప, దేశానికి చేకూర్చిన ప్రయోజనం శూన్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్వాతంత్ర దినోత్సవం జరుపుకునేందుకు ఉపాధి హామీ నిధులను వినియోగిస్తుందంటే రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు ఏ విధంగా దివాళా తీయించారో అర్థం అవుతుందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న దుగరాజపట్నం పోర్టు నిర్మాణం చేపట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సిఫార్సులు చేసినా పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 200 ఎకరాల భూమిని పోర్టుకు కేటాయిస్తే దుగరాజపట్నం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. వైజాగ్‌లో మాదిరి వాకాడు మండలంలో కూడా రెవెన్యూ రికార్డులు తారుమారు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే వాకాడు ప్రాంతంలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమయిందన్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఘనవిజయం సాధిస్తుందన్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఖాయమన్నారు. పరిమళ వెంకటేశ్వర్లు, పూల చంద్రశేఖర్, రమాదేవి, పుచ్చలపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా టెండర్లు?



కోట క్రాసు వద్ద గూడూరు - దుగరాజపట్నం రోడ్డు

- దుగరాజపట్నం రోడ్డు పనులు ఒకరికే అప్పగింత!
- విలువ రూ. 35 కోట్లు
- ఐదు శాతం పెంపుతో షెడ్యూల్ దాఖలు
- ఖరారైతే ప్రభుత్వంపై రూ.1.75 కోట్లు భారం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గూడూరు - దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసింది. 14 కి.మీ పొడవు ఉన్న 5.50 మీటర్ల రోడ్డును 10 మీటర్లకు వెడల్పు చేసి తారురోడ్డుగా మార్పు చేయాలన్నది ఆలోచన. భవిష్యత్‌లో దుగరాజపట్నం పోర్టు ఏర్పడితే ఈ రోడ్డే ఎంతో కీలకంగా మారనున్నది. కిలోమీటర్‌కు రూ. 2 కోట్లు ఖర్చు పెట్టేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ 14 కి.మీ రోడ్డును ఏడు వర్కులుగా విభజించి ప్రతి పని రూ. 4 నుంచి 4.50 కోట్లు ఉండేలా ఈ - పొక్యూర్‌మెంట్‌లో టెండర్లు నిర్వహించారు. జూలై 3న టెండర్ నోటీసు జారీ చేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు అదేనెల 26న టెండర్లకు ముగింపు పలికారు. ఈ టెండర్లలో మొత్తం నలుగురు కాంట్రాక్టర్లే పాల్గొని షెడ్యూల్ దాఖలు చేశారు. మొదటే ఒప్పందాలతో రింగ్ అయిన ముగ్గురు కాంట్రాక్టర్లు అంచనా వ్యయంపై 4.99 శాతంతో ఏడు పనులకు షెడ్యూల్ దాఖలు చేశారు. గూడూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ మాత్రం అంచనా వ్యయంపై తగ్గింపుతో రెండు పనులకు షెడ్యూల్ వేశారు. నిబంధనల మేరకు వంద కిలోమీటర్ల లోపు బ్యాచ్ మిక్స్‌ప్లాంట్ ఉన్న వారే అర్హులుగా అర్హత పెట్టారు. ఈ షెడ్యూల్‌ను ఓపెన్ చేసిన ఇంజనీర్లు కంప్యారేజియన్ స్టేట్‌మెంట్ వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. అంచనా వ్యయంపై తగ్గింపుతో వేసిన గూడూరు కాంట్రాక్టర్లకు ఆ రెండు పనులు నిబంధనల మేరకు దక్కాల్సి ఉంది. కాని రాజకీయ పైరవీలతో ఆ కాంట్రాక్టరు బ్యాచ్‌మిక్స్‌ప్లాంట్ వంద కిలోమీటర్లు పైగానే ఉందని అందుకే అతన్ని డిస్క్వాలిఫై చేయాలని ఒత్తిళ్లు మొదలయ్యాయి.

● జరిగిందేమిటి..?

గత ఏడాది దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ. 35 కోట్లు విడుదల చేసింది. ఈ పనులను గూడూరు నియోజకవర్గంలోని ఓ టీడీపీ నేతకు కట్టబెట్టాలని టీడీపీ పెద్దలు కొందరు ప్రయత్నాలు చేశారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఆర్థికంగా ఎంతో నష్టపోయాడని, ఇప్పటి వరకు నామినేటెడ్ పదవులు ఇవ్వలేదని ఆ నేత టీడీపీ పెద్దల వద్ద వాపోయేవాడు. ఇక నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఎమ్మెల్యే సునీల్‌కు అప్పచెప్పడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆ నాయకుడిని పిలిచి శాంతింప చేసేలా గతంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పని చేసిన ఓ మంత్రి సారథ్యంలో కొన్ని ఒప్పందాలు జరిగాయి. దుగరాజపట్నం రోడ్డు పనులు ఎవరు చేసినా ఐదుశాతం కమీషన్ ఆ నేతకు ఇచ్చేలా చూడాలి. ఇందులో ఎవరు కూడా వేలు పెట్ట డానికి వీలులేదని అమాత్యులు ఆదేశించినట్లు సమాచారం. పనుల పందేరం కూడా ఆ నేత చెప్పిన వారికే ఇవ్వాలన్నది మరో ఒప్పందం. పార్టీలో ఉన్నత స్థాయిలో దీనిపై తర్జన భర్జనలు పడిన అనంతరం అందరూ ఆ నేతకు మద్దతు ఇస్తూ దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధి పనులు రూ. 35 కోట్లు ఆయనకే అన్నట్లు చెప్పారు. దీంతో ఆ నేత తనకు అనుకూల మైన నలుగురు కాంట్రాక్టర్లను రంగంలోకి దింపారు. వీరంతా గతంలో వైసీపీ సాను భూతి పరులు. టీడీపీకి అను కూలంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను పక్కన పెట్టి ఆ నలుగురికి పనుల పందేరం చేశారు. అంచనా వ్యయంపై ఐదు శాతం పెంపుతో వేసే సొమ్ము నేతకు కమీషన్ కింద ఇవ్వాలి. అంతే కాకుండా ఎవరికి పనులు ఇవ్వకుండా ఆ నలుగురికే ఇస్తుండడంతో మరో మూడు శాతం మరో నేతకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. ఇలా ఎనిమిది శాతం అధికార పార్టీ నేతలకు పందేరం చేయడంతో రూ. 2.80 కోట్లను కమీషన్ల కింద నేతలకు అందించాల్సి ఉందని కాంట్రాక్టర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

> **నిబంధనలు పాటిస్తాం**
>
> నిబంధనల మేరకే టెండర్లు ఖరారవుతాయి. అంతే తప్ప ఒత్తిళ్లతో టెండర్లు ఖరారు చేస్తే ఇరుక్కునేది ఇంజనీర్లే. దుగరాజప ట్నం రోడ్డు టెండర్లు ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. కమిషనర్ ఆఫ్ టెండర్ ఈ టెండర్లను ఖరారు చేస్తే అగ్రిమెంట్ చేస్తాం. తమపై రాజకీయ పైరవీలు, ఇతర ఒత్తిళ్లన్నవి లేవు.
>
> **- విజయకుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ**

● ప్రభుత్వంపై 1.75 కోట్ల భారం

ఈ - పొక్యూర్‌మెంట్ టెండర్లలో ఒకరికి తెలియకుండా మరొకరు షెడ్యూల్ దాఖలు చేసే అవకాశం ఉంది. కాని దుగరాజప ట్నం రోడ్డు పనులు దాఖలైన షెడ్యూల్‌ను పరిశీలిస్తే నలుగురు కాంట్రాక్టర్లు అంచనా వ్యయంపై 4.99 శాతంతో షెడ్యూల్ దాఖలు చేశారు. అంటే ఇక్కడ కాంట్రాక్టర్లు రింగ్ అయ్యారన్నది స్పష్టమవుతోంది. ఇదే పనులను దక్కించుకునేందుకు మరో కాంట్రాక్టర్ అంచనా వ్యయంపై తగ్గింపుతో షెడ్యూల్ దాఖలు చేశారు. లేనిపోని నిబంధనలతో అంచనా వ్యయంపై తగ్గిం పుతో వేసిన కాంట్రాక్టర్‌ను పక్కన పెట్టే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నా యి. ఇదే టెండరును ఖరారు చేస్తే రూ. 1.75 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతుం దన్నది వాస్తవం. రాజకీయ జోక్యం ఉండడంతో కాంట్రా క్టర్లు కూడా పనులు ఏ మాత్రం చేస్తారన్నది సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటికే నాశిరకం పనులతో రూ. కోట్లు దుర్వినియోగ మవుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో రాజకీయ పైరవీలు ఏమి టన్న చర్చ సర్వత్రా సాగు తోంది. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన సొమ్ము ఇలా అభివృద్ధి పనుల పేరుతో జమ చేసుకోవడంపై స్థానికులు మండి పడుతున్నారు. నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన ఇంజనీర్లపై ఒత్తిళ్లు తేవడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఏకపక్షం గా కాకుండా పారదర్శకంగా టెండర్లు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

'సున్నం' పెట్టేశారు..

- సున్నం, బ్లీచింగ్, ఫినాయిల్, ఫాగింగ్ పేరుతో నిధుల స్వాహా
- కొన్ని పంచాయతీల్లో ప్రతి సీజన్‌లో ఇదే తంతు
- క్షేత్రస్థాయిలో కనిపించని పారిశుధ్య నిర్వహణ
- గ్రామాల్లో పెరుగుతున్న వ్యాధులు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ వంటి వాటిని ఉపయోగించి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయడం, నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి చల్లడం, తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం చేయాలి. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ కూడా చేయాలి. ఇలా పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ బడ్జెట్ నుంచి 15 శాతం నిధులను ఉప యోగించుకొనే వీలు ఉంది. అలానే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కూడా ఉపయోగించుకొనే అవకాశం ఉంది. జిల్లాలో ఉన్న 940 పం చాయతీల్లో ఏటా పారిశుధ్యం కోసం సుమారు రూ.10 కోట్లకు పైనే ఖర్చు చేస్తు న్నారు. ఇందులో సగం వరకు సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఉపయోగిస్తారు. అయితే నిజానికి బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ వంటివి కొనకుండానే కొన్నట్లుగా రికార్డులో రాసి నిధులు స్వాహా చేస్తున్నట్లు మొదటి నుంచి ఆరోపణలున్నాయి. అయినా దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు.

> **అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు**
>
> పంచాయతీల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ చేపట్టకుండానే బిల్లులు డ్రా చేయడానికి వీల్లేదు. ఇలా ఎవరైనా చేస్తే మాకు సమాచారమందించాలి. ఎంత బ్లీచింగ్ చల్లారు.. ఎంత సున్నం కొన్నారన్నది రికార్డుల్లో చూపించాలి. ఆకస్మిక తనిఖీలు చేపట్టి పనులను పర్యవేక్షిస్తాం.
>
> **- శ్రీహరి, ఇన్‌చార్జి డీపీవో**

● మేజర్ పంచాయతీల్లోనే ఎక్కువ

జిల్లాలోని మేజర్ పంచాయతీల్లోనే ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. ఎందుకంటే అక్కడ బడ్జెట్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి. ఇక్కడ ఇంత ఖర్చు చేశాం.. అక్కడ ఇంత ఖర్చు చేశాం.. అని అధి కారులు చెప్పినా అడిగేవారుండరు. మేజర్ పంచాయతీల్లో సాధారణ బడ్జెట్ రూ.10 లక్షలపైనే ఉంటుంది. ఇదంతా ఆయా పం చాయతీ పరిధిలోని పన్నుల రూపేణా వస్తుంది. ఇందులో 30 శాతం నిధులను అక్కడ పనిచేసే వారి వేతనాల కోసం ఉపయోగించాలి. వీధి దీపాల నిర్వహణకు మరో 15 శాతం, రోడ్లు, కాలువలు శుభ్రం చేసేందుకు 10 శాతం, తాగునీటి అవసరాలకు 15 శాతం, వ్యవసాయ రంగానికి 10 శాతం,. ఇతరత్రా వాటికి మరో 5 శాతం నిధులు ఉప యోగించాలి. మిగిలిన 15 శాతం నిధులను కేవ లం పారిశుధ్యానికి మాత్రమే ఖర్చు చేయాలి. అంటే రూ.10 లక్షల బడ్జెట్ ఉన్న మేజర్ పం చాయతీలో రూ.1.5 లక్షలు సున్నం, బ్లీచింగ్, ఫినాయిల్ కొను గోళ్లకు, ఫాగింగ్‌కు ఉపయోగించుకొనే అవకాశం ఉంది. ఇక్కడే కొందరు కార్యదర్శులు, ఈవోపీ ఆర్‌డీలు కుమ్మక్కై స్వాహా చేస్తు న్నారన్న ఆరోపణలు న్నాయి. పంచాయతీకు మూడు నెలలకు అయి దు బస్తాల సున్నం, బ్లీచింగ్ అవసరమైతే రెండు బస్తాలే కొనుగోలు చేసి లెక్కల్లో మాత్రం అయిదు బస్తాలు చూపుతున్నారు. ఫినాయిల్, ఫాగింగ్‌లోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా చాలా చోట్ల ఫాగిం గ్ యంత్రాలు మూలనపడ్డాయి. ఇవి పనిచేయకపోయినా కూడా ఫాగింగ్ చేస్తున్నట్లు లెక్కల్లో పేర్కొంటున్నట్లు సమాచారం.



ఉదయగిరిలో పూడిక తీయని మురికి కాలువ

● ప్రముఖుల పర్యటన పేరుతో..

కాగా ఎమ్మెల్యే, ఎంపీ లేక మంత్రో గ్రామంలో పర్యటిస్తే వీఐపీ టూర్ పేరుతో అదనంగా బిల్లులు డ్రా చేస్తున్నట్లు తెలిసిం ది. వీఐపీ వచ్చిన సమయంలో కాలువలు శుభ్రం చేయడం, సున్నం, బ్లీచింగ్ చల్లడం చేస్తుంటారు. అయితే మేజర్ పం చాయతీల్లో పారిశుధ్య కార్మికులు ఉంటారు. కొన్ని చోట్ల అదనంగా రోజువారీ కూలీ కింద కార్మికులను ఉపయోగించుకున్నట్లుగా ఇప్పటి వరకూ లెక్కల్లో రాస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

● పారిశుధ్యం ఎక్కడ ?

చిన్న పంచాయతీలను మినహాయిస్తే మిగిలిన వాటిల్లో ఏటా ఒక్కో పంచాయతీలో పారిశుధ్యానికి రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. కానీ ఏం లాభం..? వ్యాధులను మాత్రం అరికట్టలేకపోతున్నారు. ఏటేటా గ్రామాల్లో పెరుగుతున్న మలేరియా, డెంగ్యూ, విషజ్వ రాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. చాలా గ్రామాల్లో ఇళ్ల మధ్యనే నీళ్లు నిలు స్తున్నాయి. కాలువల్లో మురుగు పేరుకు పోతోంది. కానీ తూతూమంత్రంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్న పాపాన పోలేదు. వీట న్నింటి నేపథ్యంలో దోమల వ్యాప్తి ఎక్కువగా జరుగుతోంది. కాగా పంచాయతీల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కార్యదర్శులు, ఈవోపీ ఆర్‌డీలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు సాగుతోందన్న ప్రచారం ఉంది. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు పంచాయతీల్లో పారిశుధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది.



గూడలిలో రోడ్లపై ధాన్యం రాశులు

ధాన్యం ధర తగ్గుముఖం!

కోట: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి చేతికందే సమయానికి తగ్గుముఖం పట్టింది. రోజురోజుకు తగ్గుతున్న ధరలతో డెల్టా రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేక పోవడంతో పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు మద్దతు ధర కోసం ధాన్యం నిల్వ చేస్తుండగా, కొందరు వచ్చిన కాడికి వచ్చినంత అని దళారుల నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నారు. కోట మండలంలోని డెల్టాగ్రామాలైన గూడలి, దక్షిణపొలం, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, వంజివాక, అల్లంపాడు, కొక్కుపాడు, సూరిశెట్టిపాళెం, పుచ్చలపల్లి స్వర్ణముఖి, చల్లకాలువ, మామిడి కాలువల నదుల పరి వాహక ప్రాంతాల్లో బోర్లు ఆధారంగా రెండో కారు వరి సాగు చేశారు. అధికంగా 1010, సుబ్బయ్య బుడ్డలు అనే వరి రకం సాగు చేసి ఎన్నో ఒడిదిడుకులు ఎదురైనా వ్యయప్రయాసలకోర్చి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని అన్నదాతలు వాపోతున్నారు. దళారుల మాయాజాలంతో ధరలు పతనమైపోతున్నాయి. పంట కోత దశలో ఉన్న సమయంలో 1010 రకం ధాన్యం పుట్టి రూ12,800 ఉండగా ప్రస్తుతం రూ. 12,300 నుంచి రూ12,500 మాత్రమే ఉంది. ఇది కూడా నిలకడగా ఉండదని, రెండుమూడు రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని దళారులు రైతులను కలవరపెడుతున్నారు. అదేవిధంగా సుబ్బయ్య బుడ్డలు పుట్టి ధాన్యం ఇటీవల వరకు రూ.15,000 వరకు ఉండగా ప్రస్తుతం రూ.14,200లు పలుకుతోంది. తమిళనాడులోని రెడ్‌హిల్స్, గుమ్మిడిపూండి, కర్ణాటకలోని తుమ్మకూరు ప్రాంతాల మార్కెట్‌లలో ఇదేరకం ధాన్యానికి విపరీతంగా ధర పలుకుతున్నప్పటికీ దళారులు మాత్రం ధరలు లేవని లారీల రవాణా చార్జీలు కూడా రావంటూ రైతులను మభ్య పెడుతున్నట్లు తెలుస్తోంది.

- ● గిట్టుబాటు ప్రశ్నార్థకమే..
- ● దళారులదే రాజ్యం
- ● డెల్టా రైతుల దిగాలు


మద్దతు ధర లేదు



ఆరుగాలం కష్టించి పుష్కలంగా పంట పండించాం. ఎన్నో వడిదిడుకులు ఎదురయ్యాయి. అయినా లెక్క చేయలేదు. పండించిన ధాన్యానికి మద్దతు ధర లేదు.

- చంద్రారెడ్డి, వంజివాక

దళారులదే రాజ్యం



ధాన్య దిగుడులు బాగానే వచ్చాయి. అమ్ముకునే సమయంలో దళారులదే రాజ్యంగా ఉంది. రోజుకో మాట చెబుతున్నారు. బయట ప్రాంతాల్లో ధాన్యం అడిగే నాధుడే లేడని నమ్మబలుకుతున్నారు.

- నాగభూషణం, రైతు

విధిలేని పరిస్థితుల్లో విక్రయం



పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేని పరిస్థితిలో విక్రయిస్తున్నాం. పంటలపై తెచ్చిన అప్పులు పేరుకుపోతున్నాయి. ధాన్యాన్ని రోడ్లపై నిల్వ చేస్తే అన్నీ ఇబ్బందులే. అందుకు ధళారుల ధరకు విక్రయిస్తున్నాం.

- రమణయ్య, రైతు

రైతులకు అండగా ఉంటాం



ధాన్యం మద్దతు ధరపై నిఘా పెంచుతాం. బ్రోకర్ల ఆట కట్టిస్తాం. ఖచ్చితంగా గిట్టుబాటు ధర వస్తుంది. సమయమనం పాటించాలి. అన్నదాతలకు అండగా ఉంటాం.

- నిర్మల, వ్యవసాయాధికారిణి

కొందరు తెల్లరాయిని (వైట్‌క్వార్ట్జ్) అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఒకచోట అనుమతి పొంది మరోచోట తవ్వకాలు జరుపుతున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూములు, కొండల్లో సైతం భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు చేపడు తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నా రు. ఈ అక్రమ వ్యవహారమంతా ఆ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. అక్రమార్కుల నుంచి వారికి ఆమ్యా మ్యాలు ముట్టడమే అందుకు కారణమని తెలుస్తోంది.

- ఉదయగిరి రూరల్

తరలిపోతున్న తెల్లరాయి

- కొండలను పిండి చేస్తున్నారు
- అనుమతి ఒకచోట.. తవ్వకాలు మరోచోట
- ప్రభుత్వ భూముల్లోనూ తవ్వకాలు
- ఖజానాకు భారీ గండి
- పట్టించుకోని అధికారులు



రవాణాకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాలతోపాటు మర్రిపాడు మండలాల్లో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. కొందరు అక్రమార్కులు లీజు పేరుతో ప్రభుత్వానికి కొద్దోగొప్పో సొమ్ము చెల్లించి వారి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ అసైన్డ్, పేదల, అటవీ శాఖ భూముల్లో భారీ ఎక్స్‌కవేటర్లతో పెద్ద పెద్ద గోతులు తీసి తెల్లరాయి నిక్షేపాలను వెలికితీస్తున్నారు. ఇటీవల ఉదయగిరి, మర్రిపాడు, వరికుంటపాడు మండలాల్లో ఈ అక్రమ రవాణా జోరందుకొంది. గూడూరు, ఇతర జిల్లాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి తవ్వకాలు జరిపిస్తు న్నారు. రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లతో రాయిని వెలికి తీయించి పగలు కూలీలచే వాటిని పగలగొట్టి రవాణాకు సిద్ధం చేస్తున్నారు. ఒకేసారి లారీల్లో కూలీలచే లోడ్ చేయించి అర్ధరాత్రి సమయాల్లో రవాణా చేస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి ఏదో ఒక లీజు క్వారీ వద్ద తవ్వకాలు చేపట్టినట్లు పత్రాలు సృష్టిస్తూ ప్రభుత్వ ఖాజానాకు భారీ గండికొడుతున్నారు. **ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్‌లు:** ప్రభుత్వ అనుమతి లేనిదే బ్లాస్టింగ్‌లు చేయకూడదు. కొంతమంది క్వారీ యజమానులతోపాటు తెల్లరాయి తరలించే అక్రమార్కులు వారి ఇష్టమొచ్చినట్లు బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో భూమిలో నుంచి వెలుపలికి తీసిన భారీ రాళ్లకు రంధ్రాలు వేసి బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఉదయగిరి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో బ్లాస్టింగ్ శబ్దాలు అధికమయ్యాయని, పక్కాగృహాలు సైతం నెర్రెలు బారుతున్నాయని గతంలో అధికారుల దృష్టికి సైతం తీసుకొచ్చారు.



కొండ ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్

కన్నెత్తి చూడని అధికారులు: తెల్లరాయి కోసం అక్రమార్కులు ప్రభుత్వ, అటవీ శాఖ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపున కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. ప్రధానంగా మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల వారికి అక్రమార్కులు మామూళ్లు ముట్టచెప్పుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేగాక సంబంధిత వీఆర్వోలను ముందే కలిసి వారి చేతులు తడిప తమ వ్యవహారాలను చక్కబెట్టుకొంటున్నారు. ఉదయగిరి మండలం కొండాయపాళెం, తిరుమలాపురం, నేలటూరు, చెర్లోపల్లి, చెరువుపల్లి, అప్పసముద్రం, దుత్తలూరు మండలం మందాలనాయుడుపల్లి, కొత్తపేట, వరికుంటపాడు జడదేవి, బోయమడుగుల, యర్రంరెడ్డిపల్లి, సీతారామపురం మండలం నారాయణప్పపేట, అయ్యవారిపల్లి, బసినేనిపల్లి, వింజమూరు మండలం చాకలకొండ, కాటేపల్లి, ఊటుకూరు తదితర గ్రామాల్లో తెల్లరాయి నిక్షేపాలు ఉన్నాయి. అక్రమార్కులు ముందుగా రాయి నాణ్యతను పరిశీలించాక తవ్వకాలు జరుపుతున్నారు. వాటిలో ఏ, బీ, సీ గ్రేడ్‌లకు ఒక్కో ధర ఉంది. ఆ రకం రాయి ఏ క్వారీలో ఉందో గమనించి తవ్వకాలు జరుపుతున్నారు. **విదేశాల్లో డిమాండ్:** విదేశాల్లో తెల్లరాయికి మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా తెల్లరాయిని గ్లాసులు, కంప్యూటర్లు, ట్యూబ్‌లైట్ తదితర వస్తువుల తయారీలో ఉపయోగిస్తారు. ఈ ప్రాంతం నుంచి గతంలో రాయిని చైనా, జర్మనీ తదితర దేశాలకు తరలించేవారు. చైన్నై తీసుకెళ్లి అక్కడ నుంచి సముద్రం మార్గం ద్వారా షిప్పుల్లో పంపించేవారు. ప్రస్తుతమూ కృష్ణపోర్టు నుంచి ఆయా దేశాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి తెల్లరాయి అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తెల్లరాయిని లారీలో లోడ్ చేస్తున్న కూలీలు



ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు



బ్లాస్టింగ్ చేసేందుకు వేసిన రంధ్రం

‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపిచంద్ బి) వీరేన్ రస్కిన్హా
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఊహూరు కెన్యాట్ట బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమ్ కెన్యాట్ట డి) మవాయి కిబాకి

4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహాలని డి) అదూర్ గోపాలకృష్ణన్

6. 2017లో లండన్ వేదికగా జరిగిన ‘ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్’ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవింద్‌సింగ్ ఖాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే ‘ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెవై)’ కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యాన

10. 2017 నవంబరు 28న జరిగే ‘ప్రపంచ భాగస్వామ్య సదస్సు’కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్ది అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం ‘ఈ-శక్తి’ అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్ధనపుర కొట్టె(శ్రీలంక)
సి) న్యేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)

16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్

17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్

18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ‘ప్రపంచ ఏనుగుల దినోత్సవం’ సందర్భంగా ‘గజయాత్ర’ ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. ‘ఏనుగుల దినోత్సవం’ ఎప్పుడు?
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన ‘క్యూరియాసిటీ’ రోవర్ ఏ దేశానికి చెందింది?
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా

20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి

21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా

22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో ‘ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్’ను నిర్వహించిన నగరం?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా

23. ‘భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు’కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియ)
డి) సిసిలి(ఇండోనేషియా)

24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో ‘జనగణమన’కు దర్శకత్వం వహించింది?
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చాబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్

25. 2017 ఆగస్టులో భారత కోస్ట్‌గార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర

26. 2017కి గాను ‘ద హ్యూగో అవార్డు’ పొందిన నవల ‘ద ఒబిలిస్క్ గేట్’ రచయిత?
ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్

27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్

28. కుష్టు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన ‘రూత్‌ఫౌ’ని ఏ దేశంలో మరో ‘మదర్ థెరిసా’గా వ్యవహరిస్తున్నారు?
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్

29. కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్

30. ‘దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన’లో భాగంగా కేంద్రం ప్రారంభించిన ‘ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన’ ముఖ్య ఉద్దేశం?
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం

31. ఎడిస్ ఈజిప్ట్ ద్వారా సంక్రమించే జికా వైరస్ క్యూలెక్స్ దోమల ద్వారా సంక్రమిస్తుందని ఏ దేశ శాస్త్రవేత్తల పరిశోధనలు వెల్లడించాయి?
ఎ) కెనడా బి) సెనెగల్ సి) పెరూ డి) బ్రెజిల్

32. SATH(సస్టైనయిబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) కార్యక్రమంలో భాగంగా ‘నీతి ఆయోగ్’ ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) కర్ణాటక బి) అసోం సి) హర్యాన డి) ఉత్తరప్రదేశ్

33. SATH కార్యక్రమంలో భాగంగా ‘నీతి ఆయోగ్’ విద్య కార్యక్రమాలు అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) బీహార్ బి) ఒడిశా సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

34. ఏ కార్యక్రమం 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మోదీ నూతన భారత నిర్మాణం కోసం ‘సంకల్ప్ సె సిద్ధి’ అనే ప్రచారానికి పిలుపునిచ్చారు?
ఎ) చంపారన్ ఉద్యమం
బి) క్విట్ ఇండియా ఉద్యమం
సి) సహాయ నిరాకరణ ఉద్యమం
డి) శాసన ఉల్లంఘన ఉద్యమం

35. ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో లేనివారు?
ఎ) స్మృతి ఇరాని బి) అహ్మద్ పటేల్
సి) శంకర్ సింఘ్ వాఘేలా డి) అమిత్‌షా

36. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అజ్మీర్ ఎం.పి. సన్వర్‌లాల్ జాట్ ఏ పార్టీకి చెందినవారు?
ఎ) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)
బి) భారతీయ జనతాపార్టీ(బిజెపి)
సి) ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి)
డి) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సి)

37. ఆసియా సొసైటీ నుంచి 2017కి గాను ‘ఆసియా గేమ్ చేంజర్స్ అవార్డు’కి ఎంపికైనది?
ఎ) నరేంద్ర మోదీ బి) రవీంద్ర జడేజా
సి) జాక్ మా డి) దేవ్ పటేల్

38. 17 దేశాలు పాల్గొన్న ‘హర్ట్ ఆఫ్ ఆసియా’ 8వ సమావేశానికి 2017 ఆగస్టులో ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) ఆస్తానా(కజకిస్థాన్) బి) ఇస్తాంబుల్(టర్కీ)
సి) బాకు(అజర్‌బైజాన్) డి) న్యూఢిల్లీ(ఇండియా)

39. ప్రపంచ యువజన దినోత్సవంగా ఆగస్టు 12ని ఐక్యరాజ్య సమితి ఎప్పటి నుంచి నిర్వహిస్తుంది?
ఎ) 2000 బి) 1975 సి) 2002 డి) 1989

40. భారత్‌లో తొలిసారి ‘విపత్తు నిర్వహణ సంస్థ’ను రైల్వే శాఖ ఏ గ్రామంలో ఏర్పాటు చేస్తుంది?
ఎ) హెజ్జాల(బెంగళూరు) బి) బికనూర్(తెలంగాణ)
సి) యలమంచలి(ఆంధ్రప్రదేశ్)
డి) గుర్‌గామ్(హర్యాన)

41. 2016 గణాంకాల ప్రకారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వెలువరించిన నివేదిక ప్రకారం 2021 నాటికి ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందనున్న నగరం?
ఎ) ఢిల్లీ(ఇండియా) బి) హనోయ్(వియత్నాం)
సి) టోక్యో(జపాన్) డి) ముంబై(ఇండియా)

42. యు ట్యూబ్‌కు పోటీగా 2017 ఆగస్టు 10న ఫేస్‌బుక్ ప్రారంభించిన చానల్?
ఎ) బీ మై ఐస్ బి) విర్గో సి) వాచ్ డి) లిటిల్ వండర్

43. ఒలింపిక్ పతకం సాధించే సత్తా కలిగిన క్రీడాకారుల సహాయం కోసం ప్రారంభించిన ‘టార్గెట్ ఆన్ ఒలింపిక్ పోడియం’లో చోటు పొందిన అతి పిన్న వయస్కుడు(15 ఏళ్లు) శపథ్ భరద్వాజ్ ఏ క్రీడాకారుడు?
ఎ) బ్యాడ్మింటన్ బి) స్విమ్మింగ్
సి) బాక్సింగ్ డి) షూటింగ్

44. భారత్‌తో సహా 80 దేశాలకు వీసా రహిత ప్రవేశానుమతి ఇస్తున్నట్లు ప్రకటించిన దేశం?
ఎ) సౌదీఅరేబియా బి) టర్కీ సి) ఫిజి డి) ఖతార్

సమాధానాలు

1) సి	7) బి	13) డి	21) బి	29) డి	37) డి
2) బి	8) డి	14) డి	22) ఎ	30) సి	38) డి
3) ఎ	9) సి	15) డి	23) ఎ	31) డి	39) ఎ
4) డి	10) డి	16) బి	24) సి	32) సి	40) ఎ
5) ఎ	11) ఎ	17) ఎ	25) సి	33) ఎ	41) ఎ
6) బి	12) బి	18) డి	26) బి	34) బి	42) సి
		19) డి	27) బి	35) సి	43) డి
		20) సి	28) ఎ	36) బి	44) డి

ఉద్యోగాలు

ఎన్‌హెచ్ఎఐ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఎఐ)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 18
కాంట్రాక్ట్ వ్యవధి: రెండేళ్లు
అర్హత: బిఇ/ బిటెక్(సివిల్) ఉత్తీర్ణతతోపాటు రోడ్ & హైవే వర్క్సులో ఏడాది అనుభవం ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.50,000
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Chief General Manager(Tech) & Regional Officer, Chennai
National Highways Authority of India Regional Office - Chennai
SRI Tower, 3rd Floor, DP - 34(SP), Industrial Estate, Guindy, Chennai, Tamil Nadu - 600032 **వెబ్‌సైట్:** www.nhai.org

ఆర్మీ వార్ కాలేజ్

మధ్యప్రదేశ్, మహౌలోని ఆర్మీ వార్ కాలేజ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 10
పోస్టులు: ఎల్‌డిసి 3, సివిలియన్ మోటార్ డ్రైవర్ 2, కుక్ 1, సూపర్‌వైజర్ 3, ఫాటిగ్‌మన్ 1
అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ ఇంటర్ ఉత్తీర్ణత + నిమిషానికి 30 పదాల టైపింగ్ వేగం+ ఏడాది అనుభవం ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.50
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 27
చిరునామా: The Presiding Officer, Civilian Direct Recruitment(Scrutiny of Applications) Board, Junior Command Wing, Army War College, Mhow, Madhya Pradesh - 453441

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?

భారతదేశ వ్యవసాయ రంగం

1. భారతదేశంలో సుమారు ఎంత శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది?
ఎ) 46 బి) 50 సి) 58 డి) 64
2. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఎంత శాతం?
ఎ) 14 బి) 15 సి) 16.5 డి) 17.5
3. భారతదేశంలో ఎంత శాతం జనాభా పేదరికంలో ఉంది?
ఎ) 24 బి) 25 సి) 26 డి) 27
4. ఒక దేశ అభివృద్ధికి సరైన నిర్వచనం దేనితో తెలుస్తుంది?
ఎ) వ్యవసాయ రంగం బి) రవాణా రంగం
సి) స్థూల ఉత్పత్తి రంగం డి) తలసరి ఆదాయం
5. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా దేనిపై ఆధారపడి ఉంది?
ఎ) తయారీ రంగం బి) కార్పొరేట్ రంగం
సి) ప్రభుత్వ రంగం డి) వ్యవసాయ రంగం
6. 'ఆపరేషన్ ఫ్లడ్'కు పితామహుడు?
ఎ) నార్మన్ బోర్లాగ్ బి) ఎం.ఎస్. స్వామినాథన్
సి) డా. వర్గీస్ కురియన్ డి) విలియం గాండీ
7. భారతదేశంలో నూనె గింజల ఉత్పత్తి పెరగడానికి కారణం
ఎ) వైట్ రెవల్యూషన్ బి) ఎల్లో రెవల్యూషన్
సి) గ్రీన్ రెవల్యూషన్ డి) బ్రౌన్ రెవల్యూషన్
8. భారతదేశంలో అత్యధికంగా తేయాకును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) సిక్కిం
సి) అస్సోం డి) పశ్చిమ బెంగాల్
9. జాతీయ వ్యవసాయ బీమా పథకం ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1997 అక్టోబరు బి) 1998 అక్టోబరు
సి) 1999 అక్టోబరు డి) 2000 అక్టోబరు
10. కింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?
ఎ) జొన్న బి) మొక్క జొన్న
సి) వేరుశనగ డి) గోధుమ
11. కిందివాటిలో భారత జాతీయ ఆదాయాన్ని మదించే సంస్థ?
ఎ) ప్రణాళికా సంఘం
బి) జాతీయ డేటా సెంటర్
సి) జాతీయ గణాంక సంస్థ
డి) ఏదీకాదు
12. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1947 బి) 1948
సి) 1949 డి) 1950
13. దేశంలో అత్యధికంగా రబ్బరును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) ఉత్తరప్రదేశ్ డి) కేరళ
14. 'ద ఫ్యూచర్ ఆఫ్ ఇండియా' గ్రంథ రచయిత?
ఎ) అమర్త్యసేన్ బి) బిమల్ జలాన్
సి) అభిషేక్ నాయర్ డి) చేతన్ భగత్
15. కుద్రేముఖ్ ఇనుప ఖనిజ ఫీల్డ్ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) గుజరాత్ డి) కర్ణాటక
16. కూరగాయల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు 3) మూడు 4) నాలుగు



సందీప్ కంభంపాటి
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ



17. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు
సి) మూడు డి) నాలుగు
18. నాబార్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1980 బి) 1981 సి) 1982 డి) 1983
19. హరిత విప్లవం ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1964 - 65 బి) 1965 - 66
సి) 1966 -67 డి) 1967 - 68
20. ప్రధాన మంత్రి గ్రామోద్యమ యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1999 బి) 2000 సి) 2001 డి) 2002
21. కింది వారిలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టాన్ని ఎవరు ప్రకటించారు?
ఎ) ప్రణబ్ ముఖర్జీ బి) మన్మోహన్ సింగ్
సి) చిదంబరం డి) అరుణ్ జైట్లీ
22. ప్రభుత్వ కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1953 ఏప్రిల్ బి) 1998 ఆగస్టు
సి) 1991 జూలై డి) 1995 నవంబరు
23. కిసాన్ కాల్ సెంటర్లను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2000 జూలై బి) 2002 మార్చి
సి) 2004 మార్చి డి) 2004 జనవరి
24. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2002 మార్చి బి) 2004 మార్చి
సి) 2004 జనవరి డి) 2006 జనవరి
25. 2013- 14 లెక్కల ప్రకారం అత్యధికంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసిన రాష్ట్రం?
ఎ) మధ్యప్రదేశ్ బి) పంజాబ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
26. 2010 లెక్కల ప్రకారం భారతదేశంలో చెరువుల ద్వారా అత్యధిక భూమి సాగులో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తమిళనాడు డి) ఉత్తరప్రదేశ్
27. జాతీయ ఆహార భద్రత పథకాన్ని ఏ కాలంలో ప్రారంభించారు?
ఎ) తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
బి) పదో పంచవర్ష ప్రణాళిక చివరలో
సి) పదకొండో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
డి) పదకొండో పంచవర్ష ప్రణాళిక చివరలో
28. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'ను ప్రకటించినవారు?
ఎ) నరేంద్రమోది బి) మన్మోహన్ సింగ్
సి) ఎ.బి. వాజపేయి డి) ఐ.కె. గుజ్రాల్
29. భారత్‌లో జనపనార సాగు, ఏ నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
ఎ) గంగ బి) మహానది
సి) బ్రహ్మపుత్ర డి) గోదావరి
30. భారత్‌లో అతి పొడవైన సేద్య కాలువ?
ఎ) బకింగ్ హం బి) సర్వాంద్
సి) ఇందిరాగాంధీ డి) సట్లెజ్ - యమున
31. అత్యధికంగా పత్తిని ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) గుజరాత్
32. రబీ, ఖరీఫ్‌లే కాక వ్యవసాయ రంగంలోని మరో కాలం?
ఎ) జమాద్ బి) బరేసాతి సి) షరద్ డి) ఝుం
33. నేలకు ఎక్కువ నత్రజనిని అందించాలంటే ఏ పంటను పండించాలి?
ఎ) గోధుమ బి) ఆవాలు
సి) పొద్దు తిరుగుడు డి) చిరుధాన్యాలు
34. కింది వాటిలో ఏ పంటకు నల్ల రేగడి భూమి ఎక్కువగా అనుకూలించదు?
ఎ) పత్తి బి) గోధుమ
సి) వేరుశనగ డి) బంగాళదుంప
35. కింది వాటిలో వాణిజ్య పంట ఏది?
ఎ) వరి బి) గోధుమ
సి) చెరకు డి) జొన్నలు
36. కేరళలో ఎక్కువగా వినియోగించే వరి వంగడాన్ని ఉప్పునేలలో కూడా సాగుచేయవచ్చు. అయితే దాని పేరు?
ఎ) నీవారా బి) పొక్కలి సి) పొన్ని డి) సాంబ
37. పర్వత ప్రాంతాల్లో దేనిని ఎక్కువగా పండిస్తారు?
ఎ) వరి బి) తేయాకు
సి) వేరుశనగ డి) బంగాళదుంప
38. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తయ్యే కాఫీ రకం?
ఎ) ఓల్డ్ చిక్స్ బి) కూర్గే
సి) అరబిక్ డి) కెంట్స్
39. కేంద్రీయ వరి పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) కాన్పూరు
సి) కోయంబత్తూరు డి) కటక్
40. ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగంలో రుణాత్మక వృద్ధి నమోదయింది?
ఎ) మూడో బి) రెండో
సి) ఏడో డి) తొమ్మిదో

సమాధానాలు

1) సి	7) బి	13) డి	19) సి	27) డి	35) సి	
2) డి	8) సి	14) బి	20) బి	28) బి	36) బి	
3) సి	9) సి	15) డి	21) ఎ	29) ఎ	37) బి	
4) డి	10) డి	16) బి	22) బి	30) సి	38) సి	
5) డి	11) సి	17) ఎ	23) డి	31) డి	39) డి	
6) సి	12) డి	18) సి	24) డి	32) ఎ	40) ఎ	
			25) సి	33) డి		
			26) సి	34) సి		

ఉద్యోగాలు

గెయిల్ ఇండియా

గెయిల్ ఇండియా లిమిటెడ్ - కింది విభాగాల్లో **ఎస్ 3 & ఎస్ 5** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 151
విభాగాలు: ఎలక్ట్రికల్, ఫైనాన్స్ & అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, లేబొరేటరీ, మార్కెటింగ్, అఫిషియల్ లాంగ్వేజ్, స్టోర్స్ & పర్చేజ్
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.gailonline.com

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్)- **సూపరింటెండెంట్, స్టోర్ కీపర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 95
పోస్టులు - ఖాళీలు: స్టోర్ సూపరింటెండెంట్ 55, స్టోర్ కీపర్ 40
అర్హత: సూపరింటెండెంట్‌కు డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. స్టోర్ కీపర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రెండు పోస్టులకు స్టోర్ అకౌంట్స్ మెయింటైన్ చేయడంలో అనుభవం ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా
పరీక్ష కేంద్రం: ఢిల్లీ
ఆర్డినరీ పోస్టు ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 9
చిరునామా: Director PC(AHC), Air Head quarter, J Block, New Delhi - 110106
వెబ్‌సైట్: www.indianforce.nic.in

ఎఎహెచ్‌సి

అగ్రికల్చర్ & హార్టికల్చర్ కార్పొరేషన్- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 1600
పోస్టులు: డిస్ట్రిక్ట్ ఆఫీసర్(డేటా కలెక్షన్) 1182, డిస్ట్రిక్ట్ మేనేజర్ 197, ఎంఐఎస్ ఆఫీసర్ 197, ఏరియా మేనేజర్ 20, స్టేట్ హెడ్ 4
అర్హత: డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.700
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
వెబ్‌సైట్: www.aahc.org.in

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 657
పోస్టులు - ఖాళీలు: మైనింగ్ సిర్దార్ 298, స్టాఫ్ నర్స్ 64, టెక్నీషియన్(రేడియోగ్రాఫర్ 1, పాథలాజికల్ 9, రిఫ్రాక్షన్/ ఆప్టోమెట్రీ 1), ఆడియొమెట్రీ టెక్నీషియన్ 4, జూనియర్ టెక్నీషియన్ (ఇసిజి/ ఇఇజి) 4, ఫార్మసిస్ట్ ట్రైనీ 2, ఓవర్సీర్ (సివిల్) 4, జూనియర్ టెక్నీషియన్ ఇన్‌స్పెక్టర్/ జూనియర్ కెమిస్ట్ 48, జూనియర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 32, ట్రాన్స్‌లేటర్ ట్రైనీ 9, క్లర్క్ 139, స్టోర్ ఇష్యూ క్లర్క్ 31, అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 11
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/ ఇంటర్/ మెట్రిక్యులేషన్/ డిగ్రీ పాసై ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.westerncoal.nic.in

ఐఐఎం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అకౌంటెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ లైబ్రరీ& ఇన్ఫో అసిస్టెంట్, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్
వెబ్‌సైట్: www.iimv.ac.in/careers

ఐజిఎన్‌టియు

ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఐజీఎన్‌టియు)- ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
క్యాంపస్‌లు: అమర్‌కంటక్ క్యాంపస్ (యోగా డిపార్ట్‌మెంట్, కృషి విజ్ఞాన్ కేంద్ర ఐసిఎఆర్ ప్రాజెక్ట్, మోడల్ ట్రైబల్ స్కూల్), రీజనల్ క్యాంపస్ (మణిపూర్)(డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ ఆంత్రపాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.igntu.ac.in/recruitment.htm

ఇసిఐఎల్

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) - కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(న్యూక్లియర్), జనరల్ మేనేజర్(ఆర్&డి), డిప్యూటీ జనరల్ మేనేజర్(కంపెనీ సెక్రటరీ), పర్చేజ్ మేనేజర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్
వెబ్‌సైట్: http://careers.ecil.co.in

రైట్స్ లిమిటెడ్

రైట్స్ లిమిటెడ్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్ (సివిల్) 2, జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్ 2, ఇ&ఎం ఎక్స్‌పర్ట్ 2), మేనేజర్(సోషియాలజీ, సోషల్ వర్క్) 1, అసిస్టెంట్ మేనేజర్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ 2, సోషియాలజీ / సోషల్ వర్క్ 2, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 4), సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) 1, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్) 1
పూర్తి వివరాలకు ఆగస్టు 26 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.rites.com

కోవూరులో భారీ వర్షం

కోవూరు/కొడవలూరు: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో కోవూరులోని పలురోడ్లు జలమయమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రానికి మారిపోయింది. దీంతో ఆకాశం మేఘావృతమై మెరుపులు మెరుస్తూ భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా రాజుపాళెం కొద్దిసేపు గాలులు వీచాయి. మరో వారం రోజుల్లో కోతల నేపథ్యంలో వర్షం పడడంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ప్రజాస్వామ్య విలువలకు పాతర

● కార్యకర్తల సమావేశంలో ఎంపీ మేకపాటి

కోవూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్య విలువలకు పాతరవేశారని పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగు గ్రామంలోని గండవరపు వెంకురెడ్డి నివాసంలో బుధవారం ఆయన కార్యకర్తలతోమాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని ప్రజలు ఛీ కొడితే మట్టిలో కలిసిపోవాల్సిందేనన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును గద్దె దించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు. పంచాయతీ పరిధిలోని మజరాల్లో పేదలకు తాగునీటిని అందించేందుకు వీలుగా వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ సర్పంచి వెంకురెడ్డి, మాజీ ఉపసర్పంచి వెంకయ్య, బీజేపీ సీనియర్ నాయకులు చిలుకోటి వరదయ్య, పొన్నవోలు సుధీర్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, శివుని నరసింహులురెడ్డి, సింగారెడ్డి జనార్దన్‌రెడ్డి, అట్లూరు సుబ్రహ్మణ్యం, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..



కొళాయి చుట్టూ మురుగునీరు


● సమస్యల వలయంలో వరిణి గిరిజన కాలనీ



వరిణి గిరిజన కాలనీలోని శిథిలావస్థ గృహాలు

విడవలూరు: వరిణి పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ కాలనీలో సుమారు 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే ఎన్నికల సమయంలో మీ కష్టాలను తీరుస్తామని హామీలు గుప్పించిన నాయకులు గెలిచిన తరువాత తమ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గృహాల్లో 20 ఏళ్లకు పైబడి ఉండడంతో అవి శిథిలావస్థకు చేరాయి. దీంతో కొద్దిపాటి వర్షం పడినా ఎప్పుడు ఏమి జరుగుతుందోనని దినదిన గండంగా జీవనం సాగిస్తున్నారు. అదేవిధంగా కాలనీలో పారిశుధ్యం దారుణంగా ఉంది. మురుగుకాలువ సక్రమంగా లేకపోవటంతో మురుగు నీరు ఇంటి ముందే నిల్వ చేరిపోతోంది. దీంతో ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా వీధిలైట్లు సక్రమంగా వెలగటంలేదు. దీంతో రాత్రివేళల్లో రాకపోకలు ఇబ్బందికరంగా మారుతోంది. కాలనీలోని మంచినీటి కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృధాగా పోతోంది. ఇలా కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికైనా పాలకులు తమ గోడును పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు



కాలనీ అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

రాఘవ, పంచాయతీ కార్యదర్శి

గృహాలు కట్టించాలి



శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఉండలేక పోతున్నాం. మాకు గృహాలు మంజూరు చేయాలని కోరుతున్నా పట్టించుకోవటంలేదు. వర్షాలు వచ్చినప్పుడు ఆందోళనగా ఉంటోంది.

- చెంచమ్మ స్థానికురాలు

రోగాలు వ్యాపిస్తున్నాయి



కాలువలు లేకపోవటంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో దోమల బెడద అధికంగా ఉంది. అంతే కాకుండా రోగాలు వ్యాపిస్తున్నాయి. అధికారులు పట్టించుకోవాలి.

- సుజాతమ్మ స్థానికురాలు

సౌకర్యాలు కల్పించాలి



కాలనీలో సౌకర్యాలు కల్పించటంలో పంచాయతీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మాకు మురుగు కాలువలు కట్టించాలి అదే విధంగా వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలి.

-కోనమ్మ, స్థానికురాలు

గింజ దశలో మెలకువలు పాటించాలి



రైతులతో వ్యవసాయాధికారులు, సిబ్బంది

కోవూరు: వరిపైరు గింజగా తయారయ్యే దశలో ఉందని రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కళ్యాణి తెలిపారు. మోడేగుంట, వేగూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూక్ష్మపోషకాలైన జింకు సల్ఫేటు, బోరాన్, జిప్సమ్, జీలుగ, పిల్లిపెసరలను రాయితీ రూపంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఈవోలు రాజశేఖర్, మోహరున్నీషా, రామలక్ష్మి, అనిల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి నీరజ రైతులకు తెలిపింది. మండలంలోని శ్రీపురంధరపురం, సాల్మానుపురం గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ శ్రీపురందరపురం గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. రాబోయే సీజన్‌లో సాగుకు అవసరమైన ఘన, ద్రవ జీవామృతంతోపాటు వివిధ కషాయాలు తదితర వనరులను సిద్ధం చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులను కోరారు. అనంతరం భూసార పరీక్షల ప్రాధాన్యంను వివరించి ఇంకా భూసార కార్డులు పొందని రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి తమ నమూనాలను పరీక్ష చేయించుకోవచ్చని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే పోలంరెడ్డి



కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

కొడవలూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని ఆలూరుపాడు పంచాయతీలో రూ.75.45 లక్షల నిధులతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరుపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నీరు-చెట్టు కింద సుమారు రూ. 25 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన కల్వర్టులు,వంతెనలు, బ్రిడ్జిలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగించి కొత్తవి నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. 2019లోపు అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతోపాటు మట్టి రహిత రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ. 10 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఆయన తెలిపారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసుంధర,తహసీల్దార్ బషీర్, జడ్పీటీసీ ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి రమేష్, నీటి సంఘం అధ్యక్షుడు జొన్నల శివవెంకటేశ్వర్లరెడ్డి, కొట్టే మల్లికార్జున, సతీష్‌రెడ్డి, ఆలూరుపాడు సర్పంచు రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : క్రమశిక్షణ అలవరుచుకుంటేనే విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని రేబాల హైస్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. మండలంలోని రేబాల హైస్కూల్‌లో 1992 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గతేడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఇంతియాజ్‌కు రూ.5వేలు నగదు అందజేశారు. అనంతరం 1నుంచి 5తరగతుల వరకు విద్యార్థులకు నోట్పులు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెంకాయల సుధాకర్, బత్తల హరికృష్ణ, చంద్రజైపాల్, హైస్కూలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రేపు జొన్నవాడలో సామూహిక వరలక్ష్మివ్రతం

● భక్తులకు పూజా సామగ్రి సమకూర్చనున్న ఆలయం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : శ్రావణ శుక్రవారం సందర్భంగా రేపు జొన్నవాడ ఆలయంలో ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ కమిటీ ఛైర్మెన్ పుట్టాసుబ్రహ్మణ్యం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వ్రతంలో పాల్గొనదలచిన భక్తులకు ఆయన ఆహ్వానం పలికారు. ఈ వ్రతంలో పాల్గొనదలచిన గృహిణులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పూజలో పాల్గొనే భక్తులకు పూజాసామగ్రిని ఆలయం తరపునే సమకూరుస్తారని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వింజమూరు: మండలంలోని నందిగుంట, గుండెమడగల బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో ఈ మాలకొండరావు బుధవారం పరిశీలించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు, భోజన నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ఉపా ధ్యాయులు, సిబ్బంది ధర్మారెడ్డి పాల్గొన్నారు.


పిల్లలతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో

నిరుపయోగంగా జడ్పీ అతిథి భవనం

ఉదయగిరి: ఉదయగిరిలో 17 ఏళ్ల క్రితం జడ్పీ నిధులతో నిర్మించిన అతిథిగృహం నిరుపయోగంగా ఉంది. చేరుకుంటోంది. అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్ అతిథిగృహం నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. పూర్తిస్థాయిలో భవనాన్ని నిర్మించారు. నిధుల లేమితో ప్రహరీ నిర్మాణ పనులు పూర్తికాలేదు. అప్పట్నుంచి భవనం నిరుపయోగంగా ఉంది. తలుపులు, కిటికీలు సైతం దెబ్బతింటున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా: అసాంఘిక కార్యకలాపాలకు అతిథి భవనం అడ్డాగా మారింది. చుట్టూ చెట్లు మొలచి విషసర్పాలకు నిలయమైంది. కొందరు బహిర్భూమిగా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షల రూపాయలతో నిర్మించి అసంపూర్తిగా ఉన్న భవనానికి నిధులు మంజూరు చేయించి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా అతిథిగృహం

సమావేశంలో చర్చిస్తా



అసంపూర్తిగా ఉన్న జడ్పీ అతిథి భవనం గురించి జడ్పీ సమావేశంలో చర్చిస్తా. భవనం వాడుకలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తా.

ఎల్.అశోక్‌ప్రవీణ కుమారి, జడ్పీటీసీ

వాడుకలోకి తేవాలి



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన జడ్పీ అతిథిగృహాన్ని వాడుకలోకి తీసుకు రావాలి. ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలి.

షమీమ్, ఎంపీటీసీ

నిధులు దుర్వినియోగం



లక్షలాది రూపాయలతో భవనం నిర్మించారే తప్ప వాడుకలోకి తీసుకురా లేదు. దీంతో నిధులు దుర్వినియోగమయ్యాయి. అధికారులకూ తిప్పలు తప్పడం లేదు.

కప్పా శ్రీనివాసరాజు, సర్పంచు

బెల్టుషాపులు కట్టడి చేద్దాం

ఉదయగిరి: గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపులను కట్టడి చేసేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని బెల్టుషాపుల నిరోధక మండల స్థాయి కమిటీ చైర్మన్ చేజర్ల సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఎక్కడైనా బెల్టు షాపులు ఉన్నట్టయితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనా, వెలుగు సిబ్బందిపైనా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మద్యం బెల్టుషాపులు నిరోధించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నరసింహారావు, ఏఎస్ఐ బత్తల శ్రీనివాసులు, ఎంపీడీవో వీరాస్వామి, ఎంఈవో పి.మోహన్‌రావు, ఏపీఎం కాంతారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చేజర్ల సుబ్బారెడ్డి

టీడీపీకి పుట్టగతులుండవ్

సీతారామపురం: రాబోయే రోజుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పుట్టగతులుండవని వైసీపీ సీతారామపురం మండల నాయకులు విమర్శించారు. వారు బుధవారం బసినేనిపల్లిలో విలేఖరులతో మాట్లాడారు. మొన్న ఫైబర్ చెక్‌డ్యాంలు, నిన్న నీరు-చెట్టు, నేడు పసుపు వంటి వరుస కుంభకోణాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలే విస్తుపోతున్నారన్నారు. వరికుంటపాడు మండలం జడదేవిలో ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుపై వారు తిరగబడటం వారి అసహనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టిస్తున్న తెలుగు తమ్ముళ్లను హెచ్చరించాల్సిన ఎమ్మెల్యే వారికి వత్తాసు పలకడం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి నియోజకవర్గంలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు చేస్తే ఎన్నో వాస్తవాలు బయటపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జనార్థన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు పీసీ అల్లూరురాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

పేద విద్యార్థులను ఆదుకుంటా


చెక్కును అందచేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు: పేద విద్యార్థులను ఆదుకుంటానని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక శ్రీవివేకానంద కళాశాల కరస్పాండెంట్ ఎం.గోపాల్‌రెడ్డికి ముందుగానే రూ.30 వేల చెక్కును ఆయనకు అందచేశారు. పది, ఇంటర్ స్థాయిలో ప్రథమ, ద్వితీయస్థానాలు పొందిన వారికి ఏటా రూ.6 వేల వంతున ఒక్కొక్కరికి అందచేస్తానని తెలిపారు. పేద విద్యార్థులు ఇబ్బందులకులోనై తమ చదువులు మానుకోకూడదనే ఉద్దేశంతో ఈ సాయాన్ని అందజేస్తున్నానని తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం సబ్ పోస్టాఫీసులోని ఏఐజీడీఎస్‌యూ ఉద్యోగులు మంగళవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భగా ఆ సంఘ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు, చేసుకొన్న ఒప్పందాలను విస్మరిస్తూ జీడీఎస్ కమిటీలను అమలు చేయడంలో తీవ్రమైన ఆలస్యం చేస్తోందన్నారు. జీడీఎస్‌ల రెగ్యులైజేషన్ కోసం ప్రతిఒక్కరూ ఐక్యం కావాల్సి ఉందన్నారు. అనంతరం ఎస్‌పీఎం శివప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కావలి బ్రాంచ్ అధ్యక్షులు ఎం.రమణయ్య, గురుమూర్తి, జక్రయ్య, నాగేశ్వరరావు, గండిపాళెం ఎస్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి

ఉదయగిరి: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో వీరాస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనుల చేస్తే కూలి గిట్టుబాటవుతుందన్నారు. క్షేత్ర సహాయకులు ప్రతిరోజూ పని ప్రదేశాల్లో తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో నరసింహారావు, టీఏ మధు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

ఉదయగిరి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనా, సర్పంచులపైనా ఉందని ఎంపీడీవో వీరాస్వామి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారం, మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కళాధర్, కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, కరీముల్లా, శేఖర్, నాగూర్‌బీ, కేశవకుమారి పాల్గొన్నారు.

ఫైబర్ చెక్‌డ్యాం పనుల పరిశీలన

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం పంచాయతీ నడింపల్లి తుంగవాగుపై నిర్మిస్తున్న ఫైబర్ చెక్‌డ్యాం పనులను బుధవారం ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి పరిశీలించారు. సుమారు రూ.60 లక్షలతో నిర్మిస్తున్న ఫైబర్ చెక్‌డ్యాం పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని జేఈ అంకులయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప్పుటూరి హరి, షేక్ జబ్బార్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఉదయగిరి రూరల్: ప్రస్తుత సీజన్‌లో సంభవించే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ రియాజ్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని దుర్గంపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వైద్యఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు సకాలంలో టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రసూల్‌బీ, అంగన్‌వాడీ, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

సీతారామపురం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామసభ నిర్వహించారు. సీతారామపురంలో గతంలో పనులపై జరిగిన ఆడిట్ వివరాలను ప్రజలకు వివరించారు. జయపురం, గుండుపల్లి, బాలాయపల్లి, బసినేనిపల్లి, సింగారెడ్డిపల్లి, పోలంగారిపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. 19న ఎంపీడీవో కార్యాలయం వద్ద బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తామిన ఎస్‌ఆర్పీ నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ నారాయణమ్మ, టీడీపీ నాయకులు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సొసైటీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఈసీ సురేష్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

వింజమూరు: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు చిరు సాయాన్ని అందించి ప్రోత్సహిస్తున్నట్లు ఎం.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.5 వేల వంతున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద పిల్లలుంటారని, అలాంటి వారికి సాయం చేస్తే కొంతైనా మేలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల దరఖాస్తులకు ఆహ్వానం

ఉదయగిరి రూరల్: ఎలాంటి విద్యార్హతా లేకపోయినా పదో తరగతి పరీక్షలు రాసేందుకు, పదో తరగతి పాసైన విద్యార్థులు ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏపీజే అబ్దుల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490725919ను సంప్రదించాలని ఆయన కోరారు.

'ఉపాధి' పనుల తనిఖీ

ఉదయగిరి రూరల్: స్థానిక షబ్బీర్ కాలనీ సమీప చౌడమ్మకుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీడీ శ్రీహరి తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించారు. పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించడంతోపాటు కూలీల శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మధు, సీనియర్ మేట్ బొజ్జా నరసింహులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తనాల పంపిణీ

ఉదయగిరి రూరల్: మండలంలోని పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాలు గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు పశు వైద్యాధికారి పి.గణేష్ తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 4 వేల కిలోల గడ్డి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, తెలిపారు. ఒక్కో రైతుకు 20 కిలోల చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవాజ్‌కు ఉత్తమ అవార్డు

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఖాజానవాజ్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. విధులను అంకితభావంతో ఆయనకు ఈ అవార్డు లభించింది. 71 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు ఆయనకు ప్రశంసాపత్రం అందించారు. ఆయన్ను పలువురు అభినందించారు.

మంత్రి వ్యాఖ్యలకు ఖండన

ఉదయగిరి: ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరుస్తూ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి ఖండించారు. బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. దళితుల పట్ల చిన్నచూపు చూస్తూ ఇలాంటి వ్యాఖ్యలు తగదని హితవు పలికారు.

సుధాకర్‌కు అభినందనలు

వింజమూరు: స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న స్థానిక శుభోదయ ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు జీ.సుధాకర్‌బాబుకు పలువురు అభినందనలు తెలిపారు. దీపం పథకం కింద ఆయన జిల్లాలోనే అత్యధికంగా కనెక్షన్లు అందచేశారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. 2014-15 వేడు కల్లోనూ మంత్రి నారాయణ ఆయనకు అవార్డు వచ్చింది. సహకరించిన అందరికీ సుధాకర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.



మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

నెలరోజుల్లో 15వేల కేసులు

- 379 మంది కోర్టుకు....
- రోడ్డు భద్రతే లక్ష్యం
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- డీటీసీ శివరామ ప్రసాద్



డీటీసీ శివరామ ప్రసాద్

నెల్లూరు (క్రైం) : రహదారి భద్రతే మా లక్ష్యం, ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం, గడిచిన నెల రోజుల్లో 15 వేల కేసులు నమోదు చేశామని రవాణా శాఖ ఉప కమిషనర్ శివరామ ప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం నెల్లూరులోని ఆర్టీఏ కార్యాలయంలో ఆయన విలేఖరు లతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణాశాఖ, పోలీసు, ఆర్టీసీ సంయుక్తంగా కృషి చేస్తున్నాయన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులను పలు విభాగాలుగా విభజించి ప్రతి రూటులో మూడు శాఖల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్ లేకుండా వాహనాలు నడిపితే సంబంధిత యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు. గత నెల 17వతేదీ నుంచి ఇప్పటి వరకు మొత్తం 15వేల కేసులు నమోదు చేశా మని, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే 300 మందిని, మద్యం సేవించి వాహనాలు నడిపే 79 మందిపై కేసులు పెట్టి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వాహన చోదకులు నిబంధనలు పాటించాలని, సంబంధిత పత్రాలన్నీ వెంట ఉంచుకోవాలని కోరారు. అతి వేగంగా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

20న ఎల్ఎల్ఆర్ మేళా...

రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వతేదీన ఆటో రిక్షా లైసెన్స్ కలిగిన వారు బ్యాడ్జీ తీసుకునేందుకు ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహిస్తున్నట్లు డీటీసీ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నెల్లూరు, గూడూరు, ఆత్మకూరు, కావలి, సూళ్లూరుపేటలోని కార్యాలయాల్లో ఈ మేళా జరుగుతుందన్నారు. నాన్ ట్రాన్స్‌పోర్టు ఆటో లైసెన్స్ కలిగిన డ్రైవర్లు ఫారం-2, ఫారం-1, 1ఏ మెడికల్ సర్టిఫికెట్, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు నకలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, అఫిడవిట్(సెల్ఫ్), రూ.260 రుసుముతో హాజరు కావాలని సూచించారు.

ఎన్‌సీసీ శిబిరాన్ని పరిశీలించిన ఎయిర్ కమాండర్





శిబిరంలో మాట్లాడుతున్న కమాండర్, గౌరవ వందనం స్వీకరిస్తూ..

నెల్లూరు (క్యాంపస్) : నెల్లూరులోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 10ఏ నావెల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరాన్ని బుధవారం డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ ఎయిర్ కమాండర్ పీ మహేశ్వర్ పరిశీలించారు. శిబిరం నిర్వహిస్తున్న తీరును ఆయన మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు ఇలాంటి క్యాంపులలో ఎన్నో విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్నల్ హెచ్‌కే నాయుడు, క్యాంప్ కమాండెంట్ ఏకే వర్మ, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏకీకృత రూల్స్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

నెల్లూరు (క్యాంపస్) : రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత సర్వీసు రూల్స్‌లో మున్సిపాలిటీ ఉపాధ్యాయులను చేర్చాలనే ప్యాప్టో ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్లు మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నగర అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమం వారం రోజులపాటు జరుగుతుందని, మున్సిపల్ టీచర్లందరూ సంతకాలు చేసి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. పురపాలక సంఘాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమంటూ డీఎంఏ కార్యాలయం ముందు ప్యాప్టో తలపెట్టిన ఆందోళనకు తమ మద్దతు లేదని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆషిష్ ఎంపిక



ఆషిష్‌ను అభినందిస్తున్న బీఎంఆర్ తదితరులు

కావలి: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కావలి సెంటాన్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న డి.ఆషిష్ ఎంపికైనట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. బుధవారం కావలిలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు డి.ఆషిష్ ఎంపిక కావడంతో ఆయన ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నారు. ఇందుకు అవసరమయ్యే ఖర్చులను రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు అందజేసి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమరా వేదగిరి, నాయకులు పులి చక్రపాణి, రవ్వా సుబ్బారావు, గంగినేని వెంకటేశ్వర్లునాయుడు, ఖమర్‌బాబు, ద్రోణాదుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	2,756
సవర (8 గ్రాములు)	22,048
వెండి కిలో ధర	41,400
వెండి గ్రాము ధర	41.40

చికెన్ ధరలు



వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	84
లేయర్	82
స్కిన్ చికెన్	139
స్కిన్‌లెస్ చికెన్	163
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	152
స్కిన్‌లెస్	178
లేయర్	140

విద్యుత్ కార్మికులు రేపు చలో తిరుపతి

నెల్లూరు (సిటీ) : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం చలో తిరుపతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక నాయకుడు పతంజలి రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లోని విద్యుత్ కార్మికులందరిని తెలంగాణ ప్రభుత్వ తరహాలో విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని కోరారు. ఈ మేరకు పలు దఫాలు విన్నవించినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన లేదని, దీనికి నిరసనగా 8 జిల్లాలకు చెందిన కార్మికులతో చలో తిరుపతి కార్యక్రమం నిర్వహించి సీఎండీకి డిమాండ్లు తెలియజేస్తామన్నారు.

ట్యాలీ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ శిక్షణకు 21న ఎంపికలు

నెల్లూరు (వేదాయపాళెం) : జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు ట్యాలీ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌పై మూడు నెలలు శిక్షణ ఇవ్వనున్నామని, దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక ఈ నెల 21వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కమల కుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18-30 మధ్య వయస్సు కలిగి, ఇంటర్ పూర్తి చేసిన వారు శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21వ తేదీ వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8187899877 నెంబరును సంప్రదించాలన్నారు.

ఓసీడీవో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

నెల్లూరు (కలెక్టరేట్): సర్వశిక్ష అభియాన్‌లో ఓసీడీవో, మానిటరింగ్ అధికారి (ఉర్దూ) పోస్టులకు బుధవారం జేసీ చాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం ఆరుగురు అభ్యర్థులు హాజరయ్యారు. వారిని ఇన్‌చార్జి జేసీ వెంకట సుబ్బారెడ్డి ఇంటర్వ్యూ చేశారు.

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

బుధవారం గూడూరు నిమ్మమార్కెట్‌కు సెలవు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	200 క్యూసెక్కులు
ఆవిరి :	58 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: -------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	-----------

సూక్తి

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- సర్వేపల్లి రాధాకృష్ణ

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మీ ఇంట్లో దొంగలు పడ్డారట కదా నిజమేనా!

వెంగళప్ప : అవును

టీచర్ : వాళ్లను చూసి నువ్వు భయంతో దాక్కున్నావట కదా.

వెంగళప్ప : నేను భయంతో దాక్కోలేదు.

టీచర్ : మరి!

వెంగళప్ప : మా ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడం మూలంగా దొంగలకు ముఖం చూపించడానికి సిగ్గేసింది.



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియంల ▸ ....
2. ప్రయంళ ▸ ....
3. నయంన ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

కొంటె ప్రశ్న

సముద్రం మధ్యలో ఏముంటుంది?

చుక్కలు కలపండి





10,000 ఆమ్లెట్ ఫెస్టివల్

ఇంట్లో ఆమ్లెట్ రుచి చూడటం అందరూ చేసేదే. హోటల్‌కెళ్తే డబల్ ఎగ్ ఆమ్లెట్‌ను ఆర్డర్ చేస్తాం. కానీ ఏకంగా పది వేల కోడిగుడ్లతో ఆమ్లెట్ వేయడం ఎక్కడైనా చూశారా? బెల్జియంలోని మాల్‌మెడి పట్టణంలో నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవంలో అలా ఆమ్లెట్ వేశారు. కోడిగుడ్లలో ఫిప్రోనిల్ అనే విషపదార్థం ఉందంటూ వార్తలు రావడంతో ఆ భయాన్ని పోగొట్టేందుకు ఈ ఆమ్లెట్ ఉత్సవాన్ని నిర్వహించారు.

రోజూ గుడ్డు తినండి. ఆరోగ్యంగా ఉండండి అని టీవీల్లో చూస్తుంటాం. డాక్టర్లు సైతం కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. అయితే యూరప్ దేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో కోడిగుడ్లలో ప్రమాదకరమైన ఫిప్రోనిల్ అనే ఇన్‌సెక్టిసైడ్(పురుగులను చంపే రసాయన పదార్థం) ఉన్నట్లు తేలిందని వార్తలు వెలువడ్డాయి. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అలర్ట్ సిస్టమ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. బెల్జియంతో పాటు నెదర్లాండ్, జర్మనీ వంటి దాదాపు 18 దేశాల్లో ఈ రకమైన రసాయనం ఉన్న గుడ్లు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇది ఆ నోట ఈ నోట జనాల్లోకి పాకిపోయింది. దాంతో ప్రజలు గుడ్లు తినడం మానేశారు. అయితే యూరప్ దేశాల్లో ఉత్పత్తి అయ్యే గుడ్లతో ఎలాంటి ప్రమాదం లేదని, హాంకాంగ్ నుంచి కల్తీ గుడ్లు వచ్చి చేరాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ప్రజలు కొన్ని లక్షల గుడ్లను నాశనం చేశారు. ఫిప్రోనిల్ ఉండే అవకాశం ఉన్న గుడ్లన్నింటినీ సూపర్‌మార్కెట్లలో నుంచి తొలగించారు. ఈ దెబ్బకు దాదాపు 180 పౌల్ట్రీ పరిశ్రమలు మూతపడ్డాయి.



ఆమ్లెట్ ఫెస్టివల్‌తో మళ్లీ కళకళ

ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు ఆమ్లెట్ ఫెస్టివల్‌ను వేదికగా చేసుకోవాలని నిర్ణయించాయి వ్యాపార వర్గాలు. ఆమ్లెట్ ఫెస్టివల్ నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. రెండు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'ఆమ్లెట్ ఫెస్టివల్‌ను 22 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇది సంప్రదాయంగా వస్తోంది. ఇప్పుడు కోడిగుడ్లతో ప్రమాదం అని భయపడి ఫెస్టివల్ నిర్వహించకుండా ఉండలేం' అని బెల్జియంకు చెందిన ఒక కుటుంబం అభిప్రాయపడింది. నిర్వాహకులు సైతం వెనకంజ వేయకుండా ఆమ్లెట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.

ఆమ్లెట్ ఎలా వేశారంటే...!

ముందుగా నాణ్యమైన గుడ్లను వ్యాపారస్తుల నుంచి, సరఫరాదారుల దగ్గర నుంచి సేకరించారు. పట్టణంలోని సెంటర్‌లో కట్టెల పొయ్యి ఏర్పాటు చేశారు. 4 మీటర్ల వైశాల్యం ఉన్న ప్యాన్ పెట్టారు. అందులో కోడిగుడ్లను కొడుతూ బాగా కలియబెట్టారు. తరువాత ఆమ్లెట్‌లుగా వేస్తూ ఫెస్టివల్‌కు వచ్చిన వారందరికీ పంచారు. 'మా స్థానిక ఉత్పత్తులపై, మా సరఫరాదారులపై మాకు పూర్తి నమ్మకం ఉంది. మేం నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవానికి ఇంత మంది హాజరుకావడం కూడా ఆనందంగా ఉంది. ప్రజల్లో కొంత భయం మాట ఉన్న నిజం, అయితే ఇక్కడికి వచ్చిన వారి సంఖ్యను చూస్తే ముందున్నవి మంచి రోజులేనని అనిపిస్తోంది' అని కార్యక్రమానికి గ్రాండ్‌మాస్టర్‌గా పనిచేసిన గిల్లిస్ అన్నారు. గతంలోనూ బెల్జియంలో ఇలాంటి రూమర్ వ్యాపించింది. చికెన్, గుడ్లలో కార్సినోజన్‌గా పిలిచే డైఆక్సిన్ అనే విషపదార్థం ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఏటా ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు.

టంగ్‌ట్విస్టర్స్



1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

రంగులు అద్దండి



దారి కనుక్కోండి



జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. UORF ▸ ....
2. RAGE ▸ ....
3. RWEA ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

జంతర్‌మంతర్ : 1. విలయం 2. ప్రళయం 3.నయనం

జంబ్లింగ్ వర్డ్స్ : 1.FOUR 2.GEAR 3.WEAR

కొంటె ప్రశ్న : నీళ్లే ఉంటాయి.

జల పుష్పాలు


అక్వేరియం

● అక్వేరియంలకు పెరిగిన గిరాకీ

● మానసిక ఒత్తిడి నుంచి ఊరట

ముత్తుకూరు: రంగు రంగుల అందాలు... బహు రూపాలతో.... అటు ఇటు తిరుగుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి జల పుష్పాలు. అవే మనం అక్వేరియం ఫిష్‌గా పిలుచుకొనే రంగుల చేపలు. ప్రస్తుతం అక్వేరియంలపై పిల్లల నుంచి పెద్దల వరకు అందరి మనసులు దోచుకుంటున్నాయి. ఒకప్పుడు ఇవి సంపన్నుల ఇళ్లలో మాత్రమే దర్శనమిచ్చేవి. ఇప్పుడు అందరి ఇళ్లలో ప్రత్యక్షమవుతున్నాయి. రంగుల చేపల్లో మంచినీటి, ఉప్పునీటి రకాలు ఉన్నాయి. సముద్రంలో రంగుచేపల రకాలు అధికం. అత్యంత


గోల్డ్‌ఫిష్



ఆకర్షణీయమైన వింత వింత ఆకృతుల్లో లభ్యమవుతాయి. వీటి పెంపకం కాస్త ఖర్చుతో కూడుకున్నది. అందుకనే ఎక్కువ మంది మంచినీటి రంగుల చేపలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రంగుల చేపల పెంపకంలో ప్రపంచంలోనే సింగపూర్ ప్రసిద్ధి. ఆ దేశంలో ఎక్కడ చూసినా


ఆకట్టుకొనే రంగు రంగుల చేపలు

ఆకట్టుకునే అక్వేరియంలు ఉన్నాయి. మన దేశంలో కేరళ రాష్ట్రం రంగు చేపలకు ప్రసిద్ధి. మత్స్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే కేరళ ప్రభుత్వం కొచ్చిన్ విమానాశ్రయంలో ప్రయాణికుల కోసం కనువిందు చేసే అక్వేరియంలను ఏర్పాటు చేసింది.

మానసిక ఒత్తిడి నుంచి ఊరట

వింత వింత సోయగాలతో ఆకర్షించే అక్వేరియం చేపలతో ఉల్లాసంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని వైద్యులు నిర్ధారించారు. రంగుల చేపల పెంపకానికి ఉపాధి హోదా కలిగించేందుకు ఎంపెడా కృషి చేస్తోంది. ఇందుకోసం జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో రంగు చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ముత్తుకూరు మత్స్య కళాశాలలో ఆసక్తి గల మహిళలకు ఇందులో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పనకు రుణాలు అందజేస్తున్నారు. అయితే అక్వేరియంల ఏర్పాటులో సరైన జాగ్రత్తలు పాటించకపోతే చేపలు చనిపోయే ప్రమాదం ఉంది. అందుకే రంగుల చేపల పెంపకంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై మత్స్య నిపుణుల సలహాలివి.

● కొన్ని రకాల చేపలు పరస్పరం పోట్లాడుకుంటాయి. అలాంటి రకాలను ఒకే తొట్టిలో ఉంచరాదు. ● మార్చేందుకు ఉపయోగించే నీటిని ఒక రోజు బక్కెట్‌లో నిల్వ ఉంచి వాడాలి. ● సూర్యకాంతి లేదా కృత్రిమ వెలుగు ఉండేలా ఏర్పాటు చేయాలి. ●మేతను అవసరమైన మేరకే వేయాలి.

ఆశాజనకంగా నిమ్మ ధరలు



● గతేడాదితో పోలిస్తే పెరుగుదల

గూడూరు: డివిజన్ పరిధిలో నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయని సాగుదారులు అంటున్నారు. గూడూరు డివిజన్ నిమ్మమార్కెట్‌లో అనువైన వాతావరణం వుండటంతో మరల కాయలు తరలివస్తున్నాయి.. గత నెల వరకు నిమ్మధరలు దిగజారి రైతుల డీలాపడిపోయారు. గూడూరు నిమ్మమార్కెట్‌లో నామమాత్రంగా లావాదేవీలకు కారణమయింది. ఈ క్రమంలో పది రోజుల నుంచి నిమ్మధరలు ఊపందుకు న్నాయి. కాయల దిగుబడి తగ్గడం, ఉత్తరాది రాష్ట్రాలలో వాతావరణ మార్పుల కారణంగా కాయలకు డిమాండ్ ఏర్పడింది.

● పెరిగిన ఖర్చులు

నిమ్మ సాగులో వ్యవసాయ ఖర్చులైన ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చు విపరీతంగా పెరగడంతో నిమ్మసాగు చేపట్టాలంటేనే రైతులు హడలిపోయే పరిస్థితి ఏర్పడిన సమయంలో ధరల పెరుగుదల కొంత ఊరట కలిగించింది.. ఎకరాకు సుమారు ప్రతి ఏడాది రూ.30 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని, ధరలు పతనావస్థకు చేరడంతో తోటల్లో కాయలు కోయడం రైతులు మానేశారు. ధరల మాయజాలంతో శ్రమించి పండించిన నిమ్మకు గిట్టుబాటు ధర పలకడం లేదు. దీంతో అయోమయంలో ఉన్న రైతులకు లూజు బస్తా ధర పచ్చివి రూ.3300 కి చేరింది. పండ్లు లూజు బస్తా ధర 2200 పలుకు తుంది. దీంతో రైతులలో ఆశలు చిగురిం చడంతో కాయలు తోటల నుంచి మార్కెట్‌లకు తరలిస్తున్నారు.

ఇదే విధంగా గతేడాది ఈ ఆగస్టు నెలకు లూజు బస్తా రూ.2 వేలకు మించి పలకలేదు. ఈ ఏడాది ఇదే పరిస్థితి ఉత్పన్నమయితే దిగా లు పడ్డారు. ధరలు కొలిక్కి రావడంతో రైతులు కళకళలాడుతున్నారు. అయితే అదే సమయంలో ధరలు దిగుబడి తగ్గడంతో ఆందోళనకు గురవుతున్నారు.

నిమ్మ ఆధారిత ఫ్యాక్టరీలు ఈ ప్రాంతంలో నెలకొల్పి నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం ప్రకటిస్తుందే తప్ప ఆచరణలో చూపకపోవడంతో ఈ ప్రాంత నిమ్మరైతులలో నెలకొంటుంది. నిమ్మ రైతులను ప్రోత్సాహించేలా ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెడుతున్న ఆచరణలో అమలు నోచుకోకపోవడంతో


లోడింగ్‌కు సిద్ధమవుతున్న నిమ్మకాయల బస్తాలు

నూతనంగా నిమ్మ సాగు చేపట్టేందుకు ఎవరూ



ఖర్చులు పెరిగాయి

నిమ్మసాగుకు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఎరువులు, పురుగుమందులు, కూలీల ధరలు గత పదేళ్లలో మూడింతలు అయ్యాయి. కానీ కాయల దిగుబడి మాత్రం తగ్గుతూ వస్తుంది. కానీ నిమ్మ ధరలు పెరగడం ఆనందంగా ఉంది.

- శ్రీనివాసులురెడ్డి ,రైతు



ధరలు ఆశాజనకం

గూడూరు మార్కెట్‌లలో నిమ్మధరలు పెరగడంతో రైతులలో ఆనందం వ్యక్తమవుతుంది. ఈ తరహాలో ధరలు దసరా వరకు కొనసాగితే రైతులు కోలుకునే అవకాశం ఉంది.

- రమణారెడ్డి, వ్యాపారి

● గోదాములు నిర్మించాలి..

ఉత్తరాది మార్కెట్‌లను అనుసరించి నిమ్మతోటలను సాగు చేయాలంటే ఇబ్బందికరంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముందుకు రావడం లేదు. ధరలు తగ్గినపుడు గోదాములలో దాచి ధరలు పెరిగినపుడు విక్రయించుకునేలా గోదాముల సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీల ప్రభుపాద వ్యాసపూజ

నెల్లూరు (సాంస్కృతికం) : నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఉదయం వైష్ణవ భజన, కీర్తనలు, శ్రీల ప్రభుపాద అభిషేకం, వ్యాసపూజ, డాక్టరు శుకదేవస్వామి ప్రవచనం జరిగాయి. మధ్యాహ్నం ఆరతి, 56 వంటకాల నివేదన జరిగాయి. అభిషేకాలు, ఊంజల్ సేవ, నందోత్సవ విందు జరిగాయి. భక్తులు శ్రీలప్రభుపాద స్వామికి పుష్పాంజలి గావించారు. విజయ డెయిరీ ఛైర్మన్ కే రంగారెడ్డి, నగర కమిషనర్ ఢిల్లీరావు, తుంగా శివప్రభాత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.


శ్రీల ప్రభుపాద స్వామికి వ్యాసపూజ అలంకారం

చుంచులూరులో ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ


ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కంటే వెంకటేశ్వర్లు, శోభారాణి దంపతుల సహకారంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మహాకుంభాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం విగ్రహ దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరుపై ప్రత్యేక దృష్టి

● పాల విషయంలో జాగ్రత్త ● ప్రతి చిన్నారికీ ఎమ్మార్ వ్యాక్సిన్
● త్వరలో సోషల్ ఆడిట్‌కు అవకాశం ● ఐసీడీఎస్ పీడీ ప్రశాంతి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రశాంతి

నెల్లూరు (వేదాయపాళెం): అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ పీ ప్రశాంతి సూచించారు. బుధవారం నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో జిల్లాలోని 17 ప్రాజెక్టుల నుంచి ఎంపిక చేసిన వర్కర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంటర్లలో ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల హాజరును బట్టే పాలు, గుడ్లతో పాటు ఇతర సరుకులను తీసుకోవాలన్నారు. హాజరు తక్కువగా ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ ఒకే విధంగా సరుకులు తీసుకుంటున్న కారణంగా సెంటర్లలో సరుకులు మిగిలిపోతున్నట్లు తనిఖీలలో స్పష్టమైందన్నారు. దీనిపై ఇప్పటికే రెండు నెలలుగా చెబుతున్నామని వెంటనే ప్రతి సెంటర్‌లో దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సెంటర్లకు వస్తున్న పాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే వెనక్కు ఇచ్చేయాలని, సప్లైదారుడికి దీనికి చెల్లింపులు జరగకుండా చూడాలన్నారు.

● ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రతి సెంటర్‌లో ఉన్న పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన తప్పక వేయించాలని, దీనిపై త్వరలో వర్కర్ల నుంచి ధ్రువీకరణ తీసుకుంటామన్నారు. త్వరలో సోషల్ ఆడిట్ జరిగే అవకాశం ఉన్నందున ప్రతి సెంటర్లలో రికార్డులు, ఆన్‌లైన్ డెటాను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వర్కర్ల సీనియారిటీ జాబితాను ఆయా సీడీపీవో కార్యాలయాలలో ఉంచామని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ల ఎంపిక కూడా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శేషుకుమారి పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ సిద్ధం సుష్మ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో నిర్మలాదేవి తెలిపారు. సమావేశంలో సబ్‌ప్లాన్ నిధులపై, అంగన్‌వాడీ, పంచాయతీభవనాల నిర్మాణంపై, పారిశుద్ధ్యం, తాగునీరు, వ్యాధులు, వ్యాక్సిన్లు, ప్రభుత్వ సహకారం, ఉపాధిహామీ, ఎన్టీఆర్ గృహనిర్మాణాలపై సమీక్ష జరుగు తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లామని తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

● ఇంటర్వ్యూ



పావు గంటలో పాస్ పుస్తకాలు

ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు

? : మీ-సేవా ద్వారా పట్టాదారుపాస్‌పుస్తకాలు ఎలా పొందాలి.

! : అడంగల్, 1బి నమోదై ఉండి పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని వారు మీ-సేవా ద్వారా సులభంగా పొందవచ్చు. దరఖాస్తు చేసుకున్న 15 నిమి షాల్లో పట్టాదా రుపుస్తకం చేతికందుతుంది.

? : మీ-సేవా ద్వారా పొందే పాస్‌పుస్తకాలకు, సాధారణ పుస్తకాలకు తేడా ఏమిటి?

! : సాధారణ పాస్‌పుస్తకాలకు, మీ-సేవా ద్వారా పొందేవాటికి తేడా ఏమీ లేదు. బ్యాంకురుణాలు, తదితర అన్నింటికీ ఉపయో గపడతాయి.

? : రికార్డుల్లో తప్పుల గుర్తింపు కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?

! : కలెక్టర్ ఆదేశాల మేరకు గతనెల నుంచి వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు రెవెన్యూ రికార్డుల్లోని సర్వేనెంబర్, రైతుపేరు, ఖాతా నెంబర్ తదితరాల్లో తప్పులుగా ఉన్న వాటిని గుర్తించారు. ఇప్పటి వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ 80 శాతం తప్పులు గుర్తింపును పూర్తి చేశాం.

? : సర్వే కోసం ధరఖాస్తు చేసుకుంటే నెలలు తరబడి ఆలస్యమవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు? కారణ మేమిటి.

! : ఆలస్యమవుతున్న మాట వాస్తవమే. ఉన్న ఒక్క సర్వేయర్ ప్రభుత్వం చేపట్టిన కొలాబ్స్ ప్రోగ్రాం చేపట్టడంతో సర్వే ఆలస్య మవుతోంది. ఆ కార్యక్రమం పూర్తయిన వెంటనే త్వరలో సర్వే పనులు పూర్తి చేస్తాం.

- ఏఎస్‌పేట

పరిమళించిన మానవత్వం

● డాక్టర్ల వినూత్న ప్రయోగం
● మానవత్వపు గోడ ఏర్పాటు

ప్రస్తుత సమాజంలో మానవులు ఏ వస్తువునైనా కొంతకాలమే వాడుకుని నిరుపయోగంగా పడేస్తుంటారు. మరికొందరు పాతవస్తువులను ఎర్రగడ్డలకూ, స్టీల్‌వస్తువులకూ అమ్ముతుంటారు. ఇంకొందరు వృథాగా పక్కన పడేస్తుంటారు. ఈ నేపథ్యంలో పని కిరాని వస్తువులు సైతం కొందరు అభాగ్యులకు కొంతమేర అండగా నిలుస్తాయనే లక్ష్యంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్య శాలలో సూపరిం టెండెంట్ చెన్నయ్య నేతృత్వ ంలో డాక్టర్లు వినూ త్నప్ర యోగా నికి శ్రీకారం చుట్టారు. ఆసుపత్రి బయట మాన వత్వపు గోడ (క్రైన్డ్‌ఆఫ్‌వాల్)ను నిర్మిం చారు. స్వాతంత్ర్య దినోత్సవం సం దర్భంగా కౌన్సిలర్ డక్కా రమణమ్మ ప్రారంభింపజేశారు.



క్రైన్డ్‌ఆఫ్‌వాల్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ డక్కా రమణమ్మ, డాక్టర్లు(ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని 100 పడకల వైద్యశాల ప్రధాన గేటుకు పక్కనే మానవత్వపు గోడను మలిచారు. ఎవరైనా తమ వద్ద అనవసరమైన వస్తువులు, దుస్తులు, పుస్తకాలు, వృథాగా ఉన్న వాటిని మరొకరికి ఉపయోగపడేలా మానవత్వపు గోడ వద్ద వితరణగా అందచేసేలా ఏర్పాటు చేశారు. అలా సమకూరిన వస్తువులను నిరుపేదల రోగులకు ఆసరాగా ఉపయోగించేదిశగా డాక్టర్లు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టడం హర్షదాయకం. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే దాతలు, రోగుల బంధువులు మానవత్వపుగోడ వద్ద తమ వద్ద అవసరమైన వస్తువులను వదిలేసి వెళ్లే విధంగా ప్రచారానికి నడుంబిగించారు. మానవత్వం పరిమళించిన నేపథ్యంలో ఎందరో దాతల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. తమ వద్ద పనికిరాని వస్తువులను వృథాగా పడేసేకన్నా కొందరు అభాగ్యులకైనా ఉపయోగపడుతాయని మానవత్వపు గోడ వద్ద వితరణగా అందచేసేందుకు ముందుకు వస్తుండడం సంతోషకరం. దానికితోడు ప్రభుత్వ వైద్యశాలలో మౌలికవసతుల్లో భాగంగా సూపరింటెండెంట్ డాక్టర్ చెన్నయ్య, డాక్టర్లు, వైద్యసిబ్బంది ఆసుపత్రి ముందు భాగాన ఓ చెట్టు కింద పెద్ద అరుగును ఏర్పాటు చేయించారు. రోగులు, వారి బంధువులు ఆసుపత్రిలో కూర్చునేందుకు ఈ అరుగు ఎంతగానో ఉపయో గపడుతోంది. ఇలా ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేసే డాక్టర్లు అంకిత భావంతో విధులు నిర్వహించ డమేకాకుండా రోగుల సేవలో తరించడం అభినందనీయం.


అభాగ్యులకు ఆసరాగా క్రైన్డ్‌ఆఫ్‌వాల్



ప్రభుత్వ వైద్యశాలకు ఎంతోమంది అభాగ్యులైన రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వారిలో కొంతమందికి ధరించడానికి సరైన బట్టలు కూడా ఉండవు. కాళ్లకు చెప్పులు ఉండవు. ఇలాంటి వారికి కొంతైనా ఆసరాగా నిలిచేందుకే వైద్యశాలలోని డాక్టర్లు లలితశేఖర్, గోపికృష్ణ, బాలాజీ, చైతన్య, సిబ్బంది సలహా మేరకు మానవత్వపుగోడ (క్రైన్డ్‌ఆఫ్‌వాల్)కు శ్రీకారం చుట్టాం. ఎవరైనా తమ వద్ద అవసరమైన ఎలాంటి వస్తువులైనా మరొకరికి ఉపయోగపడేలా ఇక్కడ ఉంచవచ్చు.

డాక్టర్ చెన్నయ్య, సూపరింటెండెంట్,

మానవత్వం పరిమళిస్తుంది



ప్రస్తుత కంప్యూటర్‌యుగంలోను మానవత్వం పరిమళిస్తూనే ఉంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కొంతమంది దాతలు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే నిరుపేదరోగులకు కొంతైనా అండగా నిలిచే దిశగా మానవత్వపుగోడకు శ్రీకారం చుట్టడంలో సూపరింటెండెంట్ చెన్నయ్య సృష్టి అద్భుతం. దాతల నుంచి అనూహ్యస్పందన లభిస్తుందని ఆశిస్తున్నాం. ఎవరికైనా పనికిరాని వస్తువులు మరొకరికి ఉపయోగపడితే వారికి సంతృప్తే.

డాక్టర్ బాలాజీ, 100 పడకల వైద్యశాల, ఆత్మకూరు

మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆత్మకూరు: రాష్ట్రమంత్రి ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కెవిపిఎస్) ఆధ్వర్యంలో బుధవారం మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక మున్సిపల్ బస్టాండ్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ ఒక రాష్ట్రమంత్రి దళితులపై చులకన భావంగా మాట్లాడడం ప్రజాస్వామ్య విరుద్ధచర్య అని ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం ఆత్మకూరు డివిజన్ కార్యదర్శి మూలి వెంగయ్య, కెవిపిఎస్, డేవిడ్‌రాజు, నాగేంద్ర, వెంకటయ్య, సాలారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతులకు సన్మానం



అవార్డు అందుకుంటున్న ఎక్సైజ్ ఎస్ఐ ప్రభాకర్(ఫైల్)

ఆత్మకూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి స్వాతంత్ర్యదినోత్సవం వేడుకల్లో ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకున్న వారికి సన్మానం చేశారు. బుధవారం ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయంలో ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ ప్రభాకర్ ఉత్తమ అధికారులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి నుంచి అవార్డు అందుతున్నారు. ఆత్మకూరులోని 100 పడకల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ తిరుమలచైతన్య, నర్సు విజయలక్ష్మి, వీసీఓ శారద అవార్డులు అందుకున్నారు. అధికారులు, సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.

దళితుల పట్ల చులకన తగదు

ఆత్మకూరు: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరగడంతో పాటు టీడీపీ నేతలు మరీ చులకనభావంగా చూస్తున్నారని వైసీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దళితులపై చేసిన వివక్షతపూరిత వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పడం సముచితమన్నారు. ప్రకాశం జిల్లా దేవరపల్లి ఎకరాల దళితుల భూములు దురాక్రమణకు గురయ్యాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో గరగపర్రులో దళితులు సాంఘిక బహిష్కరణకు గురికావడం బాధాకర మన్నారు. టీడీపీ ప్రభుత్వం దళితుల పట్ల, వారి సంక్షేమ పట్ల చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమవుతుందన్నారు.

శ్మశాన ఆక్రమణకు యత్నం

● తహసీల్దారుకు గుడిపాడు వాసుల వినతి



ఇన్‌చార్జి తహసీల్దారుకు బాధితుల మొర

ఏఎస్‌పేట: తమ గ్రామ శ్మశానస్థలాన్ని పట్టాభూమి అని చెప్పి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని గుడిపాడు గ్రామస్థులు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజుకు ఫిర్యాదు చేశారు. 30 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీలు సుమారు 5 ఎకరాలను శ్మశానంగా వినియోగించుకుంటున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన మునలయ్య శ్మశానం తన పట్టాభూమి అని, ఇక్కడ శవాలను పూడ్చకూడదని అంటున్నారు. శ్మశానాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఓ, ఆర్‌ఐలతో విచారించి తగిన న్యాయం చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు వారికి తెలియజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: మండలంలోని కరటంపాడు పంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కరటంపాడు మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ జి.రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేదిశగా కృషి చేసిన ఉపాధ్యాయులు పి శ్రీనివాసులు, ఆర్ రామసుబ్బారెడ్డి, ఎన్ శ్రీనివాసులు, ఎస్ ఖాజారెడ్డి పనితీరును ప్రశంసించారు.

దళితులను కించపరిస్తే సహించం

అనంతసాగరం: దళితులను కించపరిచే విధంగా మాట్లాడితే సహించబోమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ రాష్ట్ర ఉద్యోగస్తుల సంఘం నాయకులు బల్లి సుబ్బయ్య పేర్కొన్నారు. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు వచ్చిన మంత్రి ఆది నారాయణరెడ్డి దళితులను చిన్నచూపు చూసేవిధంగా మాట్లాడారన్నారు. దళితులపై చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కుతీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కష్టాల్లో మినుము రైతు

- సిద్ధంగా దుక్కులు దున్నిన పొలాలు
- గతేడాదీ ఇదే దుస్థితి
- వర్షం రాకపోతే తీవ్రంగా నష్టమే

రెండేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో మెట్ట ప్రాంత రైతులు దోలాయమానంలో ఉన్నారు. ఇటీవల చినుకులు కురిశాయి. ఆ ధైర్యంతో దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్నారు. సరిపడా వర్షాలు కురవకపోతుండడంతో పడిన కష్టం వృధాగా మారుతుందని ఆవేదన చెందుతున్నారు. గతేడాది దుక్కులు దన్ని పదును లేక భూములను అలాగే వదిలేశారు. అవి బీళ్లుగా మారాయి. ఈ ఏడాదీ అదే పరిస్థితి పునరావృతమవుతుందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఏఎస్‌పేట


పొలాల్లో దుక్కి దున్నుతున్న రైతు

ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంత రైతులు వర్షాధారంపైనే పంటలు పండిస్తారు. అత్యధికంగా మినుము సాగు చేస్తారు. 2015లో తొలుత పదును వర్షాలు కురిశాయి. దాంతో మినుమును అధికంగా సాగుచేశారు. పంట కోసే సమయంలో వరదలు రావడంతో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని ప్రత్యేక బృందాలతో పంటనష్టంపై సర్వే నిర్వహించింది. బృందం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకూ నష్టపరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అదును ఉన్నా పదును వాన రాలేదు

గతేడాది చిన్నపాటి వర్షాలు కురవడంతో రైతులు అత్యధిక సంఖ్యలో దుక్కులు దున్ని మినుము పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అదును దాటుతున్నా సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో విత్తకుండానే దుక్కులను వదిలేశారు. దీంతో అవి బీడు భూములుగా మారాయి. గతేడాది లాగే ఈ ఏడాదీ వర్షాలు కురుస్తాయన్న ఆశతో మళ్లీ దుక్కులు దున్ని సాగుకు సిద్ధమవుతున్నారు. విత్తనాలు సైతం తీసుకొచ్చి ఉన్నారు. వర్షం కురిస్తే విత్తవచ్చని ఎదురుచూస్తున్నారు. ఇంత వరకూ వర్షం జాడే లేదు.

ఏటా నష్టపోతున్న రైతులు

ప్రకృతి వైపరీత్యాలతో మినుము రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం వర్షాలు బాగా కురవడంతో పంటలు బాగా పండుతాయని ఆశపడ్డారు. వర్షాలు కాస్త వరదలుగా మారడంతో పంట నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ సరైన వానలు లేవు. ఈ ఏడాదీ వర్షాలు కురవకపోతే తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దుక్కులతో సిద్ధంగా ఉన్నాం



చిరు జల్లులు కురవడంతో పొలాల్లో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేశాం. వానలు ఓ మోస్తరు పడినా విత్తనం విత్తాలని ఎదురుచూస్తున్నాం. రెండేళ్లుగా పంటలు లేకపోవడంతో ఏ పని చేయలేక కుటుంబపోషణ భారంగా మారింది.

గూళ్లపెద్ద వీరయ్య, వెల్పులగుంట


ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజును సన్మానిస్తున్న ఎంఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ

నాగరాజుకు ఘనసన్మానం

ఏఎస్‌పేట: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఎంఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజుకు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆయనకు ఉత్తమసేవా అవార్డు లభించింది. దీంతో ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజుకు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశభవిష్యత్


సామగ్రి పంపిణీ చేస్తున్న కేతా విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు: యువత చేతుల్లోనే దేశం భవిష్యత్ ఆధారపడి ఉందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. చెర్లోయడవల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మిలీనియం'ను విజయవంతం చేయాలి

అనంతసాగరం: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో చేపడుతున్న మిలీనియంమార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ జిల్లాప్రధానకార్యదర్శి రామకిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. 1న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగస్తులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చెంచుకృష్ణమ్మ, పౌరసరఫరాల శాఖ డీటీ శేషయ్య, సీపీఎస్ మండల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ప్రత్యేక గుర్తింపు


మనోహర్‌ను అభినందిస్తున్న హెచ్‌డబ్ల్యువో, శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్

అనంతసాగరం: కష్టపడి చదివితే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అనంతసాగరం బీసీ బాలుర వసతిగృహ హెచ్‌డబ్ల్యువో జబ్బార్, శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్ గోలి ప్రభాకర్ తెలిపారు. బుధవారం అనంతసాగరం వసతిగృహంలో 10వ తరగతి ఫలితాల్లో 10కి పది పాయింట్లు సాధించిన మనోహర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మనోహర్ 10కి పది పాయింట్లు సాధించడంతో కలెక్టర్ ముత్యాలరాజు ఆ విద్యార్థికి ల్యాప్‌టాప్, మెమెంటోలు అందించడం పట్ల అభినందించారు.

పెరుగుతున్న కాలువ వివాదం


కోటితీర్థం సమీపంలో గంగిరెడ్డికాలువపై జరుగుతున్న వంతెన నిర్మాణాన్ని ఆపాలంటున్న ప్రజలు

చేజర్ల: మండలంలోని కోటితీర్థంలో గంగిరెడ్డికాలువపై నిర్మిస్తున్న వంతెనకు వ్యతిరేకంగా కింద గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణాన్ని పరిశీలించేందుకు బుధవారం అక్కడికి వచ్చిన అధికారులను టీకెపాడు, మడపల్లి గ్రామస్తులు నిలదీశారు. గంగిరెడ్డికాలువ కింద తూర్పుకంభంపాడు, మడపల్లితో పాటు చేజర్ల వరకు 3000 ఎకరాలపైగా వరి సాగు చేస్తున్నామని, ప్రస్తుతం కాలువ మీద చిన్నతూములు వేసి నిర్మాణాలు చేపట్టడం వలన రానున్న రోజుల్లో నీరు అందక ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులకు విన్నవించారు. రెండ్రోజులుగా విషయంపై తీవ్ర వాగ్వివాదాలు నెలకొంటున్నాయి.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

మర్రిపాడు: మండల పరిధిలోని కంపసముద్రం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారంరాత్రి అంగరంగవైభవంగా గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ళు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, పండరీభజనలు నిర్వహించారు. కృష్ణదేవరాయలకాలం నాటి ఆలయంలో ప్రతి సంవత్సరం పూజలను గ్రామస్తులు చేపడుతున్నారు. నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

నేడు పెగళ్లపాడులో వైద్యశిబిరం

మర్రిపాడు: మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించ నున్నట్లు మర్రిపాడు పీహెచ్‌సీ ఆరోగ్యమిత్ర వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

చేజర్ల: మండలంలోని ఓబులాయపల్లిలో ఇటీవల సెల్‌ఫోన్ చోరీ చేసేందుకు ప్రయత్నిస్తూ గ్రామస్థులకు పట్టుబడిన పవన్‌కుమార్‌ను బుధవారం చేజర్ల ఎస్‌ఐ బాచిరెడ్డి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఇటీవల మండలంలోని విద్యుత్ కార్యాలయంలో చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని ఆత్మకూరు కోర్టుకు హాజరుపరచినట్లు ఎస్‌ఐ బాచిరెడ్డి తెలిపారు.

శిక్షణ టీడీపీ నేతలు

అనంతసాగరం: ప్రకాశం జిల్లా కందుకూరులో జరుగుతున్న తెలుగు దేశంపార్టీ శిక్షణ తరగతులకు అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తరలివెళ్లారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తాము పాల్గొంటున్నామని శాఖమూరి వెంకటేశ్వర్లునాయుడు, సుధాకర్‌నాయుడు, పెంచలనాయుడు పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

అనంతసాగరం: మండలంలోని ఉప్పలపాడు చెరువుకట్టపై బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో సోమశిలకు చెందిన ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ప్రసాద్ బైక్‌పై అనంతసాగరం వస్తుండగా అనంతసాగరం నుంచి సోమశిల వైపు వెళుతున్న అరటిపండ్ల ఆటో ఢీకొట్టింది. దీంతో ప్రసాద్ కాలికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం అతన్ని ఆత్మకూరుకు తరలించారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు(టౌన్): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్‌యూఐ కళాశాల కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కళాశాలలో కమిటీలను ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేసి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తున్నామని, భవిష్యత్‌లో వీటిని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సెలవు రోజుల్లో విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడాన్ని ఎండగడుతామన్నారు. కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రాహుల్, మురళి, ఉపాధ్యక్షులుగా తాముద్దీన్, విష్ణు, సహాయ కార్యదర్శులుగా నిరంజన్, సాయి కుమార్, పవన్, సభ్యులుగా శివ, మునీంద్ర, హరికృష్ణ, జీవ, హరీష్, కొండయ్య, సురేష్, అనిల్, సుమంత్‌లను ఎంపిక చేశామన్నారు.

కొనలేం.. తినలేం!

● మండుతున్న కూరగాయల ధరలు ● రుచికరమైన వంటలు దూరం
● ఆందోళనలో ప్రజలు



వివిధ రకాల కూరగాయలు

గూడూరు: కూరగాయలు ధరలు మండుతుండటంతో రుచికరమైన వంటలకు ప్రజలు దూరమవుతున్నారు. కాలాలతో పని లేకుండా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గతంలో వర్షాకాలం, వేసవి కాలం, రవాణా సౌకర్యం స్తంభించినప్పుడు కూరగాయలు ధరలు పెరగడం సహజంగా ఉండేది. ఇప్పుడు దిగుబడి తగ్గింది. సీజన్ కాదంటూ కూరగాయల ధరలు విపరీతంగా పెంచుతున్నారు. దీంతో మార్కెట్‌లో ఖినియోగారులకు ఆకుకూరలు, కూరగాయలు కొనాలంటే చుక్కలు కనపడుతున్నాయి. ఈ క్రమంలో ఏం కొనలేం.. తినలేమంటు ప్రజలు పెదవి విరుస్తున్నారు. గూడూరు కూరగాయల మార్కెట్‌లో ప్రస్తుతం వంద రూపాయలకు రెండు రకాల కూరగాయలు మాత్రమే వస్తున్నాయి. గతంలో వందకు సంచి నిండుగా కూరగాయలు తీసుకువచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుత పరిస్థితికి వినియోగదారులు అవాక్కవుతున్నారు. గూడూరు సమీపంలోని చెంబడిపాళెం, బద్దెవోలు, విందూరుకండ్రిగ, రామలింగాపురం, వెడిచెర్ల ప్రాంతాల్లో పండించే కూరగాయల తోటలలో దిగుబడి తగ్గిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో స్థానికంగా వచ్చే వంకాయలు, బెండకాయలు నిలిచిపోయాయి. అదేవిధంగా కర్ణాటకలోని కోలార్, మదనపల్లి ప్రాంతాల నుంచి వచ్చే టమోటా రవాణా అంతంత మాత్రంగానే ఉంది. అదేవిధంగా మునగకాయలు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి రావడంతో వినియోగదారులపై పెనుభారం పడుతోంది. ఈక్రమంలో చెన్నై మార్కెట్ మీదే ఆధారపడి కూరగాయల వ్యాపారం సాగుతోంది. కూరగాయల ధరలతో పాటు ఆకు కూరల ధరలు మండిపోతున్నాయి. దిగుబడి తగ్గడం వలన కూరగాయలు, ఆకుకూరల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. అత్యధికంగా కిలో మునగకాయలు 60 రూపాయలకు విక్రయిస్తున్నారు. పందిరి చిక్కుళ్లు కిలో రూ. 60, వంకాయలు కిలో రూ.60, బెండకాయలు, గోరుచిక్కుళ్లు, దోసకాయలు కిలో. 30 రూపాయలు అమ్ముతున్నారు. క్యారెట్, బీన్స్, బీట్‌రూట్, ముల్లంగి కిలో 60 రూపాయలు పలుకుతున్నాయి. మిర్చి, బంగాళాదుంపలు 30 రూపాయలు అమ్ముతున్నారు. టమోటాలు మాత్రం కిలో 50 రూపాయలకు తగ్గకుండా వారం రోజులు నుంచి విక్రయాలు సాగిస్తున్నారు. ఆకు కూరలు మార్కెట్‌కు రావడమే గగనమవుతోంది. ఈ పరిస్థితిలో వచ్చిన కొద్దిపాటి ఆకుకూరలు కట్ట రూ.5, రూ. 7లకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల నడుమ కూరగాయల కంటే పప్పుదినుసులతోనే వంటలు చేసుకోవడం నయమని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కూరగాయలు, ఎర్రగడ్డల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మునగకాయలు

ఇంటర్వ్యూ



1927 మంది చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశాం

● బ్రిజిత, వైద్యురాలు, చిల్లకూరు పీహెచ్‌సీ

? పీహెచ్‌సీ పరిధిలోని ఎంత మంది చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు.

! చిల్లకూరు పీహెచ్‌సీ పరిధిలో 1952 మంది చిన్నారులు ఉండగా వారిలో ఇప్పటికే 1927 మందికి ఎమ్మార్ వ్యాక్సిన్ వేశాం. మిగిలిన వారికి ఈ నెల 19వ తేదీ నుంచి వ్యాక్సిన్ వేస్తాం.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు.

! గ్రామాల్లో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు తక్కువగా ఉన్నాయి. వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

? నులిపురుగుల నివారణ మందు అందజేస్తున్నారా.

! నులిపురుగుల నివారణ మందు పంపిణీ కార్యక్రమం సెప్టెంబర్‌లో నిర్వహిస్తాం.

- చిల్లకూరు

నేడు వాహనాల వేలం

గూడూరు(రూరల్): రావాణా శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు గురువారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీవో చందర్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలను అధికారులు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ వాహనదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు 40కు పైగా వివిధ వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు స్థానిక కార్యాలయంలో వివరాలు తెలుసుకుని నిబంధనల మేర వేలం పాటలలో పాల్గొనవచ్చునన్నారు.



ఆర్టీవో చందర్

అర్హులకు న్యాయం చేయండి : ఎమ్మెల్యే పాశం

గూడూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేసే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం నెల్లూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ అంబేద్కర్‌ను కలసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా టీడీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఈ పథకాలు దళారుల చేతికి చేరి దారి మళ్లకుండా నేరుగా అర్హులైన పేదలకే చేరాలన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ ద్వారా వివిధ వృత్తుల వారికి రుణాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. భూములు లేని నిరు పేద ఎస్సీలకు భూములు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ ఈడీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు దూరం

కోట: ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఎలాంటి అగ్నిప్రమాదాన్నైనా ఎదుర్కోవచ్చని అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. పట్టణంలోని వంజివాక రోడ్డులోని పెట్రోల్ బంక్ ప్రాంగణంలో బుధవారం అగ్నిప్రమాదాలపై ప్రయాణికులకు, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. వాహనాలపై వెళ్లేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం జరిగితే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాలు చేసి చూపించారు. అదేవిధంగా పెట్రోల్‌బంక్, రైస్ మిల్లులో హఠాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నామన్నారు. పలువురు వాహన చోదకులకు అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే విధానాన్ని వాహనాల ద్వారా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి పెంచలయ్య, సిబ్బంది అమరావతి చంద్రబాబు, నాగరాజు, అంకయ్య పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కల్యాణ మండపం నిర్మాణానికి నేడు శంకుస్థాపన

గూడూరు(టౌన్): స్థానిక తాళమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న కల్యాణ మండపానికి గురువారం శంకుస్థాపన చేస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక రాజావీధిలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ మూడేళ్లుగా ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కల్యాణ మండపం నిర్మాణం పూర్తయితే పట్టణ, పరిసర ప్రాంతాల వారికి శుభ కార్యక్రమాలకు అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో చెంచయ్య గౌడ్, కమ్మిటి రఘురాంగౌడ్, అర్జునయ్య, తిరకాల శంకర్‌గౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళమ్మ దేవస్థాన కమిటీ సభ్యులు

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

ప్రజలకు దైవ దర్శనం కల్పించడం సంతోషకరం

● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్


ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

వాకాడు: దైవ దర్శనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేని నిరుపేద గ్రామీణ పల్లె ప్రజలకు దాత నన్నారెడ్డి చంద్రభూషణ్‌రెడ్డి దైవ దర్శనం కల్పించడం సంతోషకరంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని కొండూరుపాళెంలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రభూషన్‌రెడ్డితో పాటు కొండూరుపాళెం గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వేదపండితులతో స్వామి వారికి జరుగుతున్న విశేష అభిషేకాలు, నిత్యహోమం కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు దైవ దర్శనం కల్పించాలన్న ఆధ్యాత్మిక ఆలోచన రావడం అరుదైన విషయమని, వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు సుమారు రూ. 50 లక్షలు వెచ్చించి తిరుమలేశుని ఆలయ నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల టీడీపీ నాయకులు పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కడూరు భాస్కర్, రామకృష్ణ, ఎస్‌వి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గూడూరు(రూరల్): మండలంలోని మేగనూరు, అయ్యవారిపాళెం గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏవో నాగమోహన్‌రావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవడం ద్వారా రైతులు ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. అదేవిధంగా రైతులకు రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు అమరేంద్ర, హైమావతి, నాగమణి, గాయత్రి, శివయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై లక్ష్మీనరసింహుడు

చిల్లకూరు: మండలంలోని కలువకొండ తిప్పపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతం తదితర పూజలు, నిత్యహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హనుమంత వాహనంపై పుర వీధులలో ఊరేగించారు. ఉభయదాతలుగా డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి, రామకృష్ణారెడ్డి, ప్రభారెడ్డి వ్యవహరించారు.

ఆర్టీసీ డ్రైవర్ చంద్రయ్యకు ఉత్తమ ఉద్యోగి అవార్డు

వాకాడు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ పీ చంద్రయ్య ఉద్యోగపరంగా చేసిన సేవలను గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం బుధవారం నెల్లూరులో ఆర్టీసీ ఆర్ఎం చేతులు మీదుగా ప్రశంసా పత్రంను అందించారు. అయితే చంద్రయ్య వరుసగా మూడోసారి ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక కావడంపై ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్కేశ్వరరావు, తోటి సిబ్బంది ఆయనను అభినందించారు. ఇలాంటి అవార్డులు ఆయన మరెన్నో అందుకోవాలని సిబ్బంది ఆకాంక్షించారు.

అమర్‌నాథ్‌రెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలి

గూడూరు(టౌన్): దళితుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిని టీడీపీ నుంచి, మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరు రవి బుధవారం డిమాండ్ చేశారు. దళితుల పట్ల అవమానంగా మాట్లాడిన మంత్రిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నివేశన స్థలాలు ఇవ్వాలంటూ గిరిజనుల ఆందోళన

కోట: నివేసన స్థలాలు ఇవ్వాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం మండలంలోని పలు గ్రామాల గిరిజనులు ఆందోళన చేశారు. జిల్లా యానాది సమ్మేఖ్య నాయకుడు కుడముల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గూడలి, కొండమిట్ట, తిన్నెలపూడి, సిద్ధవరం, కర్లపూడి గ్రామాలకు చెందిన గిరిజనులు తమకు వెంటనే నివేసన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఇంట్లో రెండేసి కుటుంబాలు నివాసం ఉంటున్నామన్నారు. అర్హులైన తమకు నివేసన స్థలాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రోజ్‌మాండ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తక్షణ చర్యలు చేపడుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గ్రామస్థుల నిరసన

చిల్లకూరు: మండలంలోని పున్నపువారిపాళెం గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు కర్మాగారం నుంచి వచ్చే కలుషిత నీటితో వాతావరణం కలుషితమవుతుందని గ్రామస్థులు బుధవారం చెరువు వద్ద ఆందోళనకు దిగారు. నీరు కలుషితం కావడం వలన పశుపక్షాదులకు ఇబ్బందిగా మారిందని వాపోయారు.

దుగ్గవరంలో సమస్యల తిష్ఠ!

● కనీస సౌకర్యాలకు నోచని వైనం ● వీధిలైట్లు లేక అవస్థ
● ముళ్లపొదల మధ్య నివాసాలు ● పాముల బెడదతో బెంబేలెత్తుతున్న ప్రజలు



వాకాడు: మండలంలోని ముట్టెంబాక పంచాయతీ పరిధిలోని దుగ్గవరం గ్రామంలో సమస్యలు తిష్ఠవేశాయి. గ్రామంలో 60 కుటుంబాలకు చెందిన 300 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. వీరి ప్రధానంగా వ్యవసాయం, వ్యవసాయ కూలీలపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్లు నిరుపయోగంగా మారాయి. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఇదిలావుండగా ప్రత్యేకంగా గ్రామంలోని అరుంధతివాడలో సమస్యలు తిష్ఠవేసి ఉన్నాయి. ఈ కాలనీలో 18 కుటుంబాలకు గాను సుమారు 100 మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. కాలనీకి ఏర్పాటు చేసిన రహదారులు అభివృద్ధికి నోచుకోక ముళ్లపొదులు మొలచి అస్తవ్యస్తంగా మారాయి. ఉన్న వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రిళ్లో ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే బయపడిపోతున్నారు. కాలనీ చుట్టూ ముళ్లపొదలు కమ్ముకుని ఉండటంతో పాముల భయంతో హడలిపోతున్నారు. కాలనీకి రోడ్లు వేయమని, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్నకాలనీ కావడంతో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేమని అధికారులు బదులిస్తున్నారని స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలంలో తమ పరిస్థితి మరీ దుర్భరంగా ఉంటుందని వాపోతున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా దళితవాడల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు అవకాశం ఉన్నా, ఈ కాలనీపై ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో కాలనీలోని ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సమస్యలను పరిష్కరించుకోలేక, ఈ కాలనీని వదిలి వేరే ప్రాంతాలలో నివాసానికి ఇళ్లు కట్టుకోలేని పరిస్థితులల్లో సమస్యలతోనే బతుకుబండిని లాగిస్తున్నారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారి కాలనీ మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు కూడా కాలనీవాసులకు దక్కడం లేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, తమ కాలనీపై దృష్టి సారించి మౌలిక సౌకర్యాలను మెరుగు పరచాలని కోరుతున్నారు.


కాలిబాటగా ప్రధాన వీధి

చిన్న కాలనీలో అభివృద్ధి చేయరంట



అధికారులను, పాలకులకు తమ సమస్యలను పరిష్కరించమని ఎన్ని సార్లు అడిగినా చిన్న కాలనీ కావడంతో నిధులు రావని, అభివృద్ధి చేయడం కుదరదని చెబుతున్నారు.
- సాము విజయమ్మ

పాములతో భయం



రోడ్లు ముళ్లపొదలతో కమ్ముకున్నాయి. వీధిలైట్లు వెలగడం లేదు. ఎన్నో సార్లు ఇళ్లల్లోకి పాములు ప్రవేశించాయి. దీంతో రాత్రుల్లో బయటకు రావాలంటే భయపడి బతుకుతున్నాం.
- సంపూర్ణమ్మ

విధ్వంసకారుడు జగన్మోహన్‌రెడ్డి

వెంకటగిరి: రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించడంలో వైఎస్ జగన్ పూర్తిగా విఫలమై విధ్వంసకారుడుగా మారాడని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన టీఎన్ఎస్ఎఫ్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేఖరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని జగన్ విధ్వంసకారుడిగా తయారయ్యారన్నారు. ఆయన బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో టీఎన్ఎస్ఎఫ్ ముందుండి పరిష్కరిస్తుందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు ప్రాధాన్యతనిస్తూ బడిపిలుస్తోంది, బడికొస్తా, మధ్యాహ్న భోజనం, హాస్టల్ సంక్షేమం, ప్రాథమిక, మధ్యమిక, ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆయన కృషి ఫలితమే రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్‌లో చేరిన విద్యార్థులను కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లు సిసింద్రి యాదవ్, నాయకులు అమ్ముల్లా, సాయికిషోర్, సాయి తేజా, భవాని శంకర్, చరణ్, శ్రీహరి, శశాంక్, శ్రీనూ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


టీఎన్ఎస్ఎఫ్‌లోకి ఆహ్వానిస్తున్న తిరుమల నాయుడు

ప్రభుత్వం స్పందించకుంటే
ఉద్యమం ఉధృతం

కోట: వెట్టిచాకిరి చేయించుకుని కనీస వేతనం కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని గ్రామీణ తపాల ఉద్యోగులు సంఘం కార్యదర్శి హరీష్, కోశాధికారి ఈశ్వరయ్య హెచ్చరించారు. మండలంలోని విద్యానగర్ పోస్టాఫీస్ ఎదుట కోట, వాకాడు, విద్యానగర్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లో పనిచేసే గ్రామీణ తపాలా ఉద్యోగులు, బీపీఎంలు బుధవారం ఆందోళన చేశారు.


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి
గురువారం, 17 ఆగస్టు 2017
నాయుడుపేట

20న వీఆర్ఏల జిల్లా సమావేశం

నాయుడుపేటరూరల్ : ఈ నెల 20వ తేదీ వీఆర్ఏల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట ఆంధ్రప్రదేశ్ గ్రామ సేవకుల సంఘం నాయకులు బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని ఎన్‌జీవో హోమ్‌లో ఆదివారం జరిగే వీఆర్ఏల సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని వీరు కోరారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఈ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని, వీఆర్ఏలంతా హాజరుకావాలని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏళ్ల మరమ్మతులకు మోక్షం..!

- నీరు-చెట్టు మూడో విడతలో కదలిక
- చెరువు కట్టల మరమ్మతులతో రైతుల్లో హర్షం..


మరమ్మతులు పూర్తయిన చెరువు కట్ట

ఓజిలి: ముప్పై ఏళ్ల చెరువులకు నీరు-చెట్టు మూడోవిడతలో మోక్షం లభించింది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పలుచెరువులు నీటినిల్వ సామర్థ్యం కోల్పోయాయి. ఈనేపథ్యంలో కలెక్టర్ ముత్యాలరాజు చొరవతీసుకుని ఈ పర్యాయం నీటివనరులలో ప్రాముఖ్యతను సంతరించుకున్న చెరువు కట్టలు, గొలుసు చెరువుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా చెరువు కట్టల పనులు జోరందుకున్నాయి. ఈమేరకు ఓజిలి మండలంలో 5 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో చెరువు కట్టలు, గొలుసు చెరువు, చెక్‌డ్యామ్ పనులు కొనసాగుతున్నాయి. గతంలో జరిగిన రెండు విడతల్లో కేవలం చెరువులో గుంతలు తీయడం, పూడికతీత పనులతో సరిపెట్టడంతో రైతులకు అంతగా ప్రయోజనం చేకూరలేదు. అదే విధంగా కలుజులు, తూముల ఏర్పాటు కాస్త ఊరటనిచ్చినా మరమ్మతులకు గురైన చెరువులు ఎప్పటికప్పుడు రైతులను ఆందోళనలో పడేస్తుండేవి. ఈనేపథ్యంలో మూడో విడత నీరు-చెట్టు పనులు పూర్తిగా చెరువు కట్టల మరమ్మతులతో జరుగుతున్నాయి.

రైతుల్లో సంతృప్తి : మెట్ట ప్రాంతాలలో వర్షాధారంపై ఆధారపడి జరుగుతున్న వ్యవసాయం ఏటా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కట్టలు బలహీనమై నీటి నిల్వ సామర్థ్యంలేని చెరువుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు చెరువు కట్టల మరమ్మతులపై దృష్టిపెట్టడంతో రైతుల్లో సంతృప్తిని స్తోంది. అయితే చేపడుతున్న చెవుకట్టల మరమ్మతులు పటిష్టంగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


ముప్పైఏళ్లుగా మరమ్మతులు లేవు...



మాగ్రామ చెరువు ముప్పై ఏళ్లగా మరమ్మతులు చేపట్టలేదు. కట్టలు బలహీనంగా ఉన్నాయి. దీంతో ఏటా నీళ్ల వృథాగాపోతుండేవి. ప్రస్తుతం మా చెరువు కట్టలు మరమ్మతులు చేపడుతున్నారు. సాగునీటి వనరులపై దృష్టి పెట్టి రైతులకు మేలుచేస్తున్న అధికారుల చర్యలు హర్షణీయం. అయితే వీటి మరమ్మతులు పటిష్టంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది.

- కోటేశ్వరరాజు, గుర్రంకొండ రైతు

నీటిని సద్వినియోగం చేసుకుంటాం



చెరువుకట్టలకు మరమ్మతులు జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లగా చెరువు కట్టలకు మరమ్మతులు జరగలేదు. నీరు-చెట్టుకింద చేపట్టిన పనులు కూడా సంతృప్తినివ్వలేదు. ఇప్పుడు చెరువు కట్టల మరమ్మతులతో చెరువుకు చేరిన నీటిని సద్వినియోగం చేసుకుంటాం. రైతులకు సాగునీరు అందించడంలో సాగునీటి సంఘాలు ధైర్యంగా ఉన్నాయి.

- గంగాబత్తిన శ్రీనివాసులశెట్టి, సాగునీటిసంఘం అధ్యక్షుడు

ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి విద్య : ఎంఈవో


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

నాయుడుపేటరూరల్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి విద్యను విద్యార్థులకు బోధిస్తున్నారని నాయుడుపేట ఎంఈవో నలమాకుల శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని రాజగోపాలపురంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఆయన నోట్‌పుస్తకాలను, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకులు పసల కిషోర్‌బాబు, న్యాయవాది కుమ్మరిగుంట శ్రీనివాసులు సొంత నిధులతో ఈ పుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని మౌళిక వసతులు కల్పిస్తూ ఇంగ్లీషు మీడియం కూడా విద్యార్థులకు బోధిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, జి. చంద్రయ్య, మురళీ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం


అవార్డులందుకున్న ఉద్యోగులను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సూళ్లూరుపేట : స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో జిల్లా మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజులచే అవార్డులు అందుకున్న సూళ్లూరుపేట ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, కోటపోలూరు వీఆర్వో వెంకటరత్నంలను సూళ్లూరుపేట రెవెన్యూ సిబ్బంది బుధవారం అభినందన సత్కారం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సీఎస్‌డీటీ రవికుమార్, డీటీ రమణయ్య, మర్రెయ్య, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

110 మందికి బస్‌పాస్‌లు పంపిణీ

చిట్టమూరు : మండల పరిధిలోని యల్లశిరి పంచాయతీలో ఉన్న పలువురు పేద విద్యార్థులకు బుధవారం సర్పంచ్ పోలిన శ్రీనివాసులు చేతులు మీదుగా ఆర్టీసీ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. యల్లశిరి పరిధిలోని ఎగువ, దిగువ గిరిజన కాలనీలు, ఎస్సీకాలనీ, యల్లశిరి పాఠశాలల్లో చదువుతున్న 110 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించేందుకుగాను సర్పంచ్ శ్రీనివాస్ 5,500 రూపాయలు ఆర్టీసీ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఎస్ఆర్ చంద్రయ్య, సుబ్రహ్మణ్యంనాయుడు, ఉపాధ్యాయులు సుధాకర్, షర్మిల, నాగరాజు, నూర్జహాన్, తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న యల్లశిరి సర్పంచు శ్రీనివాస్, ఉపాధ్యాయులు

స్వచ్ఛంద సంస్థ అవార్డు గ్రహీతకు సన్మానం

చిట్టమూరు : మండల పరిధిలోని మొలకలపూడి గ్రామంలో రమా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పున్నేపల్లి సుబ్రహ్మణ్యంను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి అమరనాథ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్టు ద్వారా 7 జిల్లాలలో పేద విద్యార్థులకు చదివిస్తూ సుమారు 25వేల మంది నిరుద్యోగ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుబ్రహ్మణ్యంను గ్రామస్తులు బషీర్‌బాషా, దొడ్డగ చంద్రబాబు, వంకా సుబ్రహ్మణ్యం, ట్రస్టు సభ్యులు నాగరాజు తదితరులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. తన కుటుంబాన్ని పూర్తిగా వదిలేసి ప్రజాసేవకే అంకితమైన సుబ్రహ్మణ్యంను గ్రామస్థులు అభినందించారు.


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న గ్రామస్థులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

● మోటారు సైకిల్ ఢీ కొని చిన్నారికి.. ● మరో ప్రమాదంలో ఇద్దరికి..

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రాఘవయ్యపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మోటారు సైకిల్ ఢీ కొని 1వ తరగతి చదివే షాలు (6) తీవ్ర గాయాలపాలైంది. మూత్ర విసర్జనకోసం పాఠశాల పక్కన ఉన్న గుంత వద్దకు ఆ బాలిక వెళ్తుండగా వేగంగా వచ్చిన ఓ మోటారు సైకిల్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆ బాలిక కాలు విరిగింది. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట షార్ బస్టాండ్ వద్ద బుధవారం రెండు మోటారు సైకిళ్ల ఢీ కొనడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఉల్లాసపడవకు చెందిన వాకాటి గురవయ్య, వట్రపాళెంకు చెందిన వంశీకృష్ణ మోటారు సైకిళ్లపై వెళ్తూ ఢీ కొన్నారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సల అనంతరం గురవయ్యను నెల్లూరుకు తరలించారు.


చికిత్స పొందుతున్న షాలు, గురవయ్య

ప్రజాస్వామ్య విలువలకు పాతర

కోవూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్య విలువలకు పాతరవేశారని పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగు గ్రామంలోని గండవరపు వెంకరెడ్డి నివాసంలో బుధవారం ఆయన కార్యకర్తలతోమాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని ప్రజలు ఛీ కొడితే మట్టిలో కలిసిపోవాల్సిందేనన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబును గద్దెదించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమన్నారు. పంచాయతీ పరిధిలోని మజరాల్లో పేదలకు తాగునీటిని అందించేందుకు వీలుగా వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ సర్పంచి వెంకరెడ్డి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొడవలూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని ఆలూరుపాడు పంచాయతీలో రూ.75.45 లక్షల నిధులతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరుపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నీరు-చెట్టు కింద సుమారు రూ. 25 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన కల్వర్టులు,వంతెనలు, బ్రిడ్జిలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగించి కొత్తవి నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

ఆంధ్రజ్యోతి

సూళ్లూరుపేట

గురువారం, 17 ఆగస్టు 2017

సూళ్లూరు పేటలో చిరుజల్లులు

సూళ్లూరుపేట: వాతావరణంలో మార్పుల కారణంగా సూళ్లూరుపేటలో బుధవారం మధ్యాహ్నం చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం వరకు ఎండ కాచినా ఒక్కసారిగా మబ్బులు కమ్మి చిరుజల్లు పడ్డాయి. దీంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రాత్రి వరకు ఇలా చల్లగాలులు వీస్తుండడంతో పట్టణ ప్రజలు ఆహ్లాదాన్ని అందుకున్నారు. కాగా వాతావరణ శాఖ ప్రకటించినట్లు వర్షం నమోదు కాకపోవడంతో పలువురు నిరాశ చెందారు. మండలంలోని పలు గ్రామాలు నీటి ఎద్దడితో అల్లాడుతున్న నేపథ్యంలో భారీ వర్షంపై పలువురు ఆశలు పెట్టుకున్నారు.

మన్నారుపోలూరులో ఉట్టి ఉత్సవం.. గ్రామోత్సవం



మన్నారుపోలూరులో గ్రామోత్సవం

సూళ్లూరుపేట సమీపం మన్నారుపోలూరులోని టీటీడీకి చెందిన ఆళఘుమల్లారుకృష్ణస్వామి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉట్టి, గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. ఆలయం ముందు ఉట్టి ఉత్సవాన్ని గ్రామానికి చెందిన యాదవ వంశీయులు కోలాహలంగా నిర్వహింపచేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. టీటీడీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట



ఉట్టి కొడుతున్న గ్రామస్థులు

మహాత్మా... మన్నించుమా!

- మందుబాబులకు అడ్డాగా గాంధీమందిరం
- రూపుకోల్పోతున్న వైనం

నాయుడుపేట : పట్టణంలోని గాంధీ మందిరం మందుబాబులకు, పార్కింగ్‌కు అడ్డాగా మారిపోతోంది. స్వాతంత్ర్యానికి మునుపు ఉప్పు సత్యాగ్రహం సమయంలో, స్వాతంత్ర్య పోరాట సమయంలో రెండు పర్యాయాలు గాంధీజీ నాయుడుపేటకు విచ్చేసి పడమటివీధుల్లో సమావేశం ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం మహాత్మాగాంధీజీ సమావేశమైన చోటే నాడు గాంధీ మందిరాన్ని ఏర్పాటు చేశారు. అంతటి ప్రాధాన్యత కలిగిన గాంధీమందిరం నేడు రూపు కోల్పోతుంది. పట్టణంలో ప్రధాన అంశాలు ప్రారంభోత్సవాలకు గాంధీమందిరం నుంచే శుభసూచకంగా ప్రారంభిస్తుంటారు. కాగా ప్రస్తుతం గాంధీమందిరం ఆలనాపాలనా లేక అస్తవ్యస్తంగా తయారైంది. గాంధీమందిరం కనిపించకుండా ఫ్లెక్సీలు కట్టడం ఆనవాయితీగా మారింది. మద్యం దుకాణాలు ఇక్కడ ఉండటంతో మందుబాబులు గాంధీమందిరంలోనే మద్యం సేవించి ఆ సీసాలను పడవేస్తున్నారు. చెత్తాచెదారాలు, మద్యంసీసాలతో, పశువుల మలమూత్రాలతో గాంధీమందిరం దర్శనమిస్తుంది. మరోపక్క గాంధీమందిరం పార్కింగ్ స్థలంగా మారిపోవడంతో దాని రూపు కోల్పోతుంది. ఇక్కడ ఉండే గాంధీజీ విగ్రహానికి కూడా ఆలనపాలన కరువైంది. గాంధీజీ కళ్లద్దాలు మాయంకాగా, చేతిలో ఉండాల్సిన ఊతకర్ర లేదు. అంతేకాకుండా విగ్రహచేతులు మరమ్మతులకు లోనయ్యాయి. మహాత్మా విగ్రహం పగుళ్లతో దర్శనమిస్తోంది.



ఈ నెల 14వ తేదీ గాంధీ విగ్రహ పరిస్థితి



ఫ్లెక్సీలతో మూసుకుపోయిన గాంధీమందిరం

నెర్రికాలువ ఆక్రమణలు తొలగించాలి

- ఇరిగేషన్, మున్సిపల్ రెవెన్యూ అధికారులకు ఆర్డీవో ఆదేశం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో నెర్రికాలువ ఆక్రమణలను రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా తొలగింపచేయాలని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. చెరువులకు నీరందించే నెర్రికాలువ సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైపోయిందన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఈ కాలువను ఇటీవల సర్వే చేయించామని ఆక్రమణలు గుర్తించడం జరిగిందన్నారు. ఆమేరకు ఆక్రమణలను అధికారులు తొలగించాలన్నారు. అనంతరం భూమి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ టి. రాజగోపాల్‌రావు, డీటీ రమణయ్య, సర్వేయర్ కంజాక్షం, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

విద్యార్థులకు జూనియర్ చాంబర్ దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట : సూళ్లూరులోని నేతాజీ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు జూనియర్ చాంబర్ నిర్వాహకులు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. జూనియర్‌చాంబర్ సభ్యులు వస్త్రసాగర్ అధినేత ఎం. రంగారావు దుస్తులను సమకూర్చారు. 34 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. జూనియర్ చాంబర్‌కు చెందిన మునగా నాగరాజు, భగవాన్‌దాస్, ఆలపాటి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. జూనియర్ చాంబర్ అధ్యక్ష కార్యదర్శులు దుర్గి సుదర్శన్‌గుప్తా, మనోజ్‌కుమార్‌లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జూనియర్ చాంబర్ నిర్వాహకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : క్రమశిక్షణ అలవరుచుకుంటేనే విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని రేబాల హైస్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. మండలంలోని రేబాల హైస్కూల్‌లో 1992 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గతేడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఇంతియాజ్‌కు రూ.5వేలు నగదు అందజేశారు. అనంతరం 1నుంచి 5తరగతుల వరకు విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, హరికృష్ణ, చంద్రజైపాల్ పాల్గొన్నారు.

మసీదులో ఉర్దూ పుస్తకాల పంపిణీ

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట పట్టణం అమరాగార్డెన్‌లో ఉన్న మసీదులో మదరసా విద్యార్థులకు బుధవారం ఎస్‌జిఎస్ యూత్ సభ్యులు ఉర్దూ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని అన్ని మసీదుల్లో ఉర్దూ చదివే పిల్లలకు ఉర్దూ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ మస్తాన్, హిదాయిత్, కరీముల్లా, షంషుద్దీన్, ఆయబ్, షాజహాన్, షఫీ, అబ్దుల్లా, మహ్మదీన్ తదితరులు ఉన్నారు.



ఉర్దూ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్‌జెఎస్ యూత్ సభ్యులు

మొక్కలు నాటిన చిరంజీవి అభిమానులు



మొక్క నాటుతున్న చిరు అభిమానులు

సూళ్లూరుపేట : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు సందర్భంగా సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో అభిమానులు బుధవారం మొక్కలు నాటారు. హేమంత్‌కుమార్, మాబాషా, రేవంత్‌కుమార్, ప్రభు ఈ కార్యక్రమాన్ని నిర్వహింపచేశారు.

టైరుబండిని ఢీ కొన్న లారీ

- ఎద్దు మృతి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట జాతీయ రహదారిపై కోటపోలూరు క్రాస్ రోడ్డు వద్ద ఓ ఇసుక టైరుబండిని చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో టైరు బండి ముక్కలై ఎద్దు మృతి చెందింది. కాళంగినది నుంచి ఇసుకను తరలించుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. టైరు బండి తోలుతున్న జంగాలగుంటకు చెందిన ముద్దు వెంకటసుబ్బయ్య (42) గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు.



ఎద్దు కళేబరం

ఉరి వేసుకుని ఒకరి మృతి

ముత్తుకూరు: ముత్తుకూరు మండలం కప్పల దొరువులో బుధవారం ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టులోని ప్రైవేట్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న రేలంగి నరేష్ (32) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఉంది. ఆర్థికపరమైన ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ముత్తుకూరు ఎస్‌ఐ సాంబశివరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల నిలయంగా బాబానగర్

తోటపల్లిగూడూరు: ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్న గ్రామస్థులకు ప్రభుత్వం సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి ఇంట్లో నుంచి అడుగు పెట్టే విధంగా చేయడం జరిగింది. అయితే మండలంలోని వరిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోగల బాబానగర్ అందుకు భిన్నంగా కనిపిస్తుంది. నాయకులు మారినా, ప్రభుత్వాలు మారినా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా బాబానగర్ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరిగొండ పంచాయితీ పరిధిలోని బాబానగర్ వీధిలో దాదాపు 20 ఏళ్లుగా ఎటువంటి మౌలిక వసతి సౌకర్యాలు కల్పించలేదు. ప్రధాన రహదారిసైతం సైడుకాలువలు నిర్మించలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా రోజుల వెంబడి మురుగునీరు ముందుకు కదలక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు జోక్యం చేసుకుని బురదమయంగా ఉన్న రోడ్లు బాగు చేయడంతోపాటు సైడు కాలువలు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

‘ఆత్మగౌరవం’లో అవినీతి

- ఎన్జీవోల చేతివాటం
- అక్రమాలపై విచారణకు టీడీపీ డిమాండ్

పొదలకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆత్మగౌరం పథకం అక్రమార్కులకు ఆదాయవనరుగా మారింది. పొదలకూరు పంచాయతీలో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రతిపక్షపార్టీకి చెందిన కొంత మంది ఓ గ్రూపుగా ఏర్పడి లక్షలాది రూపాయలు స్వాహా చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీవో నారాయణరెడ్డిని బుధవారం కలిసి ఆత్మగౌరం అక్రమాలపై విచారణ జరిపించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొగటవీధి, పుట్టాయగుంట, పద్మావతినగర్ తదిత ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఏటూరు పద్మమ్మ, ఏటూరు శేషమ్మ, అంకుపల్లి రామయ్య, అల్లూరు పెంచలరెడ్డి, ఏటూరు పద్మమ్మ, సోమవరపు పద్మయ్య, దాసరి సరోజనమ్మకు పది నెలలు గడిచినా బిల్లులు రాలేదని తమను సంప్రదించారని తెలిపారు. వీరి ఆధార్ నెంబరుతో ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించగా డిసెంబరులోనే బిల్లులు చెల్లించినట్లు తేలిందన్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సిన అధికారులు ఎన్జీవోలతో కుమ్మక్కై కాజేశారని ఆరోపించారు. ఎన్జీవోలను ప్రశ్నించిన కొందరికి మాత్రం 9వేల చొప్పున ఇచ్చి మిగిలినది ఖర్చయిపోయిందని బదులిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమాలపై విచారణ జపిఇ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ చాంద్ బాషా, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పీ అంజయ్య, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు మన్నవరపు రవికుమార్ యాదవ్ ఉన్నారు.


ఎంపీడీవో నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

వంద శాతం సబ్సిడీతో సూక్ష్మ పోషకాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వందశాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సమ్, బోరాన్‌ను పంపిణీ చేస్తోందని పొదలకూరు సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కే నాగేశ్వరరావు తెలియజేశారు. మండలంలోని ఆల్తుర్తిలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చంద్రన్న భూసార పరీక్షా పత్రాలకు అనుసంధానం చేసి బయోమెట్రిక్ విధానంలో ఈ సూక్ష్మపోషకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కౌలుకార్డులు పొందిన రైతులు వ్యవసాయ శాఖ ద్వారా పంటసాగు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గీతాకుమారి, ఆత్మ బీటీఎం జీ తస్యకుమార్, ఎటీఎంలు ఎం చైతన్య, గంగన్న, వ్యవసాయ విస్తరణాధికారి ఏడుకొండలనాయక్, రైతులు పాల్గొన్నారు.

వయ్యారిభామ కలుపు మొక్క హానికరం

పొదలకూరు: వయ్యారిభామ కలుపు మొక్క పంటలకు, మనుషులకు, పవువులకు ఎంతో హానికరమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కే శిరీష, డాక్టర్ దివ్య పేర్కొన్నారు. మండలంలోని బిరదవోలు ప్రాథమికోన్నత పాఠవాలలో బుధవారం ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వయ్యారి భామ కలుపు మొక్క వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయ్యారిభామ కలుపు మొక్క వల్ల పంట దిగుబడి 40శాతం తగ్గిపోతుందన్నారు. పుప్పొడి రేణువులు, ఆకుల వల్ల అనేక చర్మ వ్యాధులు కలుగుతాయన్నారు. ఈ కలుపు మొక్క నివారణకు ఒక లీటరు నీటిలో 500గ్రాములు కల్లు ఉప్పు కలిపి మొక్కను పూర్తిగా తడిచేలాగా పిచికారి చేయాలని సూచించారు. మెక్సికన్ బీటిల్ అనే పెంకు పెరుగులను కలుపు మొక్కలపై వదిలితే ఆ మొక్క ఆకులు, పువ్వులను తిని నాశనం చేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వయ్యారిభామ నివారణ గురించి విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త శిరీష

అవార్డు గ్రహీతలకు అభినందనలు

కావలి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు పొందిన కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ.రవి ప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్న, సంయుక్త సేవా సమితి అధ్యక్షుడు సురేంద్రలను బుధవారం రెడ్‌క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. వీరు ఉత్తమ రెడ్‌క్రాస్ వాలంటీర్లుగా ఎంపికై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదినారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం అభినందనీయమని కావలి బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ సీఎల్ఎన్ రెడ్డి, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

దగదర్తి: మండలంలో చెన్నూరు పంచాయతీలో గల చెరువును పలువురు ఆక్రమించారంటూ గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ జయప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన పలువురు సుమారు 50 ఎకరాల మేర చెరువు భూభాగాన్ని ఆక్రమించారని ఆయకట్టు రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ చెరువు ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

తోటపల్లిగూడూరు : ఈ నెల 25వ తేదీన జరగనున్న వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నరుకూరు గ్రామంలో వినాయక విగ్రహాల ప్రతిమలను అత్యంత వైభవంగా రంగురంగులతో రూపొందిస్తున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రధాన కూడలైన నరుకూరు సెంటర్ విగ్రహాల అమ్మకాలకు పెట్టింది పేరు. ఎవరైతే ముందుగా అడ్వాన్స్ ఇచ్చారే వారికే విగ్రహాలు తయారు చేస్తున్నారు. గతంలో అడ్వాన్సులు ఇవ్వకపోయినా విగ్రహాలు తయారుచేసి విక్రయించేవారు. దీనివల్ల విగ్రహాలు అమ్ముడుకాని పరిస్థితుల్లో నష్టపోయేవారు.

పైగా విగ్రహ తయారీకి అవసరమైన ముడిసరుకు ధరలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఆర్డర్లిచ్చిన మేరకే విగ్రహాలు తయారు చేస్తున్నామని తయారీదారులు పేర్కొంటున్నారు.

సరస్వతీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో దాతలు, ఉపాధ్యాయులు

కలువాయి: మండలంలోని చీపినాపి ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. దివంగత మాజీ జడ్పీటీసీ సభ్యుడు పటాపంచల వెంకటరత్నం జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు మాజీ సర్పంచు పటాపంచల కృష్ణయ్య, వెంకటరత్నం కుమారై ప్రస్తుత గ్రామ సర్పంచు సంకల సరస్వతి దాతృత్వంతో ఈ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.మలికార్జునయ్య ప్రేరణతో విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో దాతలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

కలువాయి: మండలంలోని రామన్నగారిపల్లెకు చెందిన పలువురు గిరిజనులు బుధవారం తహసీల్దారు రవీంద్రనాథ్‌ను కలసి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని గ్రామ సర్పంచు శివశంకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తాము 40 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని అక్రమించుకుని ఇళ్లు ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని తెలిపారు. ప్రస్తుతం మాకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని వాటిని అక్కడ నిర్మించుకునేందుకు నివేశిత స్థలం అప్పగింత పట్టా ఇప్పించాలని వారు కోరారు. పరిశీలన చేసి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు చూపిస్తామని తహసీల్దారు తెలిపారు.


తహసీల్దారుతో మాట్లాడుతున్న గిరిజనులు

నేడు కలిగిరిలో నేత్ర వైద్యశిబిరం

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అమ్మ-నాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మంగళగిరి వేణుగోపాలరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మోడరన్ ఐ హాస్పిటల్(నెల్లూరు), బీఎస్ఆర్ దంత వైద్యశాల(కావలి), ఆర్థో-కడప రిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం వైద్య సేవల ఒదించడం జరుగుతుందన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రూ.5.44 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ఎంపీడీవోతో సమావేశమైన సామాజిక తనిఖీ బృందం

కలువాయి: మండలంలో 2016 మే నెల నుంచి 2017 మే 31వ తేదీ వరకు జరిగిన రూ.5.44 కోట్లు జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై సమాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ తులసీనాయక్ తెలిపారు. బుధవారం సామాజిక తనిఖీ బృందం ఎంపీడీవోతో సమావేశమయ్యారు. సామాజిక తనిఖీలకు అవసరమైన రికార్డులు త్వరగా సామాజిక తనిఖీ బృందం వారికి అందజేయాలని ఉపాధి సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. వీఎస్‌ఏలను ఎంపిక చేసి వారికి శిక్షణానంతరం ఈ నెల 19వ తేదీ నుంచి గ్రామస్థాయిలో తనిఖీలు ప్రారంభం అవుతాయని ఎస్ఆర్‌పీ తెలిపారు.

బదిలీ అయిన హెచ్‌ఎంకు ఘన సన్మానం



హెచ్‌ఎం శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాపూరు: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెఎంగా పనిచేసి బుచ్చిరెడ్డిపాళెంకు బదిలీ అయిన హెచ్‌ఎం శ్రీనివాసులును బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎం రేణుక, సహచర ఉపాధ్యాయులు ఆయనను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయిని మస్తానమ్మ పాల్గొన్నారు.

అంకమ్మకు ప్రత్యేక పూజలు



చాక్లెట్ల అలంకారంలో అంకమ్మ

వెంకటగిరి: పట్టణంలోని 13వ వార్డు కాశీపేటలోని కాశీతోట సమీపంలో వెలసిన శ్రీ అంకమ్మ పోతురాజు ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అంకమ్మ దేవతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి 7 ఏళ్ల పూర్తి చేసుకొని 8వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా అంకమ్మకు పాలాభిషేకం, చాక్లెట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.

రేపు ఉన్నత పాఠశాలల్లో సైన్స్ సెమినార్

కలువాయి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఈనెల 18వ తేదీ సైన్స్ సెమినార్ జరుగుతుందని ఎంఈవో జీ.సుధీర్‌బాబు తెలిపారు. స్వచ్ఛభారత్, శాస్త్రసాంకేతిక రంగాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ జరుగుతుందని తెలిపారు. 21, 22వ తేదీల్లో మండల, డివిజన్ స్థాయిలో జరుగుతుందన్నారు.

కాసులు కురిపిస్తున్న 'నిషేధం'!



- బ్లాక్ మార్కెట్‌లో గుట్కాలు
- మొక్కుబడిగా దాడులు
- నియంత్రణలో విఫలం
- వినియోగ దారుల దోపిడీ
- అక్రమార్కులకు రాజకీయ అండ



గంజాయి పీల్చే బుర్ర

ప్రభుత్వం నిషేధించిన వస్తువులు గంజాయి, ఖైనీ, గుట్కాలు బ్లాక్ మార్కెట్‌లో బహిరంగంగా విక్రయిస్తుండటంతో అక్కమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. అక్రమార్కులకు రాజకీయ, అధికారులు ముడుపులకు దాసోహం అండదండలు మెండుగా ఉండటంతో నియంత్రణ దాడులు మొక్కుబడిగా సాగుతున్నాయి. దీంతో బ్లాక్ మార్కెట్‌లో వీటి విక్రయాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినవసుండగా వినియోగదారులు అక్రమార్కుల దోపిడీకి గురవుతుండగా అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఉన్నతాధికారుల నుంచి వత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రం మొక్కుబడి దాడులు నిర్వహిస్తూ నామమాత్రపు కేసులు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల దాడుల్లో పెద్ద మొత్తాల్లో ఇవి దొరికితే వారి నుంచి పెద్ద మోతాదుల్లో ముడుపులు అందుకుని కేవలం పెట్టీ కేసులతో సరిపెట్టు కోవడంతో అక్రమార్కులు దర్జాగా ఈ వ్యాపారాలను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల దాడుల్లో చిక్కిన అక్రమార్కులు పోయిన సొమ్మును రాబట్టు కొనేందుకు వాటి ధరలు రెక్కలు వస్తున్నాయి, అయినా వాటికి అలవాటు పడిన వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- వెంకటగిరి

వెంకటగిరి ప్రాంతంలో యథేచ్ఛగా కొనసాగుతున్న నిషేధిత మత్తు పదార్థాలను నిషేధించవలసిన ఎక్సైజ్ శాఖ అధికారులు గంజాయి, హెరాయిన్, కోకైన్, అక్రమ మద్యం వంటి ఖరీదైనవే మా బాధ్యత అని, ప్రజల ప్రాణాలను ముప్పు కలిగించే గుట్కా, ఖైనీ నిషేధం మాపరిధిలో లేదని స్పష్టం చేస్తున్నారు. కేవలం వారికి కాసులు వర్షం కురిపిస్తున్న మద్యం దుకాణాలపై మాత్రమే దృష్టి సారించి జేబులు నింపు కొంటున్నారు తప్ప మిగిలిన వాటిని గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విచ్చల విడి గంజాయి విక్రయాలు జరుగుతున్నా పట్టించుకొన్న దాఖలాలు లేవు. వెంకటగిరిలో రెండు పోలీసు స్టేషన్‌ల స్థాయి కలిగినా కేవలం ఒక్క పోలీస్ స్టేషన్ మాత్రమే ఉండటం, సిబ్బంది కొరత వెంటాడటంతో లాఅండ్ ఆర్డర్, ట్రాఫిక్, నేరనియంత్రణతో పాటు, ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా, మద్యం బెల్టుషాపుల నియంత్రణ తదితర బాధ్యతలు మీద పడటంతో ఊపిరి తిప్పుకోలేకున్నారు. దీంతోపాటు కింది స్థాయి సిబ్బంది అక్రమార్కులతో మిలాఖత్ అయి వారికి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పట్టణంలో గంజాయి, ఖైనీ, గుట్కా విక్రయాలు రోజుకు సుమారు రూ.లక్షకు పైబడి విక్రయాలు జరుగుతున్నాయి. పట్టణంలో చిల్లర, బీడి దుకాణాల్లో గుట్కా, ఖైనీలు అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తుండగా, పట్టణ పరిధిలోని కుమ్మరిమిట్ట, ఏనుగుల పాళెం, క్రాస్‌రోడ్డు, మండల పరిధిలోని మొగళ్లగుంట కొత్త కాలనీ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి, డిమాండ్‌ను బట్టి గంజాయి ప్యాకెట్ 50 నుంచి 100 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయ దారులకు రాజకీయ, అధికారుల అండ ఉండటంతో యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు గుప్పు మంటున్నాయి. అదేవిధంగా మత్తును కలిగించే విషపదార్థమైన వైట్నర్ నిషేధించినా పట్టణంలోని కొన్ని దుకాణాల్లో బాటిల్ 100 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారని తెలిసింది.

నిషేధిత వస్తువులు ధరలు

వస్తువు	గతంలో రూ.	బ్లాక్ మార్కెట్‌లో రూ.
కలేజా	4	8
ఎండీఎం	3	6
రెబల్	2	4
ఆర్ఎండీ	10	20
హాన్స్	8	25
చైనాఖైనీ	8	16

ఇలా సఫారీ, గోవా, పాన్‌పరాగ్, తిరంగా అని రోజుకో రకం మార్కెట్‌లో దిగుమతి చేస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు.



అక్రమ వ్యాపారం చేస్తే ఎవరినీ ఉపేక్షించం



అక్రమ వ్యాపారాలు చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. అక్రమ వ్యాపారంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారి ప్రమేయం ఉందని రుజువైతే పార్టీ నుంచి బహిష్కరించేందుకు కూడా వెనకాడేది లేదు.

- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

గంజాయి నియంత్రణే మా పరిధి



గంజాయి, అక్రమ మద్యం, హెరాయిన్, కొకైన్ వంటి నిషేధిత మత్తు పదార్థాలు మాపరిధికి వస్తాయి, గుట్కా, ఖైనీ వంటివి మా పరిధిలోకి రావు. గంజాయి విక్రయాలపై ఎపస్తున్నాం.

- ఎక్సైజ్ ఇన్‌చార్జి ఎస్ఐ సుబ్బరాజు

మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు



నిషేధిత మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఖైనీ, గుట్కాల వలన నోటి కేన్సర్, ఓరల్ క్యావిటీ కేన్సర్, అన్నవాహిక కేన్సర్ వస్తుంది. గంజాయి, విష పదార్థమైన వైట్నర్ వాడకంతో ప్రాణాలు కోల్పోతారు.

- డాక్టర్ జిలానీబాషా

నిషేధిత వస్తువుల కట్టడికి ప్రత్యేక చర్యలు



నిషేధిత వస్తువుల విక్రయాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. గుట్కా, ఖైనీ అక్రమ నిల్వల గోదాములు, దుకాణాలపై దాడులు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశాం. గంజాయి విక్రయాలపై నిఘా ఉంచాం.

- సీఐ శ్రీనివాసరావు

దళితులను విమర్శిస్తే ఊరుకోం

వెంకటగిరి(టౌన్): రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను విమర్శిస్తే ఊరుకునేది లేదని వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఆయన నివాసంలో విలేఖర్లతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌లు కూడా దళితులేనని, ఆవిషయం మరిచి మంత్రి దళితులను విమర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసకారుడు జగన్

వెంకటగిరి: రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించడంలో వైఎస్ జగన్ పూర్తిగా విఫలమై విధ్వంసకారుడుగా మారాడని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన టీఎన్ఎస్ఎఫ్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేఖరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని జగన్ విధ్వంసకారుడిగా తయారయ్యారన్నారు. ఆయన బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో టీఎన్ఎస్ఎఫ్ ముందుండి పరిష్కరిస్తుందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు ప్రాధాన్యతనిస్తూ బడిపిలుస్తోంది, బడికొస్తా, మధ్యాహ్న భోజనం, హాస్టల్ సంక్షేమం, ప్రాథమిక, మద్యమిక, ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆయన కృషి ఫలితమే రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్‌లో చేరిన విద్యార్థులను కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లు సిసింద్రి యాదవ్, నాయకులు అమృల్లా, సాయికిషోర్, సాయి తేజా, భవాని శంకర్, చరణ్, శ్రీహరి, శశాంక్, శ్రీనూ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



టీఎన్ఎస్ఎఫ్‌లోకి ఆహ్వానిస్తున్న తిరుమల నాయుడు